Satyadharmamlo Sangha Jeevanam
(Telugu)

సత్యధర్మంలో సంఘ జీవనం

మూలం
మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ

అనువాదం
షహెనాజ్, వరంగల్

విషయ సూచిక

ఇస్లాంలో సంఘ జీవన ప్రాముఖ్యత	6
అసంఘటిత జీవితం – పరిణామాలు	31
ఇస్లాం చూపే సామూహికత	39
ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థ	46
ముస్లిం సమాజ క్రమశిక్షణ	74
ఏకాంత జీవితం	83

• • •

ముందుమాట

మానవజాతి సుదీర్ఘకాలం వరకు దైవభావనకు దూరమయి నట్లయితే దాని ఆలోచనలలో, ఆచరణలలో, బుద్ధీజ్ఞానాలలో, గ్రాహక శక్తిలో మార్పు కనిపిస్తుంది. దానిలో క్షీణత గోచరిస్తుంది. తద్వారా ఆ జాతి తన నిజవైఖరికి దూరమవుతుంది. అల్లాహ్ మానవ జాతిని ఈ భువిపై ఏ ఉద్దేశంతో పంపడం జరిగింది? ఏ లక్ష్యం కోసం, ఏ సంకల్పాన్ని నెరవేర్చటం కోసం పంపడం జరిగింది?అనే విషయాన్ని ఆ జాతి పూర్తిగా విస్మరిస్తుంది.

అల్లాహ్ పంపిన ధర్మాన్ని భువిలో స్థాపించడం,సత్యానికి సాక్షులుగా నిలబడటం, మంచిని ఆజ్ఞాపించడం,చెడు నుండి వారించడం ముస్లిముల ప్రథమ కర్తవ్యం. అల్లాహ్ ముస్లిములకు అప్పగించిన ఈ కర్తవ్య నిర్వహ ణను,బాధ్యతాభావాన్ని ప్రపంచ జనులందరూ వీక్షించారు. ముస్లిములను కొనియాడారు. కొంత కాలం తరువాత ముస్లిములు ఏమరు పాటుకు, బద్ధకానికి లోనయి తమకు అప్పగించబడిన బాధ్యతను పూర్తిగా ఉపేక్షించారు. నిర్లక్ష్య వైఖరి కారణంగా ముస్లిములు సదాచరణలకు దూరమయ్యారు. తమ జీవిత లక్ష్యాన్ని, ధ్యేయాన్ని విడనాడారు. ఫలితంగా ముస్లిములు ధర్మభ్రష్టులయ్యారు. తమ ఉనికి యొక్క ఉద్దేశాన్నే మరచిపోయారు.

నేటి ముస్లిములు అనేక ప్రాపంచిక అవసరాల కోసం సంఘాలుగా

ఏర్పడుతున్నారు. మరెన్నో 'ఇజా'లనూ నెలకొల్పుకుంటున్నారు. వీటి నియమనిబంధనలు అన్నీ స్వయంగా తాము ఏర్పరచుకున్నవే. ధార్మిక విషయాలు ముస్లిములకు నామమాత్రంగానే మిగిలిపోయాయి. ధర్మం కొన్ని ఆచార వ్యవహారాలకు మాత్రమే పరిమితిమయింది. ముస్లిముల్లో సంఘీభావం కోసం కృషి జరుగుతున్నప్పటికీ, వీరు అవలంబించే పద్ధతులు అన్నీ ఇస్లామేతర విధాలకు అనుగుణంగానే ఉంటున్నాయి.

ముస్లిములు 'సంఘం'గా ఎందుకు రూపొందాలి? ఒకవేళ సంఘంగా ఏర్పడినా ఏ ప్రాతిపదికపై ఏర్పడాలి? ముస్లిము**లు** ఇస్లాం మార్గనిర్దేశనం చేసే జీవన విధానాన్ని అవలంబిస్తూ ఒక సంఘాన్ని ఏర్పరచాలి. సంఘం కూర్పు కేవలం ఖుర్ఆన్, ప్రవక్త(స) సూచించిన విధంగా ఉండాలి.

ఇస్లాం తెలిపే సామాజిక జీవితపు నియమాలు, చట్టాలు, శాసనాలు ఏమిటి? అవి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతాయి? సమాజానికి ఇస్లాం శాసనాల అగత్యం ఏమిటి? వీటినే ఈ పుస్తకంలో కూలంకషంగా చర్చించడం జరిగింది.

జిల్‌హజ్జ, 1418 హి॥జ్రీ

సద్రుద్దీన్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ఇస్లాంలో సంఘజీవన ప్రాముఖ్యత

సంఘజీవితం - మానవ నైజం

పాలు త్రాగే పసికందును చూసిన వెంటనే అతని తల్లి స్ఫురణకు రావడం సహజం. అదేవిధంగా మానవుడి జీవితంతోపాటు సంఘజీవితం గుర్తుకురావడం కూడా అంతే సహజం. ప్రపంచంలో ప్రతికాలంలోనూ మనిషి సంఘజీవిగానే దర్శనమిస్తాడు. మానవుడు పుడమిపైన కాలుమోపిన తొలికాలంలో సంస్కృతీ నాగరికతలు పరిఢవిల్లలేదు. ప్రాచీన కాలంలో మానవుడు గుహలలో నివసించేవాడు. పంటలు పండించటం, దుస్తులు ధరించడం అతనికి తెలియదు. చెట్ల ఫలాలనే ఆహారంగా భుజించి జీవించేవాడు. అయితే ఆ కాలంలో కూడా మానవుడు సంఘజీవితంపైనే ఆధారపడ్డాడు. ఆది మానవుడు కూడా సంఘజీవితాన్నే జీవన సంవిధానంగా భావించేవాడు. ఆ తర్వాత నాగరికత అభివృద్ధి చెందిన కొద్దీ మనిషికి సంఘ జీవనం మరింత సులువవుతూపోయింది. కుటుంబాలు వర్గాలుగా, వర్గాలు జాతులుగా, కొన్ని జాతులు కల్సి దేశంగా, దేశాలు కలిసి ప్రపంచంగా మారింది.

ఆది నుండే మానవుడు సంఘ జీవితం కోసం ఎందుకు పరితపించాడు? మానవ జీవనశైలి ఈ విధంగా ఎందుకు కొనసాగుతోంది? కాలక్రమేణా ఈ విధానం ఎందుకు ఏర్పడింది?

పై ప్రశ్నలకు సమాధానం ఈ విధంగా చెప్పుకోవచ్చు. మనిషికి

మనిషికి విడదీయలేని బలమైన కారకాలు తప్పకుండా ఉంటాయి. ఆ కారకాలు తనవారి ఎడల ప్రేమాభిమానాలు కలిగి ఉండటానికి తోడ్పడతాయి. మానవుని అంతరంగం అతన్ని తన సంబంధీకుల నుండి విడిగా ఉండనివ్వదు. వారి సహవాసంలోనే తనూ జీవించాలని అభిలషిస్తాడు మనిషి. మన అంత రంగంలో తొంగి చూసినట్లయితే ఆ కారకాలు రెండు రకాలు. ఒకటి, సజాతీయ ఆకర్షణ, రెండవది, సహాయ ఆవశ్యకత.

సజాతీయ ఆకర్షణ

స్వయంగా మనిషి మరో మనిషితో ప్రత్యేక ప్రేమాభిమానాలను కలిగివుంటాడు. వారి పట్ల ప్రగాఢ ఆకర్షణనూ కలిగి ఉంటాడు. వారితో కలిసి ఉండటంలో తను ప్రశాంతతను పొందుతాడు. వారి వియోగం అతడిని అశాంతికి గురిచేస్తుంది. ఒంటరితనం జీవితంలో అలాగే కొనసాగినట్లయితే భయానకమైన నిరాశా నిస్పృహలలో అతటను కూరుకుపోతాడు.

సహాయ ఆవశ్యకత

మనిషి శక్తులు పరిమితమైనవి. కాని అతని అవసరాలు అనంతమైనవి. పరిమిత శక్తులతో తన పనులను తను స్వయంగా ఎవరి మీద ఆధారపడ కుండా చేసుకోలేడు. అతను ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో ఇతరులపై ఆధారపడక తప్పదు.

ఈ విధంగా మానవునికి 'సంఘజీవితం' అతని స్వాభావిక కాంక్ష. అది అతని స్వాభావిక అవసరం కూడా. మానవుడు పుట్టుక రీత్యా ఇతరుల వైపు మొగ్గుచూపుతాడు. ప్రాపంచిక ప్రయోజనార్థం ఇతరులపై ఆధారపడ్డవాడు. ఈ విధంగా మనిషిలో రెండు బలమైన సంఘజీవిత ఆవశ్యకతలు వేళ్ళూనుకొని ఉన్నాయి. మనిషి మానవునిగా మనగలగినంత వరకు అతనికి ఈ అవసరం తప్పకుండా ఉంటుంది.

ప్రాచీన కాలపు ప్రఖ్యాత యునాని పండితులు, తత్వవేత్త అరిస్టాటిల్ మానవుడిని ఈ విధంగా పరిచయం చేశారు : "మనిషి పుట్టుకరీత్యా రాజకీయంగా బుద్ధివిహీనత గలవాడు." (అరిస్టాటిల్ రాజనీతి శాస్త్రం)

సంఘం సమగ్రరూపమే రాజకీయం

మధ్యయుగ పండితుడు, సిద్ధాంతకర్త, తత్వవేత్త ఇబ్నె ఖుల్దూన్ ఈ విధంగా వ్రాస్తున్నారు :

"మనిషి పుట్టుకరీత్యా కలిసి మెలిసి ఉండటానికే ఇష్టపడతాడు. ఒంటరిగా జీవించలేడు." (ఇబ్నె ఖుల్దున్ పీఠిక)

ఆధునిక తత్వవేత్తలు కూడా 'మనిషి సంఘజీవి' అనే విషయంతో నిస్సంకోచంగా ఏకీభవిస్తారు.

గ్రంథరాజమైన ఖుర్ఆన్ ప్రత్యేకంగా మానసిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం కాకపోయినప్పటికీ అది తన జ్ఞానపరిధిలో మనిషి సంఘజీవి అనే విషయాన్ని విస్మరించనూ లేదు. ఇతర అనేక వాస్తవాలను బోధించినట్లుగానే ఈ విషయంలో కూడా విస్పష్ట సంజ్ఞ చేస్తూపోయింది. ఈ విషయాన్ని వర్తమాన కాల పండితులు, తత్వవేత్తలు అందరూ ముక్తకంఠంతో ఒప్పుకున్నారు. సునిశితంగా పరిశీలించినట్లయితే ఖుర్ఆన్ గ్రంథం కూడా సంఘజీవితమే మానవ ప్రకృతికి, నైజానికి సరైనదని పేర్కొంది. ఖుర్ఆన్‌లోని సూరె రూమ్‌లో ఈ విధంగా ఉంది: "మీరు పరస్పరం ప్రశాంతతను పొందడానికి ఆయన మీ మధ్య ప్రేమనూ, దయా భావాన్ని పొందుపరిచాడు." ఖుర్ఆన్ గ్రంథం స్వర్గ సుఖాలను గురించి వర్ణిస్తూ, "స్వర్గ వాసులు ఎదురెదురుగా దిండ్లకు ఆనుకొని ఆసీనులై ఉంటారు. వారు కలిసి మాట్లాడుకుంటారు. కలిసి భుజిస్తారు" అని పేర్కొంది. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, మానవ సాంఘిక జీవితం కేవలం ఇహలోకంలోనే కాదు పరలోకంలో కూడా కానవస్తుంది. స్వర్గంలో ఎన్నో

స్వర్గవనాలు, సుఖాలు ఉన్నప్పటికీ ఇతరుల సహవాసం, సహచర్యం, స్నేహం లభ్యం కానంతవరకు అతని సుఖాలు, సంతోషాలు పరిపూర్ణం కావు. ఇస్లాం ప్రకృతి ధర్మం కదా! మరి మానవ నైజాన్ని దృష్టిలో ఉంచుకుని అతని స్వాభావిక అవసరాలు, శక్తి సామర్థ్యాల కోసం ఇస్లాం ఎలాంటి పద్ధతులు, నియమాలు, చట్టాలను సూచించింది? అసలు వీటికి ఇస్లాంలో స్థానం ఉందా?

మానవ సృష్టిని గురించి ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా చెప్పబడింది: "**వ నఫ్సివ్ వమా సవ్వాహా**"- (సూరె షమ్స్) "మానవ ఆత్మ మీద, దాన్ని తీర్చిదిద్దిన శక్తి మీద." తీర్చిదిద్దడమంటే మనిషికి ప్రసాదించబడిన శరీర అవయవాలు, వాటి పొందిక దృష్ట్యా, మేథోపరంగా అవి మానవునికి ఎంతో అనువయినవి. అవి తమ ఔచిత్యం, ప్రత్యేకతల మూలంగా మనిషికి అత్యుత్తమ జ్ఞానాధారా లయ్యాయి. అతనికి బుద్ధిజ్ఞానాలను, సంస్మరణా శక్తినీ, వివేక విచక్షణల శక్తిని, మానసిక శక్తియుక్తులను ప్రసాదించాడు దేవుడు.

మరోచోట ఈ విధంగా తెలుపబడింది. "**వలఖద్ ఖల్‌ఖ్‌నల్ ఇన్సాన ఫీ అహ్‌సని తఖ్‌వీమ్**" "మేము మానవుణ్ణి అత్యుత్తమ రూపంలో పుట్టించాము." అంటే మనిషి రూపాన్ని అందమైనదిగా రూపుదిద్దాడని, అతనికి ఆలోచన, అవగాహన, బుద్ధిజ్ఞానాల అత్యున్నత స్థాయి యోగ్యతలు అనుగ్రహించబడ్డాయి అని అర్థం. ఇంత ప్రత్యేకంగా, అందంగా మలచబడిన ఈ మనిషి పుట్టుక వెనుక ఏదో గొప్ప ఉద్దేశ్యమే ఉండి వుంటుంది. మానవుడు ప్రపంచంలో తాను చెయ్యవలసిన కార్యాల నిర్వహణకు అతన్ని సమర్థునిగా, యోగ్యునిగా పుట్టిం చాడు అల్లాహ్! మనిషికి దానికంటే ఏ శక్తులనూ అదనంగా ప్రసాదించలేదు, వాటిలో లోపమూ కలిగించలేదు. మనిషి నైజము పైవిధంగా ఉంటే, ఇక ఇస్లాం ధర్మనైజాన్నీ చూద్దాం. ఇస్లాం మనిషిలోని ఏ శక్తులనూ చూసీచూడనట్లు నిర్లక్ష్యం చేయలేదు. ఇస్లాం ధర్మం స్వభావరీత్యా సరిగ్గా మానవ నైజానికి అనుగుణంగా ఉంది. దీని బోధనల సారాంశం క్లుప్తంగా కాకుండా మనిషి

అవసరాలను దృష్టిలో పెట్టుకుని సవివరంగా విశదీకరించింది. స్వయంగా దైవప్రవక్త ముహమ్మద్(స) కూడా ఈవిధంగా పేర్కొన్నారు: "మనిషి నైజానికి, ఇస్లాం ధర్మనైజానికి వెంట్రుకవాసి తేడా కూడా లేదు."

ఖుర్ఆన్ గ్రంథంలోనూ ఈ విధంగా ఉంది :

> **"ప్రవక్తా! ప్రవక్త యొక్క అనుచరులారా! త్రికరణశుద్ధిగా మీ ముఖాన్ని ఈ ధర్మం దిశలో స్థిరంగా నిలపండి. అల్లాహ్ మానవులను ఏ స్వభావం, ఏ నైజం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి.** ***(సూరె రూమ్ :30)***

ఇస్లాం ధర్మం మనిషికి పరిచయంలేని ధర్మంకాదు. ఈ ధర్మాన్ని ఎక్కడి నుండో తీసుకొచ్చి మనిషిపై మోపలేదు. ఇస్లాం ధర్మ పునాదులు మానవుని అంతరంగంలో వేళ్లూనుకొని ఉన్నాయి. ఇది మానవ స్వభావానికి నిశ్శబ్దవాణి. ఈ నిశ్శబ్దవాణిని పదాల రూపంలో మార్చి అతని ముందుంచడం జరిగింది. మనిషి తనలోని సత్యాన్ని విస్మరించినప్పుడు కరుణాకరుడైన అల్లాహ్ అతని విస్మరణ వల్ల మరిచిపోయిన పాఠాన్ని తిరిగి గుర్తుచేస్తాడు. సత్యం విస్పష్టమైన ప్పటికీ దాన్ని మరుగుపరచడాన్ని 'కుఫ్ర్' (తిరస్కారం)గా పేర్కొంటుంది ఇస్లాం. వాస్తవానికి ఇస్లాంను తిరస్కరించడమంటే మనిషి స్వయంగా తన బుద్ధిని, తన స్వభావాన్ని, నైజాన్ని తిరస్కరించడమే.

ప్రవక్త ముహమ్మద్(స) ఈ విధంగా అన్నారు :

ప్రతి శిశువు సహజగుణం (రుజువర్తనం)తోనే పుడుతుంది. తల్లి దండ్రులు ఆ శిశువును యూదునిగానో, క్రైస్తవునిగానో, అగ్ని ఆరాధకునిగానో మారుస్తారు.' పసివారిని వారి వారి తల్లిదండ్రులు ఆయా ధర్మావలంబీకులుగా మారుస్తారు. పిల్లవాడు స్వతంత్రునిగా పెరిగి, ధర్మం విషయంలో పెద్దవారి జోక్యం లేనట్లయితే యుక్త వయసుకు చేరినప్పుడు అతని ముందు పలురకాల

ధర్మాలను ఉంచినట్లయితే అతను ఇస్లాం ధర్మాన్నే ఎంచుకుంటాడు. ఏ రకంగానైతే ఎందరో తల్లుల మధ్య తన తల్లిని పిల్లవాడు ఎంతో తేలికగా గుర్తుపట్టి తల్లిచెంత చేరిపోతాడో మనిషి కూడా తన స్వభావం రీత్యా ఇస్లాం ధర్మాన్ని తనకు అనువైనదిగా గుర్తించగలుగుతాడు. ఎందుకంటే ఇస్లాం ధర్మం తప్ప మరే ఇతర ధర్మాలు మానవ స్వభావానికి, నైజానికి ఏకీభవించవు. తల్లిదండ్రుల ధర్మశిక్షణ, ఇంటి వాతావరణ ప్రభావం పిల్లవానిపై పడనట్లయితే అతను ఆ ధర్మం పట్ల ఎలాంటి ఆకర్షణనూ కలిగి వుండడు. ఇస్లాం ధర్మం వైపే అతను మొగ్గుచూపుతాడు. ఎందుకంటే తన నైజానికి సరిగ్గా ఇమిడిపోయే నైజాన్ని అతను ఇస్లాంలో కనుగొంటాడు. ఏ విధంగానైతే స్వచ్ఛమైన లోహం అయస్కాంతం వైపు ఆకర్షింపబడుతుందో అదేవిధంగా అతను ఇస్లాం వైపు ఆకర్షితుడవుతాడు.

పై నిదర్శనాలనుబట్టి చూస్తే మనిషి నైజానికి తాత్పర్యమే ఇస్లాం. మహా ప్రవక్త ముహమ్మద్(స) ఈవిధంగా పేర్కొన్నారు. “ఏ స్వభావరీత్యా మనిషిని పుట్టించడం జరిగిందో ఆ స్వభావ ధర్మం ఇస్లాం ధర్మమే.”

ఇస్లాం ధర్మనైజం సరిగ్గా మనిషి నైజమూలాలపై లేదా పునాదిపై అమరి ఉంది. అదేవిధంగా మనిషిలోని శక్తిసామర్థ్యాలు అన్నీ ఇస్లాం నైజానికి అనుగుణంగా ఉన్నాయి. ఈ ధర్మం మనిషిలోని శక్తులన్నింటినీ పరిగణలోకి తీసుకుంటుంది. ఏ శక్తినీ చులకనగా చూడదు, వృధాగా భావించదు. ఇస్లాం మనిషిలోని కోరికలను అణగద్రొక్కదు. పైగా ఆమోదిస్తుంది కూడా.

ఒకవేళ ఇస్లాం మనిషి ప్రకృతికి, మనిషి జ్ఞానానికి, మనిషి స్వభావానికి వ్యతిరేకంగా ఉన్నట్లయితే ఈ క్రింది మూడు విషయాలలో ఏదో ఒక విషయంలో ఇస్లాం ధర్మం ఏకీభవించాలి.

1) ఇస్లాం ధర్మం మానవ నైజానికి అనుకూలంగా లేకపోవడం.

2) మనిషి స్వభావంలో సృష్టికర్త అవసరమైన సంపత్తితో పాటు భిన్న శక్తులనూ ఉంచడం (ఇది సృష్టి ఉద్దేశానికే వ్యతిరేకం).

3) ఈ ధర్మం మనిషి శ్రేయస్సు కోసం, సాఫల్యం కోసం రుజుమార్గం చూపించడానికి రాలేదు.

కాని ఇస్లాం పై మూడు విషయాలలో దేనినీ అంగీకరించదు. పైగా అపవాదులుగా పేర్కొంటుంది. ఇస్లాం మనిషిలోని ప్రతి శక్తిని పరిగణనలోకి తీసుకుంటుంది. ఇస్లాం మనిషిలోని ఒక్కొక్క శక్తిని సిద్ధాంతరీత్యా ఉపయోగ కారిగా, లాభకరమైనదిగా, యోగ్యమైనదిగా, న్యాయమైనదిగా భావిస్తుంది.

ఇస్లాంను క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవారు దీని సాంప్రదాయాలను, పద్ధతులను తప్పక ఆచరిస్తారు. ఇది మనిషి స్వాభావిక శక్తిసామర్థ్యాలను, కోరికలను మన్నిస్తుంది. వాటి అవసరాలకుగాను దిశానిర్దేశం చేస్తుంది. దైవికంగా ప్రసాదించబడ్డ శరీర అవయవాలను అవరోధాలుగా, కళంకితాలుగా భావించడాన్ని ఇస్లాం తీవ్రంగా పరిగణిస్తుంది. ఆయా అవసరాలను సవ్యంగా ధార్మిక పరిధిలో ఉంటూ వినియోగించుకోవచ్చు. కోరికల పరిపూర్తిని కేవలం భౌతిక సౌఖ్యాలుగానే కాకుండా ధార్మిక క్రియగా, ఆరాధనగా తీర్మానిస్తుంది ఇస్లాం. ఉదాహరణగా చెప్పుకుంటే మనిషిలో తినటం, త్రాగటం, విశ్రాంతి తీసుకోవటం, వంశోద్ధారణ, భార్యాపిల్లల పోషణ, సంరక్షణ, అతిథి మర్యాదలు వంటి అనేక సహజ కోరికలు ఉన్నాయి. అదే విధంగా మనిషిలో కోపం, కఠినత్వం, సుఖదుఃఖాలు, వాగ్దాటి, పోరాటమూ ఉన్నాయి. ఈ లక్షణాలలో అధికమైనవి ధర్మంతో ఎలాంటి సంబంధం లేనివిగా కనిపించవచ్చు. మరికొన్ని ధర్మానికి వ్యతిరేకంగానూ కనిపించవచ్చు. కాని ఇస్లాం ఈ విధంగా చెబు తుంది, ఇవన్నీ మనిషి నైజానికి మణిహారాల్లాంటివి. వీటిలో ఏ శక్తీ అనవసర మైనది కాదు. ఏ విధంగానైతే సృష్టికర్త అధికారాలు, హక్కులు మనిషిపై ఉన్నాయో, అదేవిధంగా స్వయంగా మనిషికి కూడా తన కోరికలు, తన

భార్యాపిల్లలు, సంబంధీకుల, తన శరీర హక్కులూ ఉన్నాయి. మనిషి తప్పకుండా వీటి హక్కులను నెరవేర్చాలి కూడా.

మనిషి స్వయంగా తనపై, తన కుటుంబంపై ఖర్చుపెట్టడం కూడా పుణ్యకార్యమే. (బుఖారి – సువ్వమ్)

మితిమీరిన పుణ్యాలు సంపాదించడం కోసం ఇతోధికంగా ఆరాధనలు చేయటం అంటే ఉదాహరణకు ప్రతిరోజు క్రమం తప్పక ఉపవాసాలు పాటించటం కూడా తప్పుడు విధానమే. పైగా అతని ఉపవాసాలు సత్కర్మలుగానూ పరిగణించబడవు.

వివాహం చేసుకోవడం ప్రవక్త సంప్రదాయం. ఎవరైతే బ్రహ్మచర్యం పాటిస్తారో వారికి ప్రవక్త ముహమ్మద్(స)తో ఎలాంటి సంబంధం లేదు.

మనిషిలో సంతాన కాంక్ష ఉండాలి.

ప్రవక్తలందరూ భార్యాపిల్లలను కలిగివున్నవారే.

విశ్వాసికి దాంపత్య జీవితంలోనూ పుణ్యాలు ఉన్నాయి

దేవుడు, ధర్మం విషయంలో సమయం వచ్చినప్పుడు పౌరుషాన్ని ప్రకటించటం తప్పనిసరి.

సమయం వచ్చినప్పుడు ధర్మరక్షణ కొరకు యుద్ధం చేయటమే శ్రేష్ఠమైనది.

ఎవరి హృదయమైతే ధర్మరక్షణ కొరకు పోరాడటానికి సిద్ధంగా ఉండదో అది నిజమైన విశ్వాసి హృదయం కాదు.

తిరస్కారం, విరోధం, మోసం వంటి విషయాలలో మృదుత్వం పనికి రాదు. కఠినంగా వ్యవహరించాలి.

వాగ్ధాటి (అంటే మాట్లాడే శక్తి) ఉన్నప్పటికీ మౌనాన్ని ఆశ్రయించటాన్ని ఇస్లాం అజ్ఞానంగా పేర్కొంటుంది.

పిల్లలను ప్రేమించడమూ ధార్మికతే. వారిని ప్రేమించకపోవడాన్ని ధర్మం తీవ్రంగా పరిగణిస్తుంది.

ఆప్తులు, స్నేహితుల మరణవార్త విన్నప్పుడు దు:ఖితులై కన్నీరు కార్చటం మనలోని దయ, కరుణ, జాలి, మానవత్వానికి నిదర్శనం.

పై విషయాలన్నీ మనిషిలోని ప్రతి శక్తినీ ఇస్లాం పరిగణిస్తుందనడానికి ప్రతీకలు. మనిషి సహజ కోరికలను, అభిలాషలను ఇస్లాం వ్యతిరేకించదు. కళంకితాలుగా భావించదు. పాపకార్యాలుగా అసలే భావించదు. మనిషిలోని సకల శక్తులను గౌరవ దృష్టితో చూస్తుంది ఇస్లాం. వాటిని వినియోగించడాన్ని ధర్మంగా పరిగణిస్తుంది. ఎవరైతే మనిషిని సృష్టించాడో అతడే మనిషికి అవసరమయ్యే అన్ని శక్తులనూ ఇచ్చాడు. మనిషిలో అతను ఈ శక్తులను వృధాగా పుట్టించలేదు. ఆ సృష్టికర్త కేవలం మనిషిని సృష్టించడమేకాదు జీవించడానికి మార్గమూ చూపాలి. పాటించే విధానాన్నీ తెలియజేయాలి. మార్గవిహీనత నుండి కాపాడాలి. ఇలాంటి ఆదర్శ గుణం మతాలన్నింటిలో ఒక్క ఇస్లాంకు మాత్రమే ఉంది.

ఇస్లాం మనిషిలోని ప్రతీ శక్తిని అలక్ష్యం చేయక గౌరవిస్తుంది. వాటి వెనుక ఏదో ఒక ప్రయోజనం తప్పకుండా ఉంటుంది. ఆ ప్రయోజనాలను, ఆవశ్యకతలను తన బోధనల్లో తెలుపుతుంది.

ఇస్లాం ధర్మం మనిషి కోసం ఎలాంటి నియమాలు, చట్టాలు ఏర్పరుస్తుంది? ఇస్లాంలో సంఘజీవితానికి గల స్థానం ఏమిటీ?

సామాజిక సంబంధాల ప్రాముఖ్యత

ఖుర్ఆన్ గ్రంథాన్ని, సున్నత్ (ప్రవక్త ప్రవచనాల)ను సమగ్రంగా

అధ్యయనం చేసినట్లయితే, ఇస్లాం సంఘజీవితాన్ని ఎంతవరకు సమర్థిస్తుందో ఇట్టే అర్థమవుతుంది. మనిషి జీవితానికి అవసరమయ్యే సామాజిక జీవనాన్ని అన్ని కోణాల నుండి స్పృశిస్తుంది ఇస్లాం. కేవలం స్పృశించటమే కాదు. అందుకు అవలంబించవలసిన విధివిధానాలను కూడా విస్పష్టంగా తెలియజేస్తుంది.

ఇస్లాం సారాంశాన్ని క్రింది అంశాల ద్వారా తెలుసుకోవచ్చు.

1. ఇస్లాం సామాజిక సంబంధాల భావన.
2. ముస్లిముల సామాజిక జీవనం, జాతి ఏకత్వం కోసం షరీయత్‌లో నియమ నిబంధనలు చేర్చాలి.
3. జీవితంలోని అన్ని కోణాలలో, అన్ని సంబంధాల కోసం సామాజిక భావన గల ధార్మిక ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి.
4. ఫర్జ్ (విధిగా ఆచరించవలసిన) ఆరాధనల్లో సామాజిక విధులను సైతం విస్మరించరాదు.

ఒక్కొక్క దాన్ని క్షుణ్ణంగా తెలుసుకుందాం.

1) సామాజిక సంబంధాలు

ప్రతి మతం తన జ్ఞానపరిధిలో మనిషి శక్తిసామర్థ్యాలను, అవసరాలను దృష్టిలో పెట్టుకుని తన బోధనలను తెలియజేస్తుంది. ఇది నిరాకరించలేని వాస్తవం. అదే మతం నియమాలు, చట్టాలు, వాటి విలువలు, పరిమితులను ఏర్పరుస్తుంది. ఒకవేళ మతం మనిషి సామర్థ్యాన్ని విస్మరించిట్లయితే ఆ మతంలో విచక్షణ, ఔచిత్యం కానరాదు. మానవ జీవితంలో సామాజిక సంబంధాలు కూడా ఒక ముఖ్యమైన అంశమే. మనిషి ఈ జీవితంలో ప్రపంచంలో ఒంటరి జీవితం గడపాలా లేక సన్నిహితుల మధ్య జీవించాలా?

ఈ విషయాన్ని కూడా మతం నిర్ణయించాలి. ఒకవేళ తన ఆప్తులతో జీవితం కొనసాగించినట్లయితే దాని విధానం ఏది? పరిమితులేమిటి?

ఇస్లాం సూటిగా ఈ ప్రశ్నలకు సమాధానాలను ఇస్తుంది. సమాజంలో మనిషి వాస్తవ స్థానం ఏమిటో చూడండి.

> **"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ నుండి సృష్టించాం. తరువాత మీరు ఒకరినొకరు తెలుసుకునేందుకు మిమ్మల్ని జాతులుగాను, తెగలుగాను చేశాము."**
>
> ***(అల్ హుజురాత్ : 13)***

షరీఅత్ (ధర్మశాస్త్రం) అధికభాగం మనిషి సామాజిక జీవితం గురించిన ఉపదేశాలను, నియమాలను బోధించింది. వాటిని తప్పనిసరిగా అమలుపరచాలని ఆజ్ఞాపించింది. కేవలం ఆజ్ఞాపించడమేకాదు, మనిషి సంఘ జీవితానికి అవసరమయ్యే విధివిధానాలనూ నిర్దేశించింది.

మనిషి గుణగణాలు, వ్యక్తిగత జీవితం, దాంపత్యం, సామాజిక, రాజకీయ, ఆర్థిక, జాతీయ, అంతర్జాతీయ జీవన విధానాలన్నింటినీ స్పృశిస్తుంది ఇస్లాం. మానవ జీవితంలోని ఏ కోణాన్నీ అది వదిలిపెట్టలేదు. సర్వకాల సర్వావస్థల్లో అవసరమయ్యే జీవన శైలిని ప్రసాదించింది ఇస్లాం.

ఇస్లాం ఆదేశాలు, నియమాలు చాలా స్పష్టమైనవి. వీటిని అర్థం చేసుకోవడానికి వాదోపవాదాలు, తర్కం అవసరంలేదు. ఈ ధర్మం మనిషిని సంఘ జీవితపు మహోన్నత స్థానంపై నిలబెడుతుంది. మనిషి సామాజిక జీవితానికి కట్టుదిట్టమైన పాలనా వ్యవస్థను చూపిస్తుంది. మనిషి ఒంటరివాడు కాదు. అతను జాతులుగా, తెగలుగా ఏర్పడి జీవిస్తాడు. అంటే సమాజం విడిభాగాలే మనిషి. మనుషులందరూ కలిసి జీవిస్తే సమాజం ఏర్పడుతుంది. ఇళ్ళు, పంటలు, పొలాలు, పాఠశాలలు, అసెంబ్లీ, పార్లమెంటు, యుద్ధ

మైదానం, ఒప్పందాలు ఎల్లెడలా మనుషులు కలిసివుండడం తప్పనిసరి. ఒకవేళ మనిషిలో సామూహిక జీవితం గడిపే తత్వమే లేకుంటే, ఈ భూగోళంపై ఇస్లాం వ్యర్థమైపోయేది.

2) పరిపాలనా పద్ధతులు, షరీయత్ నిబంధనలు

ఇస్లాం వ్యక్తికి విశిష్ట ప్రాధాన్యతను ఇస్తుంది. ఇస్లాం మార్గదర్శకానికి వ్యక్తే కీలకం. మనిషి ఒంటరిగా పుడతాడు. మరణించినప్పుడు ఒంటరిగానే వెళతాడు. అల్లాహ్ సమక్షంలో ఒంటరిగానే హాజరవుతాడు. ఈ చావు బ్రతుకుల మధ్య గల జీవితాన్ని ధర్మబద్ధంగా తీర్చిదిద్దుకోవడం వ్యక్తిగతమే. అయినప్పటికీ మనిషి ఆశల సాఫల్యానికి సంఘ జీవితం తప్పనిసరి. ఇస్లాం సంఘ జీవితానికి పటిష్ఠమైన విధానాన్ని రూపొందించింది. ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ఉంది:

"అల్లాహ్ త్రాడును అందరూ కలిసి గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడి చెల్లాచెదురు కాకండి." ***(ఆలిఇమ్రాన్ : 103)***

అంటే "జమాఅత్‌ను దృఢంగా పట్టుకోండి, చెల్లాచెదురుగా కాకండి" అని అర్థం.

"నేను మిమ్మల్ని ఐదు విషయాల గురించి హెచ్చరిస్తున్నాను. 1) జమాఅత్ జీవితం అంటే సంఘ జీవితం 2) వినటం, అంటే నాయకుని మాట వినటం 3) ఆజ్ఞాపాలన చేయటం 4) వలస పోవటం 5) జిహాద్ అంటే దైవమార్గంలో నిరంతర శ్రమ, పోరాటం.

పై హదీసుల ద్వారా ఇస్లాం సంఘజీవితాన్ని ఎలా పకడ్బందీగా అమలుపరుస్తుందో తెలుస్తుంది. సంఘజీవితాన్ని ఇది ఆషామాషీగా తీసుకోదు.

జమాఅత్‌తో సంబంధాలు లేనట్లయితే ఆ మనిషిలో విశ్వాసమూ ఉండదు. ధర్మమూ కానరాదు. మరో హదీసులో ఈ విధంగా ఉంది.

ఏ వ్యక్తి అయితే జమాఅత్‌కు జానెడు దూరం వెళతాడో, అతను ఇస్లాం ఛత్రచాయలో నుండి వెళ్ళిపోయినట్లే.

ఎవరయితే ఇమామ్ (నాయకుని) ఆదేశాలను పాటించడో, అతను జమాఅత్ నుంచి వైదొలగినట్లే.

జమాఅత్ నుండి వైదొలిగిన స్థితిలో మరణం ప్రాప్తమైతే అతడు అజ్ఞానిగా, మూఢుడుగా పరిగణింపబడతాడు.

ఒక ముస్లిం, జమాఅత్‌తో సంబంధాలు తెంచుకున్నట్లయితే అతని ఈమాన్ (విశ్వాసం) మిగులదు. ఈ స్థితి అతనికి, ధర్మానికి అపాయకర మైనది.

ఖలీఫాతో బైఅత్ (ప్రమాణం) చేయకుండా చనిపోయినట్లయితే అతను అజ్ఞాన స్థితిలో మరణించినట్లే. (ముస్లిం)

జమాఅత్ నుండి జానెడు దూరమైనా మూర్ఖత్వంగా పేర్కొంటుంది ఇస్లాం. మనిషి సంఘజీవితం బీటలు వారకుండా కాపాడుతుంది ఇస్లాం. క్రింది హదీసును పరిశీలించండి.

ఏ వ్యక్తి అయితే జమాఅత్‌తో ఐకమత్యంగా ఉంటూనే విభేదాలు సృష్టిస్తాడో అతనిపై ఖడ్గం ఝుళిపించండి. అతను ఎవరైనా సరే. (ముస్లిం)

సంఘజీవిత నిర్మాణానికి తమ జీవితాన్ని ధారపోసినవారికి, తమ జీవితాన్ని అంకితం చేసినవారికి దైవం వద్ద ఉన్నతమైన స్థానం, గొప్ప ప్రతిఫలమూ వుంది.

ఒక రేయి, ఒక పగలు సరిహద్దులను సంరక్షిస్తే అది ఒక నెల నిరంతరంగా ఉపవాసాలు, నమాజులు ఆచరించడంకన్నా శ్రేష్ఠమైన పని. ఈ సరిహద్దుల రక్షణార్థం అతను చనిపోయినట్లయితే అతను తన జీవితంలో చేసిన

పుణ్యకార్యం అతని మరణానంతరం కూడా కొనసాగుతూ వున్నట్లుగా పరిగణించబడుతుంది. అతనికి అతని పరలోక ఉపాధి లభిస్తూ ఉంటుంది.

రెండు రకాల 'కళ్ళను' నరకాగ్ని ముట్టుకోజాలదు. ఒకటి, దైవభీతితో కన్నీరు కార్చిన కళ్ళు. రెండు, దైవప్రసన్నత కోసం విశ్వాసంతో రాత్రిళ్ళు సరిహద్దులకు కాపలా ఉన్న వ్యక్తి కళ్లు. (తిర్మిజీ)

ఇస్లామీయ నియమాలు, చట్టాలు, ఉపదేశాలను కట్టుదిట్టంగా అమలు చేయడం విశ్వాసానికి ప్రతీక.

అమీర్ అంటే నాయకుని పట్ల విధేయత చూపడం, అల్లాహ్ పట్ల, ముహమ్మద్ ప్రవక్త(స) పట్ల విధేయత కనబరచడంతో సమానం. క్రింది హదీసును చూడండి.

"అమీర్‌కు విధేయత చూపితే నాకు విధేయత చూపినట్లే. ఎవరైతే అమీర్‌కు అవిధేయత చూపారో వారు నాకు అవిధేయులుగా మారినట్లే"అని ముహమ్మద్(స) చెప్పారు.

ఒకవేళ అమీరే (నాయకుడే) దుష్టుడు అయితే, అప్పటికీ అనుచరులు అతని దుష్కార్యాలను ఓర్పుతో సహించి మంచి కార్యాలలో అతనితో సహకరించాలంటుంది ఇస్లాం. దుష్కార్యాలు ఇస్లాం దృష్టిలోనూ గర్హనీయ మైనవే. అయినప్పటికీ ఒక దుష్ట నాయకుణ్ణీ ఎందుకు భరించమంటోంది? అతని అధికారాన్ని, ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఎందుకు నిరాకరిస్తుంది? ఇలాంటి అసాధారణ విధానాన్ని ఇస్లాం ధర్మం ఎందుకు సమర్థించినట్లు?

ఎందుకంటే సంఘజీవితంలో ఎలాంటి వేర్పాటువాదం లేకుండా ప్రజలు ఐకమత్యంగా ఉండడానికి ఇలాంటి నిబంధనను ఏర్పరచింది ఇస్లాం. ఇమాం నవవీ(ర.అ) క్రింది విధంగా అన్నారు :

అమీర్ (నాయకుని) ఆజ్ఞలను ఎల్లప్పుడూ శిరసావహించాలి. ప్రజల మధ్య ఐకమత్యం, సామూహికత సురక్షితంగా ఉండాలన్నదే దానిలోని ఆంతర్యం. ఈ విధానం ద్వారా ఇహపరలోకాలలో మేలు జరుగుతుంది. ముస్లింల మధ్య విభేదాలు తలెత్తితే ధార్మిక, లౌకిక ప్రయోజనాలు దెబ్బ తింటాయి.

సమాజ శ్రేయస్సు కోసం ఇస్లాం తన విశ్వాసులకు ప్రసాదించిన క్లుప్తమైన ఆజ్ఞలు ఇవి. పైన పేర్కొన్న కొన్ని హదీసులను పరిశీలించినట్లయితే సంఘజీవిత విలువలు, ప్రయోజనాల ప్రాధాన్యత అర్థమవుతుంది. ఖుర్ఆన్, హదీసుల ప్రకారం, ఇస్లాంను అనుసరించే ప్రతి ఒక్కరు ఒకే సంఘటనలో ఐకమత్యంగా వుండటం, విభేదాలకు దూరంగా ఉండటం అనివార్యం. ముస్లిములు ఖిలాఫత్ వ్యవస్థను స్థాపించడం తప్పనిసరి. అమీర్ (నాయకుని) విధేయత అల్లాహ్, ప్రవక్త(స) విధేయతతో సమానం. జమాఅత్ నుండి జానెడు దూరం జరిగినా అతనిలో విశ్వాసం లేనట్లే. అమీర్‌తో ప్రమాణం చేయకుండా చనిపోయినట్లయితే ఆ చావు మూర్ఖత్వపు చావుతో సమానం. జమాఅత్‌లో ఉంటూనే జగడాలు పెట్టించినట్లయితే, ఒకవేళ అతను జమాఅత్ కోసం రక్తం చిందించినా దానికి ఎలాంటి విలువా ఉండదు.

మనుషులందరూ కలిసి జీవించడానికి ఇస్లాం ఏం ప్రతిపాదనలు చేసిందో గమనించండి.

3. సాధారణ సామాజిక ఆజ్ఞల గురించి

1) ప్రవక్త(స) హదీసును హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) ఈ విధంగా బోధించారు : "ముగ్గురు వ్యక్తులు ఎడారిలో ఉన్నా, అడవిలో ఉన్నా ఆ ముగ్గురు తమలో నుండి ఒకరిని అమీర్ (నాయకుని)గా ఎన్నుకోవాలి."

ముగ్గురు వ్యక్తులు నిర్మానుష్య ప్రదేశంలో ఉన్నా, జనావాసంలో ఉన్నా

తమలో నుండి ఒకరిని నాయకునిగా ఎన్నుకుని మిగిలిన ఇద్దరు వ్యక్తులు ఆయనకు అనుచరులుగా ఉండాలి. ఎంత చిన్న సమూహమైనా దానికి నాయకుని అవసరం ఉంటుంది. కలతలు, కలహాలు రాకుండా ఉండడానికి ఈ వ్యవస్థ ఎంతైనా అవసరం.

2) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రి(రజి), ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారని తెలియజేశారు:

ఒకవేళ మీలో ముగ్గురు వ్యక్తులు కలిసి ప్రయాణానికి బయలుదేరినా మీలో నుండి ఒకరిని అమీర్‌గా చేసుకోండి. (అబూదావూద్))

తాత్కాలిక ప్రయాణమయినప్పటికీ ఒకరిని అమీర్‌గా చేసుకోవడం తప్పనిసరి. అలాకాక అమీర్ లేకుండా ప్రయాణం చేయడం ఇస్లాం నిబంధనావళికి వ్యతిరేకం.

3) హజ్రత్ అబూ సాలబా ఖుషనీ (రజి) ఈ విధంగా తెలియజేశారు: ఒకసారి అందరూ కలిసి ఒకచోట బస చేశారు. తలా ఒకవైపు వెళ్ళి తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స) చూసి ఈ విధంగా హెచ్చరించారు:

మీరు ఇలా విభిన్న వైఖరులు అవలంబించడం, విడిపోవడం షైతాన్ పనే. (అబూదావూద్)

ఈ హెచ్చరిక తరువాత వాళ్ళెప్పుడూ భిన్న వైఖరులను అవలంబించలేదు. ఎల్లప్పుడు ఒకరికి ఒకరు సమీపంగా నిలబడేవారు. (వారిపై ఒక దుప్పటి కప్పినప్పుడు వారంతా ఆ దుప్పటిలో సరిపోయే విధంగా ఉండేవారు).

అందరూ కలిసి సమూహంగా ఉన్నప్పుడు క్రమశిక్షణ లేకుండా కొన్ని గంటలు ప్రయాణం కూడా చేయకూడదు.

4) ఒక సహాబి లోయ గుండా వెళుతున్నారు. అక్కడ ఒక మంచినీళ్ళ చలమ కనిపించింది. అప్పుడు ఆ సహాబికి ఆ లోయలో చలమ వద్ద నివాసం ఏర్పరుచుకోవాలనిపించింది. తన అభిలాషను ప్రవక్త(స) ముందు వెల్లడించి అనుమతి కోరారు. అప్పుడు ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు : వద్దు, మీరలా చేయకండి. ఇంట్లో డెబ్బై సంవత్సరాలు చేసే నమాజ్ కంటే, అల్లాహ్ మార్గంలో మీరు నిలకడగా ఉండడం ఎంతో మేలైనది.

జమాఅత్‌తో సంబంధం లేకుండా ఒంటరి జీవితం గడపడంలో ఎన్ని సౌఖ్యాలు ఉన్నప్పటికీ, ఇస్లాం ఒంటరిగా జీవించడాన్ని అనుమతించదు. ఆ సౌఖ్యాలు ఐహికంగా, ధార్మికంగా ఎంత గొప్పవైనప్పటికీ జమాఅత్ (సంఘం) జీవితం ముందు తృణప్రాయమే. (తిర్మిజీ)

ఇస్లామీయ ఆజ్ఞలను, ఆదేశాలను గమనించినట్లయితే జమాఅత్‌తో కలిసి ఉండడానికి ఎంతటి ప్రాముఖ్యముందో అర్థమవుతుంది. ఎంతో మంది ఉన్నచోటే కాదు, కేవలం ముగ్గురు వ్యక్తులు ఉన్నచోట కూడా జమాఅత్‌గా ఉండమంటుంది ఇస్లాం. ఇలాంటి పటిష్ఠమైన జమాఅత్ జీవితం కేవలం ఇస్లాం ధర్మంలోనే కనబడుతుందని చెప్పినా అది అతిశయోక్తి కాదు. ఇస్లామీయ ఆదేశాలు పాటించడం కేవలం ఖిలాఫత్‌కే పరిమితం కాదు, వ్యక్తి జీవితంలోని ప్రతి కోణం, ప్రతి దశలో ఆచరించవలసిందే. ఇస్లాం ధర్మంలో సంఘజీవితం ఎంతో ఉన్నతమైనదీ, మరెంతో విస్తారమైనది. అల్లామా షౌకానీ (రహ్మ) పై హదీసుల గురించి ఈ క్రింది విధంగా తెలిపారు :

పై హదీసులలో ముగ్గురు వ్యక్తులు, అంతకన్నా ఎక్కువ మంది ముస్లిములు ఉన్నప్పుడు వారిలో నుండి ఒకరిని తమ అమీర్(నాయకుడు)గా ఎన్నుకోవాలని ఇస్లాం ఆజ్ఞాపిస్తుంది. ఇలా నాయకుడిని ఎంపిక చేసుకోవడం వలన జమాఅత్‌లో బాహాటంగా విభేదాలు తలెత్తవు. కేవలం ముగ్గురు వ్యక్తులకే షరీఅత్ ఈ విధమైన నిబంధనావళి ఏర్పరిచినప్పుడు, వేలల్లో లక్షల్లో మనుషులు

నివసించే గ్రామాలు, పట్టణాలలో జమాఅత్ ప్రాముఖ్యత మరెంతగా పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

4) దైవదాస్యం (ఇబాదత్)లోనూ సంఘీభావం

దైవారాధన అన్న వెంటనే మనిషికి ఏకాంతం స్ఫురిస్తుంది. దైవారాధన కేవలం ధార్మిక, పారలౌకిక ప్రయోజనాల నిమిత్తం చేసే కార్యాలుగా కనబడతాయి. ప్రాపంచిక ప్రయోజనాలేవీ ఇక్కడ కనిపించవు. అయినప్పటికీ ఇస్లాం దైవారాధనలోనూ జమాఅత్‌కే ప్రాముఖ్యతను ఇస్తుంది. ఒక వీధిలోనో లేదా పట్టణాలలోనో, నగరాలలోనో సంఘజీవితాన్ని గడపవచ్చు. కాని దైవారాధనలో కూడా సంఘజీవితం ఊహించడం చాలా కష్టం. దేవుడిని ఆరాధించేటప్పుడు కూడా జమాఅత్ (సంఘం) భావనను పాటించడం ఒక్క ఇస్లాంలోనే కనబడుతుంది. మరే ధర్మంలోనూ ఈ విధానం కనబడదు. ఈ క్రింది దైవారాధనలను గమనించండి.

1) నమాజ్: దైవారాధనలో మొదటగా మనం నమాజ్ గురించి తెలుసుకుందాం. నమాజ్ ధర్మానికి మూలస్తంభం వంటిది (ఇమాదుద్దీన్). నమాజ్ చేసే ప్రతి ఒక్కరు కాబాకు అభిముఖంగానే నమాజ్ చేయాలి. కాబా వైపు తిరిగి నమాజ్ చేసినవారిని ముస్లింలుగా నిర్ధారించుకోవచ్చు (బుఖారి). అన్ని దిక్కులు అల్లాహ్‌కు చెందినవే. అన్ని స్థలాలు అల్లాహ్‌వే. అల్లాహ్ ఒక ప్రత్యేక ప్రదేశానికి, ప్రత్యేక దిశకు చెందినవాడు కాదు. అయినప్పటికీ నమాజ్ చేసేటప్పుడు ఖిబ్లా (కాబా) వైపు తిరిగి నమాజ్ చేయడమనేది దైవాదేశం. ఫర్జ్ నమాజులు విధిగా ఆచరించవలసినవి. అన్ని నమాజులకన్నా ఇవి ప్రముఖమైనవి. ఇవి మస్జిద్‌లో జమాఅత్‌తో కలిసి చేయాలి. ఒంటరిగా చేసే నమాజ్‌ల కంటే, జమాఅత్‌తో చేసే నమాజుకు ఇరవై ఏడు రెట్లు అధిక పుణ్యాలు లభిస్తాయి.

నమాజ్ జమాఅత్‌తో కలిసి చేయటం ఎంత తప్పనిసరియో క్రింది హదీసు ద్వారా తెలుస్తోంది.

ఏ కారణమూ లేకుండా జమాఅత్‌తో కలిసి నమాజ్ చేయకుండా ఇంట్లో ఉండిపోయిన వారిని గురించి చెబుతూ మహాప్రవక్త ముహమ్మద్(స), "మీకు నమాజ్ చేయించడానికి నా స్థానంలో మరెవరినైనా నియమించి, వారి ఇంటికి వెళ్ళి వారితో సహా వారి ఇళ్ళను తగులబెట్టాలనిపిస్తుంది" అన్నారు. (ముస్లిం)

స్వతహాగా ప్రవక్త(స) దయామయులు, కరుణామయులు. అలాంటి ప్రవక్త నోట ఇలాంటి భయంకరమైన మాటలు వెలువడ్డాయంటే, సామూహికంగా నమాజ్ చేయకపోవడం ఎంత పెద్ద అపరాధమో అర్థం చేసుకోవచ్చు.

సామూహికంగా నమాజ్ చేయడమంటే అందరూ ఒకచోట గుమిగూడి ఎవరికి వారు నమాజ్ ముగించడమూ కాదు. అందరూ ఒకేచోట ఒకే నిర్ణీత సమయానికి ఒకే వరుస క్రమంలో నిలబడాలి. ఆ వరుస క్రమం బాణంలా సూటిగా ఉండాలి. వంకర టింకరగా ఉండకూడదు. ప్రతి ఒక్కరూ తమ భుజాలను పక్కనున్నవారి భుజాలకు ఆనించి నిలబడాలి. (బుఖారి)

అందరిలోకెల్లా యోగ్యుడైన వ్యక్తిని ఇమాం (నాయకుడి)గా ఎన్నుకోవాలి. ఇమామ్ ధర్మజ్ఞానంలో ప్రవీణుడై ఉండాలి. గుణగణాల రీత్యా లోపరహితుడై ఉండాలి. ముఖ్తదీ (ఇమాం వెనుక నిలుచున్నవారు)లందరూ ఇమాం నేతృత్వంలోనే నమాజ్ చేయాలి. ముఖ్తదీల ప్రతి కదలిక ఇమాంకు అనుగుణంగా ఉండాలి. ఇమాంతోపాటే రుకూ చేయాలి. ఇమాంతోపాటే సజ్దా చేయాలి. ఆయన ఖాయెదాలో కూర్చున్నప్పుడు ముఖ్తదీలూ ఖాయెదాలో కూర్చోవాలి. ఇమాం సూరాలు బిగ్గరగా చదువుతున్నప్పుడు వెనుక ఉన్నవారు మౌనంగా నిలబడి ఏకాగ్రతతో వినాలి. ఇమాం ఏదైనా మరిచిపోయినట్లయితే

అసహనంతో, చిరాకుతో, కోపంతో జమాఅత్‌ను వదిలివెళ్ళకూడదు. ప్రశాంతంగా 'సుబ్‌హానల్లాహ్' అని ఇమాంను జాగరూకపరచాలి.

జమాఅత్‌తో కలిసి నమాజ్ చేస్తున్నప్పుడు ఏకాంతంలోని ప్రశాంతత కానరాకపోవచ్చు. అయినప్పటికీ జమాఅత్ షరతులను పూర్తిగా పాటించాలి. ఆయా షరతులను పాటించడంలో లోపాలు ఉన్నట్లయితే ఆ 'నమాజ్' వృధా అవుతుంది. దీని ఫలితంగా పరలోక పుణ్యాలే కాదు, ఇహంనందు కూడా ముస్లిములకు పరాభవం, వినాశనం తప్పదు.

క్రింది హదీసును గమనించండి.

దైవదాసులారా! మీ పంక్తులను తిన్నగా ఉంచుకోండి. లేనట్లయితే అల్లాహ్ మిమ్మల్ని వికటింపజేస్తాడు. (ముస్లిం)

మరోచోట ప్రవక్త(స) ఈ విధంగా తెలిపారు :

ఎవరైతే నమాజ్‌లో పంక్తులను సవరిస్తారో అల్లాహ్ వారిని కలిపి ఉంచుతాడు. మరెవరైతే నమాజ్‌లోని పంక్తులను కలిపి ఉంచడో అల్లాహ్ అతన్ని కూడా కలిపి వుంచడు. (అబూదావూద్)

నమాజ్ చేసేటప్పుడు ధనిక, పేద, నల్లవారు, తెల్లవారు, అవిటివారు అనే భేదభావం లేకుండా అందరూ ఒకే వరుసలో నిలబడాలి.

సామూహికంగా ఇమాం వెనుక నమాజ్ చేసేటప్పుడు ఇమాంకన్నా ముందే తన తలను రుకూ నుండి ఎత్తినట్లయితే అతని తలను గాడిద తలగా మార్చివేస్తాడు అల్లాహ్. (ముస్లిం)

ప్రతి ముస్లిం ఐదు పూటలా నమాజ్‌ను తమ వీధి మస్జిద్‌లో చదవాలి. దీని ద్వారా వీధిలోని అందరి యోగక్షేమాలు, కష్టనష్టాలు తెలుస్తాయి. స్నేహ భావమూ పెరుగుతుంది. ఈ విధానం ముస్లిముల జాతీయతకు నిదర్శనం. అంతేకాకుండా వారంలో ఒక నమాజ్ ఊరి ప్రజలందరూ ఒకే చోట చేయాలి.

ముస్లిములందరూ ఒకే మస్జిద్‌లో, ఒకే ఇమాం వెనుక, అందరూ కలిసికట్టుగా తమ ప్రభువు సన్నిధానంలో వినమ్రంగా ప్రార్థించాలి. ఇదియే జుమా నమాజ్. జుమా నమాజ్‌ను గురించి సూరె 'జుముఅ'లో ఈ విధంగా ఆజ్ఞాపించబడింది:

"విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి."

'సంస్మరణ' అంటే హితబోధ అని అర్థం. జుమా రోజు మధ్యాహ్నం చేసే నమాజ్ అజాన్ (నమాజుకు పిలుపు) తరువాత మహాప్రవక్త(స) చేసే మొదటి పని నమాజ్ కాదు, హితబోధ. ఎల్లప్పుడూ ఆయన ఖుత్బా(హితబోధ) చేసిన తరువాతే నమాజ్ చేసేవారు. 'అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి' అంటే పరుగెత్తుతూ రండి అని అర్థం కాదు. సాధ్యమైనంత త్వరగా అక్కడకు చేరడానికి ప్రయత్నించండి అని అర్థం. ఒకవేళ ముస్లిములు జుమా హక్కును ఉల్లంఘించినట్లయితే వారు సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ పట్టులోకి రావడానికి పెద్దగా సమయం పట్టకపోవచ్చు. గత సమాజాలను చూసినట్లయితే అల్లాహ్ ఆజ్ఞలను బాహాటంగా ఉల్లంఘించడం వల్లనే అవి పరాభవం పాలై నాశనమయ్యాయి.

ప్రవక్త(స) ఈ విధంగా హెచ్చరించారు:

"ప్రజలు జుమా నమాజుకు తప్పక హాజరు కావలసిందే. లేనిపక్షంలో అల్లాహ్ వారి హృదయాలపై ముద్ర వేస్తాడు. ఆ పై వారు ఏమీ గ్రహించలేరు." (ముస్లిం)

అసలు నమాజ్‌లో ఏమి పఠిస్తారో చూద్దాం :

ఇయ్యాక నఅబుదు - మేము ఆరాధించేది నిన్నే.

ఇయ్యాక నస్తఈన్ - మేము సహాయం కోసం నిన్నే అర్థిస్తున్నాం.

ఇహ్‌దినస్ సిరాతల్ ముస్తఖీమ్ – మాకు రుజుమార్గం చూపించు.

రబ్బనాలకల్ హమ్దు – ఓ మా ప్రభూ! స్తోత్రములు నీకే చెల్లు.

అస్సలాము అలైనా వఅలా ఇబాదిల్లా హిస్సాలిహీన్ – శాంతి కలుగుగాక! మాకు, సమస్త సజ్జనులకు.

పై ఖుర్‌ఆన్ వాక్యాలను పరిశీలించినట్లయితే నమాజ్ చేసేటప్పుడు జనులందరూ బాహ్యంగా ఎలా ఐకమత్యంగా ఉన్నారో, అదేవిధంగా వారి హృదయాలు సైతం అందరి మేలును ఆకాంక్షించాలి. పైన చెప్పబడిన క్రియలు ఆచరించనంతవరకు నమాజ్ నెరవేరదు. నమాజ్‌లో కేవలం మన కోసమే దుఆ చేయం. అందరి యోగక్షేమాల కోసం దుఆ చేస్తాం. అంటే అందరూ పరస్పర హితాన్ని కోరుకుంటారు. ఈ విధంగా యావత్ సమాజ శుభశ్రేయాల కోసం దుఆ చేయటం జరుగుతుంది.

నిస్సందేహంగా నమాజ్ ఏకాంతంలో చేయవలసిన ఆరాధనే. అల్లాహ్ ముందు హాజరయి పూర్తి ఏకాగ్రతతో చేయవలసిందే. అయినప్పటికీ ఫర్జ్ (విధి) నమాజును సామూహికంగా నెరవేర్చాలి అని ఆజ్ఞాపించింది షరీఅత్. ఇది ప్రజలను ఒక పటిష్ఠమైన సామాజిక వ్యవస్థలో కడదాక నిలిపి వుంచుతుంది. వరుసగా ఒకే క్రమంలో భుజానికి భుజం ఆనించి నిలబడటం, ధనిక, పేద, నలుపు, తెలుపు, అవిటితనం అనే భేదభావం లేకుండా నిలబడటం, వీరందరినీ నమాజ్ చేయించడానికి ఒక ఇమాం, అతని వెనకాల ముక్తదీలు ఉండడం తప్పనిసరి. నమాజ్‌లో అందరూ ఒకేసారి చేతులన్నింటినీ పైకి లేపాలి. ఒకేసారి రుకూ (నమాజ్‌లో వంగటం) చేయటం, ఒకేసారి సజ్దా (సాష్టాంగపడటం), ఒకేసారి కూర్చోవటం, అందరూ ఒకేసారి నమాజ్‌ను ముగించటం తప్పనిసరి.

సామూహికంగా నమాజ్ చేస్తున్నప్పుడు ఏకాగ్రత చెదిరే అవకాశం

ఉంది. నమాజ్ లాంటి ఆరాధనకు కావలసిన పూర్తి ఏకాంతం మస్జిద్‌లో లభించకపోవచ్చు. అయినప్పటికీ ముస్లిముల్లో సమైక్యత పెంపొందించడానికి ఇది చక్కని మార్గం. జాతి మొత్తం ఒకే పరికరానికి చెందిన విడిభాగాలే. ఇవన్నీ సామాజిక విలువలకు నిదర్శనం.

ఫర్జ్ (విధి) నమాజులను మస్జిద్‌లలో చదివి మిగతా నమాజులన్నీ ఇంట్లో చదవడం ఉత్తమం.. ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు :

"ప్రజలారా! నమాజును మీ ఇళ్ళల్లో ఆచరించండి. మీరు ఇంట్లో చదివే నమాజు శ్రేష్ఠమైనది. కాని ఫర్జ్ నమాజును మస్జిద్‌లోనే నెరవేర్చాలి." (బుఖారి)

స్వయంగా ప్రవక్త(స) కూడా సున్నత్, నఫిల్ నమాజును ఇంట్లోనే చేసేవారు.

జకాత్

నమాజ్ తరువాత మరో ముఖ్యమైన ఆరాధన 'జకాత్'– మహాప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు:

"జకాత్‌ను అల్లాహ్ 'విధి'గా నిర్ణయించాడు. అది సమాజంలోని ధనికుల వద్ద వసూలు చేయబడి బీదలకు పంచబడుతుంది." (ముస్లిం)

పై హదీసులో 'వసూలు చేయబడి బీదలకు పంచడం'ను గమనించి నట్లయితే ధనికులు స్వయంగా ఎవరికి వారే జకాత్‌ను బీదలకు పంచడం సరైన పద్ధతి కాదు అని తెలుస్తోంది. జకాత్‌ను వసూలు చేయడానికి ప్రభుత్వం తరఫు నుండి ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుంది. అలా సేకరించిన జకాత్‌ను బీదసాదలకు ఇవ్వడం కూడా ప్రభుత్వ బాధ్యతయే. ప్రవక్త(స) పాలనలోనూ ఆ తర్వాత ఖలీఫాలనూ గమనిస్తే మనకు జకాత్ ప్రాముఖ్యత స్పష్టంగా తెలుస్తుంది. జకాత్ ఇవ్వడానికి నిరాకరించినవారికి వ్యతిరేకంగా హజ్రత్

అబూబకర్ సిద్దీఖ్(మొదటి ఖలీఫా) తన కరవాలాన్ని ఒరలో నుండి తీసి ఈ విధంగా అన్నారు :

"దైవసాక్షి! ప్రవక్త(స)కు వీరు ఒంటెను కట్టేసే త్రాడును (జకాత్ కింద) ఇస్తూ వుండి ఒకవేళ నాకు ఇవ్వడానికి నిరాకరిస్తే, వారికి వ్యతిరేకంగా నేను యుద్ధాన్ని ప్రకటిస్తున్నాను." (ముస్లిం)

షరీఅత్ రీత్యా జకాత్ ఇవ్వడం కూడా సామూహిక ఆరాధనే అని తెలు స్తోంది. ఇది ఎవరికి వారు ఒంటరిగా చేసే దానం కాదు. ఇదీ సామూహికం గానే జరగాలి.

జకాత్ ఇవ్వడం వల్ల ఆత్మ పరిశుద్ధమవుతుంది. జకాత్ అసలు ఉద్దేశ్యం పేద ప్రజలపై దయ, కరుణ, సానుభూతి చూపడం. ఆ పేద ప్రజల అహాన్ని దెబ్బతీయకుండా ప్రభుత్వమే వారికి జకాత్‌ను ఇచ్చే బాధ్యతను తీసుకుంటుంది. జకాత్ ధనిక పేద ప్రజల మధ్య సమానత్వాన్ని ఏర్పరుస్తుంది.

ఉపవాసం

ఇస్లామీయ మూలస్తంభాలలో మూడవ ఆరాధన 'రోజా' (ఉపవాసం).

నమాజ్, జకాత్, హజ్ లాంటి ఆరాధనలు బయటి వ్యక్తులు చూడ గలుగుతారు. కాని రోజా (ఉపవాసం)ను ఎవరూ చూడలేరు. రోజా పాటించే వ్యక్తి తనకు తానుగా కొన్ని పనుల నుండి వైదొలుగుతాడు. ఉపవాసం వ్యక్తిగతం అయినప్పటికీ దీనిలో కూడా సామూహికత కనబడుతుంది. ముస్లిములందరూ వారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నాసరే ఒకే నెలలో ఉప వాసాలు ఉంటారు. ఒకే నిర్ణీత కాలానికి సహ్‌రీ చేస్తారు. అంటే వేకువజాముకు ముందే తినడం, త్రాగడం ముగిస్తారు. సాయంకాలం ఒక నిర్ణీత సమయానికి ఇఫ్తార్ (రోజా విరమణ) చేస్తారు. ఆ నెల సాంతం ముస్లిములు భువిపై ఎక్కడ

నివసించినా క్రమం తప్పక రోజాలు పాటిస్తారు. ఉపవాసం వ్యక్తిగతమే అయినప్పటికీ 'నేను ఒక్కడినే ఉపవాసం ఉన్నాను' అన్న ఆలోచన ఏ ముస్లి ముకూ కలగదు. ఎందుకంటే ప్రపంచంలోని ముస్లింలందరూ సామూహికంగా రోజాలు ఉంటారు. రోజాలు ఆచరించడంలోనూ ఐకమత్యాన్ని ప్రబోధించింది ఇస్లాం.

హజ్

నాలుగవ ఆరాధన 'హజ్'. హజ్ అంటే 'యాత్ర' అని అర్థం. మక్కాలోని కాబా గృహాన్ని దర్శించడాన్ని హజ్ అంటారు. కాబా గృహాన్ని మొదట హజ్రత్ ఇబ్రాహీం ప్రవక్త (అలై) నిర్మించారు. ప్రపంచంలోని అన్ని దేశాల ముస్లిములు జిల్‌హజ్ నెలలో హజ్‌కు ఉపక్రమిస్తారు. ఉపవాసాల మాదిరిగానే ఈ హజ్‌లో కూడా ఒక నిర్ణీత సమయానికి ముస్లిములందరూ వివిధ దేశాల నుండి కాబా గృహానికి చేరుకుంటారు. అక్కడ చేరిన ప్రతి ఒక్కరూ **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడు' అని సాక్ష్యమిస్తారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది హజ్ కోసం ప్రయాణమవుతారు.కాబా గృహానికి చేరువయ్యే కొద్దీ వ్యక్తి తన పాపాల ప్రక్షాళన చేసుకుంటాడు. క్షమాభిక్ష కోసం దైవాన్ని అర్థిస్తాడు. అతనిలో ధార్మికత మరింతగా పెరుగుతుంది. దైవభీతి ద్విగుణీకృతం అవుతుంది. లక్షలాది మంది విశ్వాసుల హృదయాల్లో సామూహికంగా దైవభీతి వున్నట్లయితే వారి సుగుణాలు, నైతికత వర్ణించనలవి కానివి. అప్పుడు వీరంతా సర్వ శ్రేష్ఠుడైన అల్లాహ్ సైన్యంలా కనిపిస్తారు.

హజ్ ఆరాధనలో అతి ముఖ్యమైన ఘట్టం అరఫాత్ మైదానంలో సమావేశమవడం. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన యాత్రికులు భిన్నమైన వర్ణాల్లో ఉంటారు. వివిధ భాషలు మాట్లాడతారు. వీరందరికీ ఇమాం నాయకత్వం వహించి ప్రపంచ ప్రజలందరినీ ఉద్దేశించి ప్రసంగిస్తాడు. ఇస్లామీయ బోధనలు, నియమ నిబంధనలు, ఆజ్ఞల గురించి హితబోధ

చేస్తాడు. ఈ అరఫాత్ ఇజ్తెమాలో హాజరు కానట్లయితే వారి హజ్ నెరవేరదు. వారు ఇతర హజ్ కార్యాలను ఎంతో దైవభీతితో, భక్తితో నెరవేర్చినప్పటికీ అరఫాత్ మైదానంలో సమావేశం కాకపోతే హజ్ నెరవేరదు.

ఆ మైదానానికి చేరిన ప్రజలు పరస్పరం ప్రేమపూర్వకంగా కలుసుకుంటారు. పరిశుద్ధమైన భావాలతో ఐకమత్యంగా ఉంటారు. వారిలోని ఆధ్యాత్మికత, చిత్తశుద్ధి, సమైక్యతకు పునాదిగా మారుతుంది. అలా ఒక్కసారే కాదు, ప్రతి ఏటా జరుగుతుంది.

ప్రపంచంలో శాంతి నెలకొల్పడానికి, జాతికీ జాతికీ మధ్య ప్రేమను పెంచడానికి, కల్లోలాలను రూపుమాపడానికి, సౌభ్రాతృత్వ వాతావరణాన్ని నెలకొల్పడానికి హజ్ కన్నా మంచి ఉదాహరణ మరెక్కడా కానరాదు. ఇది ఒక్క ఇస్లాంకే సాధ్యమయింది.

అసంఘటిత జీవిత భయంకర పరిణామాలు

చేప మనుగడకు నీరు ఎంత అవసరమో, మనిషి మనుగడకు సంఘ జీవనం కూడా అంతే అవసరమని ఇస్లాం బోధిస్తుంది. ఇస్లాంలో సంఘ జీవితానికి ఎందుకు ఇంతటి అసాధారణ స్థాయి ప్రాప్తమయింది? అదొక క్రమశిక్షణగల కట్టుదిట్టమైన పరిపాలనా వ్యవస్థను ఎందుకు నెలకొల్పాలనుకుంటుంది? అమీర్ (నాయకుడు) ఆజ్ఞాపాలనను, అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్(స) వారి ఆజ్ఞాపాలనగా, నాయకుని అవిధేయతను అల్లాహ్, ప్రవక్త(స) పట్ల అవిధేయతగా ఎందుకు పేర్కొంటుంది? సంఘ జీవితం నుండి జానెడు దూరం జరిగినా ఆ వ్యక్తిని ఇస్లాం తన పరిధి నుండి ఎందుకు తీసేస్తుంది? సంఘంలో చీలికలు కల్పించే వాడికి ఎందుకు శరణు కల్పించదు? కారణాలను పరిశీలిద్దాం :

ఇస్లాం ఉద్దేశాలను, లక్ష్యాలను నెరవేర్చడంలో సంఘజీవితం ఎంత గానో తోడ్పడుతుంది. ధర్మానికి, విశ్వాసానికి బాసటగా నిలుస్తుంది. కారణాలను పరిశీలిస్తే ఆ విషయం మీకే అర్థమవుతుంది.

జమాఅత్‌తో అనుబంధాన్ని కలిగివుండండి. ఎందుకంటే తోడేలు గుంపుకు దూరంగా వెళ్ళిన మేకను సునాయాసంగా అంతమొందిస్తుంది. (అబూదావూద్)

మనిషిని పెడత్రోవ పట్టించడానికి షైతాను తోడేలులా పొంచి ఉంటాడు. మంద నుండి వేరయిపోయిన మేకను కబళిస్తుంది తోడేలు. అదేవిధంగా షైతాన్ జమాఅత్ నుండి దూరంగా వెళ్ళిన వ్యక్తిని మార్గభ్రష్టతకు గురిచేస్తాడు. (మస్నద్ అహ్మద్)

మీరు జమాఅత్‌ను ఆశ్రయించండి. వేర్పాటు ధోరణిని అనుసరించ కండి. ఒంటరి వ్యక్తిపై షైతాన్ సులభంగా దాడిచేస్తాడు. ఇద్దరు కలిసివుంటే వాడు బహుదూరం పారిపోతాడు. (తిర్మిజి)

జమాఅత్‌తో సంబంధాలు కలిగివుండటం ఎంత తప్పనిసరియో పై హదీసుల ద్వారా తెలుస్తోంది. మనిషి జమాఅత్‌తో మమేకమైతే క్రమశిక్షణకు అలవాటుపడతాడు. ధర్మాన్ని స్థాపించడానికి, విశ్వాసాన్ని రక్షించుకోవడానికి జమాఅత్ ఎంతగానో దోహదపడుతుంది. సామూహికంగా ఉన్నప్పుడు ఒకరి తప్పులను మరొకరు సరిదిద్దుతారు. దీనికి భిన్నంగా వ్యక్తిగతంగా ఉన్నప్పుడు లేదా ఒంటరిగా ఉన్నప్పుడు మనిషి స్వతహాగా తనకు గల బలహీనత కార ణంగా తన మనోవాంఛలను అనుసరిస్తాడు. సమాజంలోని అనేక చెడులకు మూలం ఒంటరితనం. మనిషి తనను తాను సంస్కరించుకోవడానికి జమాఅత్ జీవితం తప్పనిసరి. లేదా షైతాన్ ఎత్తుగడలకు గురికాక తప్పదు.

ధర్మానుసరణకు, దాని వ్యాప్తికి సంఘంగా ఏర్పడటం తప్పనిసరి.

ఐకమత్యంగల సత్సమాజంలో ఓ ముస్లిం తప్పటడుగులు వేయడం కష్టం. ఇలాంటి సమైక్య వాతావరణం పరస్పరం తమ తప్పులను సరిదిద్దుకుని వ్యక్తులు సన్మార్గంపై నిలకడగా నిలబడడానికి దోహదపడుతుంది. ఆహా! ఎంత మంచి ఆహ్లాదకరమైన వాతావరణమిది.

దీనికి భిన్నంగా ముస్లిములకు ఇజ్తిమా లేనట్లయితే అక్కడ ముస్లిము లయితే ఉంటారు కాని వారి మధ్య సామాజికత కొరవడుతుంది. ఒకవేళ వారు సమాజంగా ఏర్పడినా కలిసిమెలిసి ఉండలేరు. అందరూ కలిసి ఉన్నట్లు కనబడినా కట్టుదిట్టమైన వ్యవస్థ కనబడదు. ఒకవేళ ఇలాంటి వ్యవస్థ ఏర్పడినా అది ఖుర్‌ఆన్ ఆదేశాలకు, నియమాలకు, చట్టాలకు లోబడి వుండదు. అలాంటప్పుడు ఆ సమాజంలో ఇస్లామీయ భావనలకు తావు ఎలా ఉంటుంది? ఇలాంటి పరిస్థితులలో ఒక సాధారణ ముస్లిం నిలకడగా ఉండడం కష్టం. అతను షైతాన్ చేష్టలకు సునాయాసంగా లొంగిపోతాడు. దైవభీతి పరాయ ణత్వం ప్రజల నుండి దూరమవుతుంది.

ధర్మ విస్మరణ- భారీ నష్టం

దైవధర్మానికి సాక్షిగా నిలబడటం కూడా ధర్మాన్ని స్థాపించడమే. ఒక ముస్లిం పరమావధి నిజమైన దైవధర్మ స్థాపన. దైవధర్మాన్ని స్థాపించటానికి ముస్లింలు నిరంతరం పరిస్థితులతో పోరాడవలసి ఉంటుంది. ఈ పోరాటాన్నే జిహాద్ అంటారు. ఒకవేళ ముస్లిములు ఇస్లాం ఆదేశాలకు విరుద్ధంగా సంఘ జీవితాన్ని వదలి ఒంటరిగా బ్రతికినట్లయితే విధిగా పాటించవలసిన నమాజ్, జకాత్, హజ్ లాంటి కార్యాలు కూడా నెరవేర్చలేరు. ఎందుకంటే ఆ ఆరాధనలు కూడా సంఘజీవితాన్నే బలంగా కోరుకుంటాయి. ఇదియే అల్లాహ్, ప్రవక్త(స)ల విధానం కూడా.

ముస్లింల మధ్య ఐకమత్యం లేనట్లయితే ఆచరణరీత్యా, వారు అధః

సంఘ జీవితమే లేనట్లయితే ఆ సమాజం భయంకర పరిణామాలను ఎదుర్కోక తప్పదు.

పరిస్థితుల ప్రభావం

ఇస్లామీయ జమాఅత్ నుండి తొలగి 'వ్యక్తి' ఒంటరి జీవితం గడిపి నట్లయితే సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతుంది. వ్యక్తుల్లో చెడు ఆలోచనలు, ఆచరణలు రూపుదిద్దుకుంటాయి. అధికార దుర్వినియోగమూ జరుగుతుంది. సంఘ జీవితం లేనట్లయితే ఆ సమాజం అనేక రుగ్మతలకు మూలమవుతుంది. దుష్కార్యాలకు అనుకూలమైన పరిసరాలూ ఏర్పడతాయి. తద్వారా దైవభీతి, ధర్మానుసరణ అసాధ్యమవుతుంది. అలాంటప్పుడు మనషులకు సద్బుద్ధి, సత్కర్మల ఆలోచనలే రావు.

ఇస్లామీయ ఇజ్తిమా లేనట్లయితే ఇస్లాం అభిలషించే సద్గుణాలు, మంచి ఆలోచనలు, సత్కర్మలు, అధికార శక్తిసామర్థ్యాల మనోజ్ఞత, వివేకం అక్కడ కానరావు. అసలు ఇస్లామీయ ఇజ్తిమా అంటే ఏమిటి? ముస్లిములందరూ ఐకమత్యంగా ఉన్న సమాజాన్ని స్థాపించడమే ఇజ్తిమా (సంఘం) ఉద్దేశం. దీని కోసం ముస్లిములందరూ ప్రవక్త(స) ప్రవచనం ప్రకారం, అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోవాలి. అల్లాహ్, తాడును పట్టుకోవడం అంటే అల్లాహ్ పంపిన మార్గదర్శక గ్రంథమైన ఖుర్‌ఆన్‌ను పూర్తిగా అనుసరించటం అని అర్థం. ఖుర్‌ఆన్‌లోని దైవాదేశాలను ప్రతి ముస్లిం పాటించినట్లయితే 'మంచిని పెంచి, చెడును త్రుంచే' ఆదర్శ సత్సమాజం ఉనికిలోకి వస్తుంది. ఇలాంటి సమాజంలో ముస్లిములు కేవలం తాము రుజుమార్గంపై పయనించడమే కాకుండా ఇతరులనూ దుష్కార్యాల నుండి, దౌర్జన్యాల నుండి కాపాడతారు. పైగా ఇలా కాపాడడాన్ని వారు తమ బాధ్యతగా భావిస్తారు. ఒకరిని మించి మరొకరు పుణ్య కార్యాలు చేయాలనే తపనను కలిగివుంటారు. ఇలాంటి దైవభీతి, క్రమశిక్షణ,

పోతుంది. అందుకే ఇస్లాం సంఘజీవితాన్ని మనిషి జీవన రంగాలన్నింటిలో అమలు చేయాలని కోరుకుంటుంది.

వర్తమాన పరిస్థితులు పైవిధంగా ఉన్నట్లయితే ముస్లిం సామాజిక జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే సమాజంలో స్నేహం, ప్రేమ, త్యాగం స్థానంలో పగ, శతృత్వం, ఈర్ష్య, ద్వేషం తిష్ఠ వేసి కూర్చుంటాయి. వారి జీవితాల నుండి దైవభీతి మటుమాయం అవుతుంది. ఇస్లాం నియమ నిబంధనలకు తిలోదకాలిచ్చి తిరస్కారానికి పాల్పడుతుంటారు. ముస్లిములు జనావాసాల్లో నివాసమున్నప్పటికీ ఇస్లాం కాంక్షించే ఇజ్తిమా (సామూహికత) లేకపోవడం వల్ల ఇస్లామేతర శక్తులకు దాసోహమంటారు.

మనిషి నిజధర్మమైన ఇస్లాంను విస్మరించడం దురదృష్టకరం

ప్రవక్త ముహమ్మద్(స) స్త్రీలను 'నాఖిసాతు దీన్' 'స్త్రీల ధర్మం అసంపూర్ణ మైనది' అన్నారు. ఇలా అనడానికి గల కారణం 'బహిష్టు సమయంలో స్త్రీలు నమాజు చేయలేరు. ఉపవాసమూ ఉండరు.' కాబట్టి వారి ధర్మాన్ని లోపం గలదిగా, అసంపూర్ణ ధర్మంగా పేర్కొన్నారు. స్త్రీల ఈ 'స్థితి' ప్రకృతి సహజం. స్త్రీల శరీర స్వభావం అటువంటిది. స్త్రీల ఈ శరీర ధర్మాన్ని ఎవరూ ఆపలేరు. మార్చలేరు. ప్రతినెలా కొన్ని రోజులు నమాజ్ చేయరు, ఉపవాసమూ ఉండరు. దైవికంగా వారిపై ఎలాంటి బాధ్యతలూ మోపబడవు. ఇది ప్రకృతి సహజమే అయినప్పటికీ ప్రవక్త(స) దీన్ని లోపంగా పేర్కొన్నారు. మరలాంటప్పుడు ముస్లిములు జీవితాంతం ఎన్నో ఇస్లాం ఆజ్ఞలను ఉల్లంఘిస్తే, వారి పరిస్థితి ఏమిటి? ఇస్లాం ఆకాంక్షించే ఇజ్తిమా (సంఘ) జీవితం నుండి వైదొలగడం ఇస్లాం ఆజ్ఞలను, నియమాలను ఆచరించకపోవడం అనేది దైవికమైన విషయ మైతే కాదు. వారి ధర్మభ్రష్టత్వానికి వారే మూలం. కాబట్టి బాధ్యత కూడా వారిదే.

పాతాళానికి చేరుకోవటం ఖాయం. వారిలో సద్బుద్ధి, సుగుణాలు అడుగంటి పోతాయి. ఫలితంగా అతడు అల్లాహ్ హక్కులను పూర్తిగా విస్మరిస్తాడు. దైవదాస్య భావన అతనిలో మచ్చుకైనా కానరాదు.

మనిషి తన తోటివారితో ఎలా మసలుకుంటాడో తెలుసుకుందాం. బాధితులకు సహాయపడటం, దుఃఖితులను ఓదార్చడం, రోగులను పరామర్శించడం, పీడిత జనులకు అండగా నిలబడటం, దిక్కులేని వారిని ఆదుకోవడానికి శవయాత్రలో పాల్గొనడం ఇవన్నీ మనిషి నిత్య జీవితంలో సామూహికంగా చేసే పనులు. ఒంటరిగా వీటిని నెరవేర్చలేడు. సామాజిక సంబంధాలు ఎంత విస్తృతంగా ఉంటే ప్రజా సంక్షేమ కార్యాలలో అంత ఎక్కువగా పాల్గొనవచ్చు. ఒంటరితనం కాస్త ఏకాకితనంగా మారిపోతే సోదర సంబంధాలు క్రమేణా బలహీనమైపోతాయి.

"నైతికతకు అత్యుత్తమ ప్రమాణంగా నన్ను సృష్టించడం జరిగింది" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. (ముఅత్తా)

సద్గుణాలకు ఇస్లాంలో ఎంతటి ప్రాధాన్యత ఉందో పై హదీసు ద్వారా తెలుసుకోవచ్చు.

ముస్లిముల మధ్య సామాజిక జీవన విధానం కొరవడినట్లయితే తద్వారా ఉత్తమ నైతిక సమాజం ఏర్పడటం అసంభవం. నీతి, నిజాయితీ, విశ్వాసం, న్యాయం, పవిత్రత, నిష్కళంకత, సౌమ్యం, హుందాతనం, సత్ప్రవర్తన, దయ, కరుణ, సిగ్గు, బిడియం, త్యాగం, హృదయ విశాలత మనిషిలో లెక్కలేనన్ని గుణగణాలు, మనిషి జీవితంలోని అనేక కోణాలలో దర్శనమిస్తాయి. మనుషులందరూ అనునిత్యం ఒకరిపై మరొకరు ఆధారపడివుంటారు. ఒకవేళ మనుషులు ఇతరులతో ఎటువంటి సంబంధం లేకుండా సంకుచిత భావంతో ఉన్నట్లయితే మనుషుల సద్గుణాలకు, మానవత్వానికి విలువ లేకుండా

ఈ భావజాలమూ మంటగలిసి దైవధర్మం హృదయాల నుండి దూరంగా వెళ్ళిపోతుంది. దైవేతర పాలనతో పూర్తిగా ఏకీభవిస్తారు. అప్పుడు తన ధర్మం నామమాత్రంగా మిగులుతుంది. దైవేతర పాలనలోని అధికారులకు సలాములు కొడుతూ తన వ్యక్తిగత, ప్రాపంచిక ఉనికిని చాటుకోవడానికి పడరాని పాట్లన్నీ పడతాడు. దైవేతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాటనూ సహించడు. బాగా ఆలోచించండి. ఈ స్థితిలో ఒక ముస్లింను నిజమైన ముస్లింగా, విశ్వాసిగా పేర్కొనవచ్చా?

యదార్థానికి మనిషి ఇహలోకంలో అల్లాహ్ ప్రతినిధి (ఖలీఫా)గా పంప బడ్డాడు. అల్లాహ్ ఆజ్ఞలను అనుసరించి జీవితం గడపాలి. వాస్తవానికి ఇస్లాం అనేది మనిషి పూర్తి జీవన సరళి. మనిషి జీవితంలోని సకల రంగాలలో ఇది మార్గం చూపుతుంది. ఇస్లాం ద్వారానే ఇహపరలోకాల్లో సాఫల్యం సిద్ధిస్తుంది. ముస్లిములు అసంఘటితంగా ఉన్నంతకాలం వారు దైవేతర శక్తులకు దాసోహ మంటారు. ప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు. 'జమాఅత్' నుండి వైదొలిగిన వ్యక్తిని షైతాన్ అత్యంత సునాయాసంగా వశపరుచుకుంటాడు.

సంఘ జీవిత ప్రతిఫలం

అల్లాహ్ హస్తం 'జమాఅత్' (సంఘం)పై ఉంటుంది. ఒంటరిగా జీవిస్తే ఒక మంచి వ్యక్తిని సైతం చాలా సులభంగా షైతాన్ పెడద్రోవ పట్టించగలడు. కాబట్టి ఒంటరి జీవితాన్ని గడపడాన్ని ఇస్లాం సుతరామూ ఒప్పుకోదు. దీనికి భిన్నంగా భువిలో దైవధర్మాన్ని స్థాపించి దాన్ని నిలకడగా కొనసాగించడానికి గాను జమాఅత్ (సంఘం)గా ఏర్పడమని ప్రోత్సహిస్తుంది ఇస్లాం. జమాఅత్ లోనూ వ్యక్తుల బలహీనతలు ఉండవచ్చు కాని సంఘం మొత్తం షైతాన్ ఎత్తుగడలకు లోనుకాదు. అల్లాహ్ సంఘాన్ని సంరక్షిస్తాడు. షైతాన్ చేపట్టే కుచేష్టల నుండి, కుతంత్రాల నుండి దాన్ని కాపాడుతూ ఉంటాడు.

ధర్మజ్ఞానం క్రమంగా క్షీణించుట

అసంఘటిత జీవితం మూడవ విపత్తులో ధర్మం, విశ్వాసం (ఈమాన్) క్రమక్రమంగా క్షీణిస్తుంది. ఇస్లామ్ కాంక్షించే సామాజికత లేనట్లయితే, సమాజంలో ఇస్లామేతర శాసనాలు, నియమ నిబంధనలు చెలామణి అవు తాయి. ఈ పరిస్థితిలో ఒక ముస్లిం జీవిత వ్యవహారాలన్నీ ఆయా శాసనాలకు లోబడి ఉంటాయి. అక్కడ అల్లాహ్, ప్రవక్త(స) షరీఅత్ ఆజ్ఞలు ఎక్కడా కానరావు. ఇస్లాం ప్రతిపాదించిన 'ఖిలాఫత్'ను అనవసరమైనదిగా భావిస్తారు. సత్యం, న్యాయం విషయాలలో స్వయంగా మనుషులే నిర్మించుకున్న చట్టాలను తగినవిగా భావిస్తూ ప్రజల మధ్య అమలుపరుస్తారు. ధర్మం వేరు, ప్రాపంచిక జీవితం వేరు అని విడదీస్తారు. ఇలాంటి తరుణంలో ఒక ముస్లిం వ్యక్తిగత ధర్మాన్ని అవలంబించడం కష్టతరమైపోతుంది. ఈ స్థితిలో ముస్లిం అంతరాత్మ ఘోష ఎలా ఉంటుందో ఊహించటం కష్టంకాదు. అతను ఒక మురికి కూపంలో కూరుకుపోయినట్లు ఊపిరాడక అతని విశ్వాసం (ఈమాన్) ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఉదాహరణకు, ఒక దుర్గంధభరితమైన ప్రదేశంలో బంధించినట్లయితే ఆ దుర్గంధానికి అతను అల్లాడి అనిశ్చితికి, అసహ్యానికి లోనవుతాడు. కొంతకాలం వరకు ఈ స్థితి కొనసాగుతుంది. తరువాత అతను క్రమక్రమంగా ఆ దుర్వాసనకు అలవాటు పడి అతని జ్ఞానేంద్రియాలు పనిచేయకుండా పోతాయి. తదుపరి ఆ వాతావరణానికి అతను పూర్తిగా అలవాటుపడిపోతాడు. ఈ స్థితియే మనిషి ధార్మికతను నాశనం చేస్తుంది. దైవేతర పాలనలో దైవేతర ఆజ్ఞలు, నియమ నిబంధనలతో విశ్వాసులు సౌఖ్యంగా, విశ్రాంతిగా ఉండలేరు. సాధ్యమైనంతవరకు తమ దైవాదేశాల పాలన కోసం తమ ఆలోచనల ద్వారా చేతల ద్వారా నిరంతరం ప్రయత్నిస్తుం టారు. ఇలా కొంత కాలం గడిచిన తరువాత ముస్లిముల హృదయాల నుండి తిరస్కార భావం కాస్త తగ్గుముఖం పట్టి ఉదాసీనతకు లోనవుతారు. రానురానూ

సద్భావంతో ఉద్భవించిన సంఘం ద్వారా మంచి ఆలోచనలు, మంచి పనులు జరుగుతుంటాయి. చెడు నిర్మూలించబడుతుంది. దైవభీతి తొణకిస లాడుతుంది. సామూహిక జీవితంలో అల్లాహ్ ఆజ్ఞలు సజావుగా సాగుతాయి. దైవం మనిషి నుండి కోరుకునేది కూడా అదే. మంచికై పాటుపడేవారికి దైవానుగ్రహం, కరుణ, కటాక్షం, దైవసహాయం తప్పక లభిస్తుంది.

ఇస్లాం చూపే సామూహికత

ఇజ్తిమా (సంఘం) ఉద్దేశం : ఎక్కడైనా సరే నలుగురు ఒక చోట చేరి సముదాయంగా ఏర్పడుతున్నారంటే, దాని వెనుక ఏదో ఒక ఉద్దేశం, సంకల్పం, కోరిక తప్పకుండా ఉంటుంది. ఆ కోరిక, ఆ సంకల్పాలే వారిని ఒక సంఘంగా ఉద్భవించేలా చేస్తాయి. వారు తీసుకున్న నిర్ణయాలు పూర్తిగా అమలుకావడానికి ఇజ్తిమా(సంఘం) ఒక వారధిగా ఉపయోగపడుతుంది. వీరు నిర్ణయించిన ఉద్దేశాలు, సంకల్పాలు మానవ కళ్యాణానికి ఉపయోగపడుతుంటే ఆ సంఘాన్ని తప్పకుండా గౌరవించాలి. అలాకాకుండా ఫలితాలు దీనికి భిన్నంగా ఉన్నట్లయితే ఆ నిర్ణయాలకు ఎలాంటి విలువా ఉండదు.

ఇస్లాం తన అనుయాయుల నుండి ఎలాంటి సామాజికతను కోరుకుంటుంది? నియమ నిబంధనలు లేని చట్టరహిత ఇజ్తిమా (సంఘం) నయితే కోరుకోదు. ఇది నిర్దుష్టమైన ప్రమాణాలుగల సామాజికతను కాంక్షిస్తుంది. ఆ సముదాయం అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్(స) ఆదేశాలకు, ఆజ్ఞలకు అనుగుణంగా ఉంటుంది. ప్రజలను ఐకమత్యంగా జీవించాలని హితబోధ చేస్తూ ధార్మికతను అనుసరించే సమూహమే ప్రాధాన్యతను కలిగివుంటుంది. ఇలాంటి ధార్మిక సమూహాన్నే ఇస్లామీయ ఇజ్తిమాగా పేర్కొనవచ్చు. ఒకవేళ ముస్లిముల ఈ సముదాయంలో అల్లాహ్, ప్రవక్త(స) చేసే ఉపదేశాల పాలన జరుగనట్లయితే దీనిని ఇస్లామీయ ఇజ్తిమాగా పేర్కొనలేము. ఇంకాస్త

ముందుకువెళ్ళి చూసినట్లయితే ముస్లిములు తమ అసలు తత్వాన్ని మరిచి, జ్ఞానరహితులై ఒక చోట ప్రోగయినట్లయితే దీనిని పూర్తిగా ఇస్లాం వ్యతిరేకమైనదిగా పరిగణించవచ్చు. ఇది ముస్లిములు నిర్మించిన వ్యవస్థయే కావచ్చు కాని దీనికీ, ఇస్లాంకు ఎలాంటి సంబంధం ఉండదు. అలాంటప్పుడు ఈ విధానం ఇస్లాంకు తలవంపు తెచ్చేదిగా వుంటుంది. ఈ పరిస్థితి ఇస్లాంకు శాపం తప్ప మరేమీ కాదు. ఇలాంటి వ్యవస్థ ఎక్కడైనా ఉన్నట్లయితే దానిని సమూలంగా మార్చివేసి దాని స్థానంలో ఇస్లాం కాంక్షించే సామాజికతను స్థాపించాలి.

అసలు ఇస్లాం ఏ ఉద్దేశ్యంతో ప్రజలను సంఘటితపరుస్తుంది? తద్వారా అది ఎలాంటి జాతి ఆవిర్భావాన్ని కోరుకుంటుంది? ఖుర్ఆన్ వెలుగులో తెలుసుకుందాం.

"మేము మిమ్మల్ని ఒక న్యాయశీల సమాజం (ఉమ్మతె వసత్)గా చేశాం. మీరు ప్రజలపై సాక్షులుగా, ప్రవక్త(స) మీపై సాక్షిగా ఉండటం కోసం మేమిలా చేశాం." *(బఖర)*

"మానవుల కోసం ఉనికిలోకి తీసుకురాబడిన విశిష్ట సమాజం మీరు. మీరు మంచి విషయాలను గురించి ఆజ్ఞాపిస్తారు. చెడును ఎదుర్కొంటారు." *(ఆలిఇమ్రాన్)*

"ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కొరకూ నిర్ధారించాడు. దానినే ఓ ముహమ్మద్(స)! మేము నీవైపునకు (వహీ ద్వారా) పంపాం. ఈ ధర్మాన్ని స్థాపించండి."

సత్యానికి సాక్ష్యమివ్వడం, మంచిని ప్రోత్సహించి చెడును నివారించడం, ధర్మాన్ని స్థాపించడం అనే ఈ మూడు విషయాలు ఒకే కోవకు చెందినవి.

పై ఖుర్‌ఆన్ వాక్యాలను పరిశీలించినట్లయితే అల్లాహ్ ముస్లిములను ఈ భువిపై సృష్టించడంలో గల ఉద్దేశం, వారు సత్యానికి సాక్షులుగా నిలబడటం, మంచిని పెంచి, చెడును త్రుంచడం, ధర్మాన్ని స్థాపించడం. ఈ పని వ్యక్తిగతంగా కాకుండా అందరూ కలిసి జమాఅత్(సంఘం)గా ఏర్పడి దీనికై కృషి చేయాలి. దీనికిగాను ముస్లిములు ప్రణాళికాబద్ధ జీవన విధానం అనుసరించడం తప్పనిసరి. ఇస్లామీయ షరీఅత్ ప్రకారంగా జీవన మార్గాన్ని ఎంచుకోవడం తప్పనిసరి. ఈ ఉద్దేశ్యమే, ఈ సంకల్పమే ముస్లిములను **కలిసి** మెలిసి ఉండేలా చేస్తుంది. జ్ఞానాన్ని, వివేకాన్ని నూరిపోస్తుంది ఇజ్తిమా. ధర్మ పరిరక్షణార్థం ముస్లిముల మధ్య ఇజ్తిమా నిరంతరం కొనసాగుతుండాలి. దేవుని ఏకత్వం, దైవధర్మ స్థాపన కాకుండా మరే ఇతర లాభాపేక్షతోనో, ఐహిక జీవితం కోసమో ముస్లిములు ఒకచోట సమావేశంకారు. ఒకవేళ ముస్లిములు కేవలం ఐహిక లాభాపేక్ష కోసం ఒకచోట గుమిగూడినట్లయితే దీనిని ఇస్లాం 'అజ్ఞానం'గా పేర్కొంటుంది.

సామాజిక కూర్పు, ఏర్పాటు : ఇజ్తిమాల ఉద్దేశం దేవుని ఏకత్వం, ధర్మసంస్థాపన అయినప్పుడు దానిని ఏ విధంగా ఏర్పాటు చేయాలో ఖుర్‌ఆన్‌లో తెలుపబడింది.

> **"మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి."** ***(ఆలి ఇమ్రాన్- 103)***

అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోమని తాకీదు చేసింది ఖుర్‌ఆన్. ఐకమత్యం ద్వారానే మానవ సాఫల్యత సాధ్యమవుతుంది. మీరు విభేదాలలో పడి చీలిపోకండి. ఐక్యతను విస్మరించినట్లయితే మీరు చెల్లాచెదురై పోతారు అని ఖుర్‌ఆన్ చెప్పడం గమనార్హం.

ఖుర్‌ఆన్ ఆధారంగా ధర్మం కోసం సర్వత్రా ముస్లిములు కలిసి వుండడం తప్పనిసరి.

పై వాక్యాన్ని మరింత వివరంగా తెలుసుకోవాలంటే ప్రవక్త(స) ఆచరణను చూడాలి. ఆయన(స) ప్రజల ముందు దైవధర్మాన్ని పరిచయం చేసేటప్పుడు దేవుని ఏకత్వం, పరలోక జవాబుదారీ గురించి చెప్పేవారు. ప్రవక్త(స) తన జీవితాంతం ఈ పనే చేశారు. ఈ సందేశమే అందజేశారు. దీని కోసమే పరితపించేవారు. దీని కోసమే ప్రజలను సమీకరించేవారు. ఈ హితబోధను ఎవరు స్వీకరించినా వారు తెల్లవారైనా, నల్లవారైనా, ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఏ వర్గానికి, ఏ దేశానికి సంబంధించినవారైనా ఇస్లాం అనుచరులుగా పేర్కొనబడతారు. ఈ హితబోధను ఎవరు నిరాకరించినా వారు ఖురైష్, హాష్మి వంశీయులైనప్పటికీ ఇస్లాం అనుయాయులుగా పిలువబడరు. ఈ ఉద్దేశం తప్ప ప్రవక్త(స) మరే ఇతర అవసరాల కోసం ప్రజలను సమీకరించలేదు. అనుయాయులందరూ ఒక జమాఅత్‌గా ఏర్పడి ఉండాలని చెప్పారు. ఇంకా ఈ క్రింది విధంగా సెలవిచ్చారు :

"ఒక 'అజ్ఞాని' తన అజ్ఞానం వైపునకు ప్రజలను ప్రోగు చేసినట్లయితే అతని నివాసం నరకం. అతను నమాజ్, రోజాలను ఆచరిస్తూ తననుతాను ముస్లింగా భావిస్తున్నప్పటికీ అతను నరకవాసే అవుతాడు." (అహ్మద్, తిర్మిజి)

అజ్ఞానం ఇస్లాంకు పూర్తిగా వ్యతిరేకం. అలాగే దేవుని ఏకత్వానికి, అల్లాహ్‌కు భాగస్వాములను నిర్ణయించటం (షిర్క్) వ్యతిరేకం. ఇస్లాం ఒక పటిష్ఠమైన జీవన విధానాన్ని నిర్ణయించి జమాఅత్ (సంఘం)గా ఏర్పడి జీవించమని ప్రోత్సహిస్తుంది. జమాఅత్ (సంఘం)గా ఏర్పడకుండా జీవించడాన్ని తీవ్రంగా పరిగణిస్తుంది. ఇలాంటి సంఘం పట్ల విముఖత చూపడానికి దైవ విరోధులెవరైనా పిలిస్తే దాన్ని అజ్ఞానంగా పేర్కొనవచ్చు. ముస్లిములందరూ కలిసి వుండాలని ఖుర్‌ఆన్ ఆదేశిస్తోంది. వంశం ఆధారంగానో, ప్రాంతాల వారీగానో, భాషల పరంగానో ప్రజలను సమీకరించడాన్ని ఇస్లాం అజ్ఞానంగా పేర్కొంటుంది. కాబట్టి పై హదీసులలో ఆ విధంగా హెచ్చరించారు. మరో హదీసునూ గమనించండి.

"ఎవరైతే చెడు చేయటానికి, దుర్బోధ కోసం ప్రజలను పిలుస్తారో వారు మనవారు కాదు." (అబూ దావూద్)

ఇస్లాం బోధించే స్వచ్ఛమైన, నిర్మలమైన, యుక్తిపరమైన జీవన విధానాన్ని వదిలి జాతిపరంగా, భాషాపరంగా, ప్రాంతాలవారీగా, మనుషుల రంగుల ఆధారంగా ప్రజలను విడగొట్టినట్లయితే వారిని అజ్ఞానులుగా పేర్కొంటుంది ఇస్లాం.

మనుషుల మధ్య సంబంధాలను త్రెంచడాన్ని, అజ్ఞానాన్ని సామరస్యం గల ఇస్లాం క్షణకాలం పాటు కూడా సహించదు. ఒకసారి ప్రవక్త(స) కాలంలో ఒక ముస్లిం నుండి ఈ విధమైన తప్పులు జరిగినట్లు సమాచారం అందిన వెంటనే అతడిని పిలిచి సంస్కరించారు. ఇది ప్రవక్త(స) సూక్ష్మబుద్ధికి నిదర్శనం. గజ్వె బనీ ముస్తలిఖ్ సందర్భంలో ఒక ముహాజిర్ (మక్కా వాసి), ఒక అన్సార్ (మదీనా వాసి) మధ్య వాగ్వివాదం జరిగింది. ముహాజిర్, అన్సార్‌ను కాలుతో తన్నాడు. అప్పుడు అన్సార్ తన సహాయార్థం తన అన్సార్ తెగవారిని పిలుస్తాడు. ముహాజిర్ తన వారిని పిలుస్తాడు. ఈ విషయం ప్రవక్త(స) వరకూ చేరింది. ఆయన(స) ఈ విధంగా సెలవిచ్చారు:

"ఇదేమి అజ్ఞానం? అజ్ఞానం నుండి దూరంగా వుండండి. ఇది అపవిత్రమైనది." (బుఖారి)

"యాలల్ అన్సార్" (మదీనా వాసులారా) అనే మాటలో ప్రాంతీయ తత్వం కనబడుతుంది. "యాలల్ ముహాజిరీన్" (మక్కావాసులారా)అనే మాటలో కూడా ప్రాంతీయత వుంది. ఈ పదాలు కోపావేశంలో అన్నవే. అయినప్పటికీ ఇది ప్రవక్త(స)ను తీవ్ర అయిష్టతకు గురిచేశాయి. తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆయన దానిని అజ్ఞానంగా, అపవిత్రమైనదిగా, పాపంగా పరిగణించారు.

అజ్ఞానం వైపు పిలిచేవారు, అజ్ఞానం పిలుపును శిరసావహించేవారు ఇద్దరూ నరకవాసులే.

ప్రవక్త(స) హదీసును గమనించండి.

"పాపం నిమిత్తం ఎవరైనా యుద్ధం చేస్తే వారు మనవారు కారు. ఎవరైనా పాపం కోసమే యుద్ధం చేస్తూ చనిపోతే వారితో నాకెలాంటి సంబంధమూ లేదు."

ప్రాపంచిక ప్రయోజనార్థం ముస్లిములు ఒక సమూహంగా ఏర్పడినట్లయితే దానిని ఇస్లామీ ఇజ్తిమాగా పేర్కొనలేము. ధార్మికంగా ఏర్పడిన సంఘాన్నే ఇస్లామీ ఇజ్తిమా అంటారు.

ఇజ్తిమా పద్ధతి

ఇజ్తిమాను ఏర్పాటు చేయడానికి ఏ పద్ధతిని అవలంబించాలి? ధర్మం ఈ విషయంలో ఎలాంటి సూచన చేస్తుందో ఆ సూచనయే ఇజ్తిమాకు పునాది అవుతుంది. ఖుర్ఆన్‌లోని అలిఇమ్రాన్ సూరాలో ఈవిధంగా తెలుపబడింది.

"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు ఎంతగా భయపడాలో అంతగా భయపడండి. ముస్లిములుగా తప్ప మరేవిధంగానూ మరణించకండి."

'ఎంతగా భయపడాలో అంతగా భయపడండి' అంటే ఇస్లాం ఆదేశాలను, నియమాలను, చట్టాలను, విధులను పూర్తిగా పాటించాలి. ఏ పనులయితే చేయకూడదు అని అల్లాహ్ వారించాడో వాటికి పూర్తిగా దూరంగా మసలుకోవాలని భావం.

తరువాత "మీరు అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి" అనే వాక్యం ఖుర్ఆన్‌లో ఉంది. అంటే అల్లాహ్‌కు భయపడుతూ ఈ లోకంలో జీవనం కొనసాగించాలి. ఖుర్ఆన్ గ్రంథం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి.

ముస్లిముల హృదయాల్లో అల్లాహ్ పట్ల విశ్వాసం పరిపూర్ణంగా నింపబడాలి. అప్పుడే ఇస్లామీయ ఇజ్తిమా ఏర్పడుతుంది. ముస్లిములలో దైవభీతి(తఖ్వా), సదాచరణ (అమలె సాలిహ్) లేనట్లయితే అతను జమాఅత్ రుకూన్ (సభ్యుడు) కాలేడు. తఖ్వా (దైవభీతి), అల్లాహ్ త్రాడును (ఖుర్ఆన్‌ను) గట్టిగా పట్టుకోవడంలో ఎవరు ముందుంటారో వారు ఈ జమాఅత్‌కు అంతే సమీపంలో ఉంటారు. జమాఅత్‌తో అతని సంబంధాలూ బలంగా ఉంటాయి. ఎవరిలో ఈ గుణగణాలు తక్కువగా ఉంటాయో వారు ఈ జమాఅత్‌కు అంతే దూరంలో ఉంటారు. జమాఅత్‌తో అతని సంబంధాలు అంతే బలహీనంగా ఉంటాయి.

దైవాదేశాల ప్రాతిపదికపై ఒకరిని రుకూన్‌గా అంగీకరించి వారిని ధర్మం ఊరికే వదలివేయదు. వారి విశ్వాసానికి మెరుగులు దిద్దుతూ మరొకరిని ప్రోత్సహించేలా చేస్తుంది. ఈ విషయాన్నే ఖుర్ఆన్ మరోచోట ఇలా పేర్కొంది.

"మీలో ఒక వర్గం ప్రజలకు మేలు చేయడానికి ఆహ్వానిస్తుంది. మంచి పనులు చేయమని ఆజ్ఞాపిస్తుంది, చెడు కార్యాల నుండి వారిస్తుంది."

దీనికి సంబంధించిన మరో విషయం ఏమిటంటే, జమాఅత్ సభ్యులు తమనుతాము సంస్కరించుకోవడంతోపాటు ఇతరులనూ సంస్కరించడం ఎంతో అవసరం. ఇంటా, బయటా అవసరమైన ప్రతిచోట మీరు సంస్కరణల కోసం పాటుపడాలి. ఎల్లవేళలా వీరు తమలోని లోపాలను సంహరించుకోవాలి. తమను పరిశుద్ధపరచుకోవాలి. ఇది ప్రవక్త(స) విధానం కూడా. ప్రవక్త(స) ప్రజలకు ఇస్లాంను పరిచయం చేసేవారు. ఇస్లాంను ప్రజలకు అర్థమయ్యేవిధంగా బోధించేవారు ప్రవక్త(స). ఇస్లాంను స్వీకరించినవారికి ఖుర్ఆన్ గ్రంథంలోని దేవుని ఆదేశాల గురించి విడమరిచి చెప్పేవారు. ధర్మజ్ఞానాన్ని వారికి బోధించేవారు. అలాగే గుణగణాల రీత్యా,

ఆచరణలపరంగా వారిలో ఏమైనా లోపాలు ఉంటే వాటినీ సరిదిద్దేవారు. స్వయంగా ప్రవక్త(స) గారి ఆచరణ ఇస్లాంకు ఏమాత్రం హెచ్చుతగ్గులేకుండా ఉండేది. ప్రవక్త(స) అల్లాహ్ దాసులను ఆయన ఆరాధనకై పిలిచేవారు. ఆయన పిలుపు మేరకు వచ్చిన వారిని తమ ఉమ్మత్(అనుచరులు)లో చేర్చుకునేవారు. ఈమాన్ (విశ్వాసం), ఇస్లాం (అల్లాహ్‌కు స్వయం సమర్పణ), తఖ్వా (దైవభీతి)ను వీరిలో నూరిపోసేవారు. వారిని సుగుణాల రీత్యా వృద్ధిచేసేవారు. ఈ పద్ధతిలో ఇస్లామీయ ఇజ్తిమా ఆవిర్భవించి రూపుదిద్దుకుంది.

ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థ

ప్రజలు తమ సహజ స్వభావంరీత్యా ఒంటరి జీవితం గడపకుండా అందరూ కలిసి ఒక సంఘంగా జీవిస్తారు. ఇలా ఒక సమూహంగా ఏర్పడి జీవిస్తున్నప్పుడు వాగ్వివాదాలు, స్పర్థలు, సమస్యలు రావడం సహజం. ఇవి నిరంతరం కొనసాగుతుంటాయి కూడా. ప్రతి మనిషిలో మంచి, చెడు రెండు రకాల స్వభావాలూ ఉంటాయి. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొంటుంది. "మనిషి హృదయంలో దైవభీతి, పాపపు బుద్ధి రెండు సమ్మిళితమై ఉన్నాయి" **(ఫఅల్‌హమహా ఫుజూరహా వతఖ్‌వాహా)**. మనిషిలోని మంచి, చెడు గుణాలు అతని ప్రకృతిలోని భాగాలే. వ్యక్తులు సంఘం (ఇజ్తిమా)గా ఏర్పడి ఇతరుల సుఖదుఃఖాలలో పాలుపంచుకోవడం, వారి యోగక్షేమాలు తెలుసుకోవడం, వారికి న్యాయం చేయడంలాంటి మంచి పనులు చేస్తుంటారు. కాని స్వయంగా ఆ సంఘంలోని వ్యక్తుల మధ్య అభిప్రాయభేదాలు రావడం, జగడాలు, పోట్లాటలు, బలాత్కారం జరిగి వారికి ఇబ్బంది కలగడం, సంకట స్థితి ఏర్పడడం సహజం. తద్వారా వారు అశాంతికి గురవుతారు. వారికి మనశ్శాంతి లేకుండాపోతుంది. ఈ వివాదాలను

పరిష్కరించడానికి రెండు విధానాలు ఉన్నాయి. ఒకటి, సంఘ (ఇజ్తిమా) జీవితాన్ని వదలిపారిపోవడం. రెండు, సంఘుం అంతర్గత సమస్యలను పరిష్కరించడం.

మొదటి మార్గాన్ని అతను అనుసరించలేదు. ఎందుకంటే అతను సంస్కరణాభిలాషి అయివుంటాడు. కాబట్టి. ఇక రెండవ మార్గం, సంఘుం (ఇజ్తిమా)లో ఉత్పన్నమయిన ప్రతి సమస్యను పరిష్కరించడం.

సంఘుంలోని కొందరు వ్యక్తులు సమస్యలను అదుపు చేయలేరు. ఆయా వ్యక్తులు తమ నిర్ణయాలు తీసుకుని చర్యలు చేపట్టలేరు.

సంఘ జీవితంలో దౌర్జన్యాన్ని అణచివేసే శక్తి తప్పనిసరి. వ్యక్తుల హక్కులను కాపాడే, అన్యాయాన్ని అరికట్టే అధికారం అవసరం. పీడిత జనులకు ఆసరాగా నిలబడే పాలన అవసరం. ఈ పనులన్నీ అధికారికంగా 'ప్రభుత్వమే' చేయగలుగుతుంది. ఇబ్నె ఖుత్‌మన్ అనే ఆయన ఈ విధంగా పేర్కొన్నారు. "ఏ విధంగా జన్మతః మనిషి సంఘ జీవియో, అదే విధంగా ఆ సామూహిక జీవనంలో ఎదురయ్యే దురాగతాలను, చిక్కులను విడదీసి వ్యక్తుల మధ్య ఐకమత్యాన్ని కలిగించడానికి అధికారం అనివార్యం."

ప్రభుత్వాధికారం కేవలం సంఘ సమస్యలను పరిష్కరించడమేకాదు ప్రభుత్వానికి ముప్పును కలిగించే శక్తుల పట్ల కూడా అది జాగరూకతతో వ్యవహరిస్తుంది. అలా జాగ్రత్త పడటం ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం. సంఘ జీవితపు చివరి రూపం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం.

షరీఅత్ అధికారం

ముస్లిములలో కూడా మంచి చెడు లక్షణాలు ఉంటాయి. వీరూ

మనుషులే. ముస్లిముల హృదయాలలో దుర్బుద్ధి, దైవభీతి రెండూ ఉంటాయి. కాబట్టి ముస్లిముల ద్వారా కూడా దుష్కార్యాలు జరుగవచ్చు. మానవుల స్వభావరీత్యా జరగవలసిన పొరపాట్లు, దౌర్భాగ్యాలు ముస్లిం సమాజంలోనూ కనబడతాయి. ముస్లిం ద్వారా ఈ తప్పిదాలు ఎప్పుడైనా సంభవించవచ్చు. వీటి పరిష్కారానికి ఇస్లామీయ షరీఅత్ (ధర్మశాస్త్రం) దోహదపడుతుంది. షరీఅత్ నియమ నిబంధనలు ముస్లిముల మధ్య దుర్మార్గాన్ని, బలాత్కారాన్ని పూర్తిగా అణచివేస్తాయి. సమాజశాంతిని రక్షిస్తాయి. మనిషి ప్రాణాన్ని, ఆస్తిని, మానమర్యాదలను కాపాడతాయి.

పై వాదన ద్వారా ముస్లిం సమాజానికి ఒక అధికార వ్యవస్థ అవసరం అని తెలుస్తోంది. ఆ అధికార వ్యవస్థ ఆలోచనాశక్తి కలిగి ఉండాలి. విశిష్టమైన నైపుణ్యం కలిగివుండాలి. వివేకపూరితమైనదిగా ఉండాలి. ముస్లిముల అధికార వ్యవస్థ ఇతరుల పాలనా వ్యవస్థలా కాకుండా, ధార్మికమై వుంటుంది. ఇస్లామీయ షరీఅత్ (ధర్మశాస్త్రం) గురించి కొంతమేరకైనా తెలుసుకోవాలి.

ఖుర్‌ఆన్‌లోని శాసనాలను, ఉత్తర్వులను, ఆజ్ఞలను పరిశీ లిద్దాం. "ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త(స)కు విధేయత చూపండి. మీలోని నాయకులకు కూడా." ***(నిసా –50)***

చట్టపరంగా ప్రజలపై చర్యలు తీసుకోవాలన్నా అధికార వ్యవస్థ తప్పనిసరి. ఉదాహరణకు, హంతకుడికి ఉరిశిక్ష విధించాలన్నా, దొంగతనం చేసిన వారి చేతిని నరకాలన్నా, వ్యభిచారికి రాళ్ళు రువ్వాలన్నా, కొరడాతో కొట్టాలన్నా మొదలగు పనులన్నీ సమాజంలోని వ్యక్తులు వ్యక్తిగతంగా చేయలేరు. ప్రభుత్వాధికారులు మాత్రమే ఆయా దుశ్చేష్టలకై చర్యలు చేపడతారు. అల్లాహ్ ఆజ్ఞలను, శాసనాలను ప్రజల మధ్య ప్రచారం చేసి ఆచరింపవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. నాయకుడు, అధికారి (ఇమాం)లేని ముస్లిం సమాజాన్ని ఊహించలేం.

ఇమాం ఫఖరుద్దీన్ రాజీ (రహ్మా) ఖుర్ఆన్‌లో సూరె మాయిదా వాక్యాన్ని ఈ విధంగా విశ్లేషించారు.

"దొంగతనం చేసింది- పురుషుడైనా, స్త్రీ అయినా ఉభయుల చేతులూ నరకండి."

ముస్లిం సమాజానికి నాయకుని (ఇమాం) అవసరం ఎంతైనావుంది. అల్లాహ్ పై వాక్యంలో పాపకార్యాలు చేసినవారికి విధించే శిక్షలు తెలియజేశాడు. ఈ శిక్షలను దొంగలపై లేదా వ్యభిచారిపై లేదా మరే ఇతర పాప కార్యాలు చేసినవారిపై అమలుపరచటానికి ముస్లిం సమాజానికి ఒక నాయకుడు ఉండాలి. ఇమాం (నాయకుడు) తప్ప మరే వ్యక్తీ చట్టాన్ని తన చేతుల్లో తీసుకోలేడు. అల్లాహ్ ఆజ్ఞలను, చట్టాలను ప్రజల మధ్య బాధ్యతాయుతంగా నిర్ణయాలు, తీర్మానాలు చేయవలసిన పూచీ ఇమాందే. ఇమాం నిర్ణయాలు తీసుకునేటప్పుడు, తీర్మానాలు చేసేటప్పుడు అల్లాహ్ నిర్ణయించిన హద్దులను అతిక్రమించరాదు. ప్రవక్త ప్రవచనాన్ని (హదీస్‌ను) చూద్దాం. ప్రారంభంలో ఈ హదీసులను పేర్కొన్నాం. అయినప్పటికీ ఇక్కడ పునశ్చరణ చేసుకోవటం సముచితంగా భావిస్తున్నాం.

ఖలీఫాతో బైత్ (ప్రమాణం) చేయకుండా ఎవరు మృతి చెందుతారో అట్టివారి మృతిని అజ్ఞానపు మరణంగా పేర్కొన్నారు ప్రవక్త(స).

అల్లాహ్ నాకు ఐదు విషయాలను ఆదేశించాడంటూ దైవప్రవక్త(స) ఈ క్రింది విషయాలను తెలియజేశారు.:

1. నాయకుడు చెప్పే మాటను శ్రద్ధగా వినడం.
2. ఆయన ఆదేశాలను శిరసావహించడం.
3. ధర్మమార్గంలో నిరంతరం కృషిచేయడం.

4. దైవమార్గంలో స్వస్థలం వదలి వలసవెళ్ళడం.
5. జమాఅత్(సంఘం)గా ఏర్పడటం.

మొదటి హదీసులో బైత్ అంటే ఖలీఫా చేతిపై చేయి వేసి "మిమ్మల్ని నేను ఖలీఫాగా ఒప్పుకుంటున్నాను" అని ప్రమాణం చేయడం. బైత్ చేయకుండా దానికి దూరంగా మసలుకుంటూ జీవితం గడిపి ఆ స్థితిలోనే మరణం సంభవిస్తే ఆ వ్యక్తి మరణాన్ని అజ్ఞానమైనదిగా పేర్కొన్నారు ప్రవక్త(స). ముస్లిం సమాజం తప్పకుండా ఖిలాఫత్ వ్యవస్థను కలిగివుండాలి. ఏదైనా సమాజంలో అధికారం లేదా ప్రభుత్వం దానికదే ఏర్పడదు. ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి ఆ సమాజంలోని వ్యక్తులు ప్రయత్నించాలి. ఆ ప్రయత్నాల ఫలితంగానే అధికారం ఏర్పడుతుంది.

రెండవ హదీసులో ఉమ్మత్ (అనుచర సమాజం)కు ఏ విధంగా ఆజ్ఞాపాలన చేయాలో స్పష్టంగా తెలియజేయబడింది. ముస్లిములు ఓ జమాఅత్‌గా సంఘటితం కావడం అనివార్యం.

జమాఅత్ సభ్యులు తమ అమీర్(నాయకుని) ఆదేశాలను, సూచనలను శ్రద్ధగా వినాలి. ఆ ఆదేశాలను పాటించాలి.

ఇలా ప్రజలు ఆదేశాలను శ్రద్ధగా వినటం, ఆదేశాలను పాటించడం అనేది అధికారం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. ఎక్కడ అధికారం ఉండదో అక్కడ శ్రద్ధగా వినటం (సమా ఆచరించడం –(ఇతాఅత్) అనే ప్రసక్తే ఉండదు.

ప్రవక్త ముహమ్మద్(స) ఆచరణను చూసినట్లయితే ఆయన(స) జీవితమంతా ప్రపంచానికి ఆదర్శప్రాయం. ప్రవక్త(స) ఆజ్ఞలను, ఆదేశాలను జారీచేసినప్పుడు ఆయన(స) శిష్యగణం వెంటనే వాటిని శిరసావహించేది. హిజ్రత్ తర్వాత మదీనాలో ఒక చిన్న ఇస్లామీయ ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు ఇస్లాం స్వీకరించిన వారందరూ ఒకే జాతిగా, ఒకే సంఘంగా ఏర్పడ్డారు. ఈ

సంఘానికి ప్రవక్త(స) నాయకత్వం వహించారు. ముస్లిములందరూ ఒకే రాజ్యంగా ఒకే ప్రభుత్వ అధీనంలో కనబడతారు. దీనికి అధినేత ప్రవక్త(స).

ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత సహాబా(శిష్యులు రజి) గురించి తెలుసుకుందాం.

ప్రవక్త ముహమ్మద్(స) పరమపదించిన తర్వాత ఆయన సహాబా(రజి) అంత్యక్రియల వ్యవహారాలన్నింటినీ వదిలి మొదటగా ఖలీఫాను ఎన్నుకునే పని ప్రారంభించారు. అందరూ సమాలోచనలు జరిపి ఏ ఆర్భాటమూ, వాగ్వివాదమూ లేకుండా 'ఖలీఫా'ను ఎన్నుకున్నారు. ఆ తర్వాత ప్రవక్త(స) భౌతికకాయాన్ని ఖననం చేయటానికి తీసుకెళ్ళారు. మొదటి ఖలీఫా(రజి) చనిపోయిన తరువాత ఈ విధానాన్నే అవలంబించారు. ఎల్లప్పుడు ఈ రీతినే కొనసాగించారు. ఖలీఫాను నియమించిన తరువాతనే, చనిపోయిన ఖలీఫా అంత్యక్రియలు మొదలయ్యేవి.

సహాబా(రజి)ల ఈ ఆచరణ, ముస్లిం సమాజానికి ఒక నాయకుని లేదా అధికారి అవసరం ఎంతగా ఉందో తెలుస్తోంది. నాయకుడు లేకుండా ముస్లిం సమాజం ఉండకూడదు అనే విషయంపై సహాబా(రజి) అందరూ ఏకాభిప్రాయాన్ని కలిగివుండేవారు.

ప్రవక్త(స) మరణానంతరం హజ్రత్ అబూబకర్(రజి) సహాబాలందరినీ సమావేశపరచి ఈ విధంగా అన్నారు :

జనులారా! హజ్రత్ ముహమ్మద్(స) మరణించారు. ధర్మపరిరక్షణార్థం మరో నాయకుని అవసరం అనివార్యం.

అబూబకర్ సిద్దీఖ్(రజి) ఉద్దేశం ఖలీఫాను ఎన్నుకోవడం తప్ప మరేమీ కాదు. జనసమూహంలో ఏ ఒక్కరు కూడా ఈ ప్రతిపాదనను త్రోసిపుచ్చలేదు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్(రజి) మాటలను చూడండి :

జమాఅత్ లేకుండా ఇస్లాం మనజాలదు. అధికారం లేకుండా జమాఅత్ కొనసాగదు.

అలీ(రజి) ఇలా అన్నారు :

వారి మాటలకు అర్థం, ప్రభుత్వం అవసరం లేదు కాని అధికారం తప్పనిసరి. అది మంచిదైనా చెడ్డదైనా.

ధర్మ, సమాజ రక్షణార్థం– ఓ అధికారిక పాలన ఎంతగా అవసరమో పై ఖుర్ఆన్ వాక్యాల ద్వారా, హదీసుల ద్వారా, సహాబాల అభిప్రాయాల ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది. ఇక ధార్మిక పండితులు ప్రభుత్వాధికారం గురించి ఏమంటారో చూద్దాం.

ముస్లిం సమాజాన్ని పటిష్ఠపరచడానికి, దాన్ని సమైక్యంగా ఉంచడానికి అధికారి అవసరం ఎంతైనా వుంది.

ఖాజీ మావర్దీ ఏమంటున్నారో గమనించండి:

"ఇమామత్(అంటే ఖిలాఫత్) ఎవరు సమర్థవంతంగా నిర్వహిస్తారో వారినే 'అధికారిగా' ఎన్నుకోవాలి.

అదేవిధంగా అల్లామా తఫ్తౌజానీ అనే ధార్మికవేత్త షరా అఖాఎద్ నఫ్సియా అనే గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు :

"ఇమామ్ అంటే ఖలీఫా నియామకం అత్యంత ఆవశ్యకం."

ముస్లిం సమాజంకోసం అధికార పాలనను ఏర్పాటు చేయటం షరీఅత్ రీత్యా తప్పనిసరి. ఒకవేళ ఇస్లామీయ ప్రభుత్వాన్ని నియమించనట్లయితే అది

సామాజిక పాపంగా పరిగణించబడుతుంది. దీనికిగాను అల్లాహ్ సమక్షంలో జవాబు చెప్పుకోవలసివుంటుంది.

ఇదే గ్రంథంలో మరోచోట ఈ విధంగా ఉంది.

షరీఅత్ అవసరాలు ప్రభుత్వ (ఇమామత్) పరిధిలోనే సజావుగా పరిపూర్ణం గావించబడతాయి. ఒక ఇంటికి పునాది ఎంత అవసరమో షరీఅత్ (ఇస్లామీ ధర్మశాస్త్రం) నియమ నిబంధనలు, చట్టాలను అమలుపరచడం కూడా సమాజానికి అంతే అవసరం.

తప్పనిసరిగా నెరవేర్చవలసిన ధార్మికమైన పనులు ప్రభుత్వం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. చట్టాలు ఉల్లంఘించబడుతున్నప్పుడు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వమే లేనప్పుడు ధర్మం తన నిజస్థానంలో ఎలా మనగలుగుతుంది? అధికారంలేని పక్షంలో ఇస్లాం ధర్మం సంపూర్ణంగా దర్శనమివ్వదు. ఉదాహరణకు, అంగవైకల్యం గల వ్యక్తి, సంపూర్ణ ఆరోగ్యవంతుడికి సరిసమానం కాలేడు. కుంటివారు, గ్రుడ్డివారు, మూగవారు సర్వాంగ సౌష్టవంగల వ్యక్తుల మాదిరిగా పనులను సమర్థవంతంగా నిర్వహిం చలేరు. అదే విధంగా అధికారిక పాలన లేనిపక్షంలో ధర్మం సహజంగా పూర్తి రూపంలో కొనసాగదు. ఇస్లాంలో పాలనా పద్ధతులు కేవలం ప్రవక్త ముహమ్మద్(స)కే పరిమితం కావు. ఇస్లాం పరిధి సువిశాలమైనది. ముహమ్మద్(స)కు పూర్వం పంపబడ్డ ప్రవక్తలకు అందజేయబడిన ధర్మమూ ఇస్లామే. వారికీ పాలనా పద్ధతులు నేర్పబడ్డాయి. స్వయంగా ప్రవక్త(స) మాటలు చూడండి.

"బనీ ఇస్రాయీల్ ప్రజలకు అప్పటి ప్రవక్తలు పాలనాధికారాన్ని చేపట్టే వారు. ఒక ప్రవక్త గతించిన తరువాత మరో ప్రవక్త నియామకం జరిగేది." (ముస్లిం)

హ్రజత్ దావూద్(అ), ఆయన సంతానం, హ్రజత్ సులేమాన్(అ) అలనాటి గొప్ప రాజులు, రాజ్యాధికారులు.

ప్రతి ప్రవక్త ఆయా కాలపు ప్రజలను దైవధర్మం వైపు ఆహ్వానించేవారు. ధర్మం అంటే కేవలం ఆరాధనలకే పరిమితం కాదు. ధర్మం మానవ జీవన రంగాలను సంస్కరిస్తుంది. పై హదీసులలో ప్రవక్త(స) ఈ విషయాన్నే తెలియ జేశారు. ప్రవక్తల విధులలో పరిపాలన కూడా ఒక అంశమే.

ఖిలాఫత్ విధులు

ఏ వ్యక్తి అయితే ఖలీఫాగా ఎన్నుకోబడతాడో అతని కార్యనిర్వహణ సువిస్తారంగా, విశాలంగా, పలు విధాలుగా వుంటుంది. ఖిలాఫత్ అంటే అధికారం, మొదటి నుండి చివరి వరకు ఆసాంతం షరీఅత్‌కు అనుగుణంగా ఉండాలి. ఖిలాఫత్ ఉద్దేశ్యమే షరీఅత్‌ను అమలుపరచడం. తద్వారా భువిపై అల్లాహ్ ధర్మాన్ని స్థాపించడం. ప్రవక్త ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు:

అంగవైకల్యం గల ఒక బానిస జాతికి చెందిన వ్యక్తి మీకు అమీర్ (అధికారి)గా నియమించబడినట్లయితే, అతను దైవాదేశాలకు కట్టుబడి ఉన్నట్లయితే అతనికి శిరసావహించండి.

మరో చోట ప్రవక్త(స) ఈ విధంగా చెప్పారు :

ఖలీఫా ఖురైషీయుడయినప్పుడు, అతనికి వ్యతిరేకంగా ఎత్తుగడలు వేసినప్పుడు అల్లాహ్ అతడిని నికృష్టపు స్థాయికి చేరుస్తాడు. (బుఖారి)

ఖలీఫా షరీఅత్‌కు అనుగుణంగా షరీఅత్‌ను అనుసరించి ప్రజా సమస్యలను పరిష్కరించాలి. తన స్వంత అభిప్రాయాలకు ఎలాంటి తావునివ్వ కూడదు అని పై హదీసుల ద్వారా బోధపడుతుంది. అధికారికంగా ఒక వ్యక్తి ఖలీఫాగా నియమించబడ్డాడంటే అతని ప్రధాన కర్తవ్యం ధర్మసంస్థాపనే. ఆ

ధర్మాన్ని రక్షించడానికి ఖలీఫా తప్పనిసరి. ప్రవక్త(స) బోధనల సారాంశం కూడా అదే. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) మాటలు కూడా మీ ముందున్నాయి. ప్రవక్త ముహమ్మద్(స) దివంగతులైనప్పుడు ధర్మప్రచారానికి, ధర్మాన్ని కాపాడ డానికి ఒక వ్యక్తి అవసరం వుంది అని సహాబా(రజి)ను ఉద్దేశించి ఆయన అన్నారు. ఈ పలుకులు కేవలం హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి)వి మాత్రమే కాదు. అందరి సహాబాల అభిప్రాయం కూడా అదే. ఎవరూ భేదాభిప్రాయాన్ని లేవనెత్తలేదు. దీని ద్వారా తెలిసేదేమిటంటే ఖలీఫా ఉనికి అల్లాహ్ ధర్మాన్ని స్థిరపరచడమే.

ప్రవక్త ముహమ్మద్(స)ను అనుసరించి ధర్మాన్ని స్థాపించడమే ఖిలాఫత్.

ధర్మస్థాపన అంటే అర్థం దైవాదేశాల పాలన. ముస్లిం సమాజాన్ని దైవా దేశాల పాలనాబద్ధంగా, ఖుర్ఆన్ హదీసులకనుగుణంగా వారి జీవితాలను మార్చడం. దైవాదేశాలను అన్నింటినీ చర్చించడం సాధ్యంకాదు కాబట్టి సమగ్రంగా కొన్నింటిని తెలుసుకుందాం. దీనివల్ల ఖలీఫా విధులేమిటో తెలుస్తాయి.

1. విద్యను, ధర్మజ్ఞానాన్ని పరిరక్షించడం.
2. నమాజ్, జకాత్, రోజా, హజ్– ఇవి ధర్మానికి పునాదుల్లాంటివి. వీటిని ప్రతి ఒక్కరు ఆచరించాలి. వాటిని స్థాపించాలి. ఇస్లాం మూల విషయా లకు సంబంధించి సమాజంలో అజ్ఞానానికి లోనైన వారిని సంస్కరించి మార్గవిహీనత నుండి కాపాడాలి.
3. ధర్మరక్షణార్థం, జాతి పరిరక్షణకు శతృవుతో ఒప్పందం లేదా తీర్మానం చేసుకోవాలి. సమయం వస్తే యుద్ధానికి కూడా సిద్ధమవ్వాలి.
4. అన్ని వ్యవహారాలలో న్యాయానికి ప్రతీకగా నిలవాలి.
5. అపరాధులకు తగిన శిక్షలు విధించాలి.

6. ప్రతి పౌరుని మానమర్యాదలకు, ప్రాణానికి, ఆస్తులకు భంగం కలగకుండా కాపాడాలి. సమాజంలో శాంతిని నెలకొల్పాలి.
7. బలహీనులను, అగత్యపరులను ఆదుకోవాలి.
8. సమాజంలో అంతర్గతంగా, బాహ్యంగా చెడులకు దూరంగా ఉంటూ మంచిని పెంపొందించాలి.

ఖలీఫా విధులు

ప్రాతినిధ్య హక్కులు : ఖలీఫా విధులు ఎంత విస్తృతంగా, సమగ్రంగా ఉన్నాయో, వ్యక్తిగతంగా ఒక ముస్లిం విధులు కూడా అంతే విస్తారంగా ఉన్నాయి. ఇలాంటి విశిష్టమైన హక్కులు ఒక్క ఇస్లాంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా కానరావు. ఆ హక్కుల వివరణ క్రింద పేర్కొనబడింది.

ఇతాఅత్ (విధేయత) : ఖలీఫా ఆజ్ఞలను విని శిరసావహించడం ఎంతటి ప్రాముఖ్యతను కలిగివుందో క్రింది ఖుర్ఆన్ ఆయత్‌ను బట్టి తెలుస్తోంది.

"విశ్వసించిన ప్రజలారా! విధేయత చూపండి. అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్తకు, మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు."

అల్లాహ్ ఆజ్ఞలను పాలించడం, ప్రవక్త(స)కు విధేయత చూపడం ఒక ముస్లింకు ఎంత అవసరమో, అమీర్ పట్ల విధేయతను కలిగివుండటం కూడా అంతే అనివార్యం.

ప్రవక్త(స) ఈ క్రింది విధంగా సెలవిచ్చారు :

"నాకు విధేయత చూపేవాడు, అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. ఎవరైతే నన్ను ధిక్కరిస్తారో నిశ్చయంగా అతను అల్లాహ్‌ను ధిక్కరించినట్లే. ఇంకెవరైతే

అమీర్ ఆజ్ఞను పాలించాడో అతడు నా ఆజ్ఞను శిరసావహించినట్లే. అదేవిధంగా అమీర్ ఆజ్ఞలను ధిక్కరించేవాడు ఆ ఆదేశాలను వ్యతిరేకించినట్లే." (ముస్లిం)

ఇతాఅత్ (విధేయత) అనేది వ్యక్తి స్వీయ ఇష్టాలపై ఆధారపడివుండదు.

హజ్రత్ ఉబాదహ్ బిన్ సామిత్(రజి) ఈ విధంగా ఉల్లేఖించారు : "మమ్మల్ని ప్రవక్త(స) పిలిపించారు. మేము వెళ్ళి ప్రవక్త(స)తో బైత్ (ప్రమాణం) చేశాం. – మేము ఎల్లవేళలా, మాకు ఇష్టం ఉన్నా లేకపోయినా, మేము పేదరికంలో మగ్గినా, ధనవంతులమయినా– మా అమీర్ ఆజ్ఞలను జవదాటము.

స్వయంగా ముస్లింకు ఇష్టం లేకపోయినా, అనేక సమస్యలతో సతమతమవుతూ ఉన్నా అమీర్ ఆజ్ఞలను ధిక్కరించకుండా ఆచరించాలి. ఇది ఒక ముస్లిం విధి. ఆ అమీర్ చెడు నడతగల వాడైనప్పటికీ.

విధేయతా కోవకు చెందిన మరొక హదీసు...

"అమీర్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరుగుతూ ఉన్నప్పటికీ అమీర్ ఆజ్ఞను పాటించాలి."

విషయం పూర్తిగా అర్థం చేసుకోవడానికి క్రింది హదీసును గమనించండి.

మీరు అమీర్ (నాయకుని) ఆదేశాలను వినండి, ఆచరించండి. అది ఎంతవరకంటే మీ వీపులు రక్తసిక్తమై, మీ ఆస్తులు కబళించబడినా మీరు అమీర్ ఆజ్ఞాపాలన చేస్తూనే ఉండాలి.

ముస్లిం సర్వస్వాన్ని కోల్పోయినప్పటికీ విధేయతా పరిధిని ఎట్టి పరిస్థితిలోనూ అతిక్రమించకూడదు. పైగా అమీర్(నాయకుని) పట్ల

విధేయతను కలిగి ఉండటం అతని విధి. ఈ విధిని తప్పకుండా నెరవేర్చాలి.

అమీర్ (నాయకుని) ఆజ్ఞాపాలనను ఉల్లంఘించిన ముస్లిం స్థానమేమిటో ప్రవక్త(స) మాటల్లో చూద్దాం.

"ఎవరైనా విధేయతా పరిధిని అతిక్రమించినట్లయితే అతను ప్రళయదినాన అల్లాహ్ ముందు హీనస్థితిలో ఉంటాడు. తనను మంచివాడుగా నిరూపించుకోవడానికి ఎలాంటి వాదన అతని దగ్గర మిగలదు."

పై హదీసు ద్వారా తెలిసేదేమిటంటే ఖలీఫా, అమీర్ (నాయకుని) మాట వినడం, శిరసావహించడం అనే విషయాల వ్యవహారం ఈ లోకం వరకే పరిమితం కాదు. వీటి పర్యవసానం పరలోకంలోనూ ఉంటుంది.

ప్రవక్త(స) మరో హదీసులో ఈ విధంగా సెలవిచ్చారు :

"అమీర్ ఏదైనా అనుచిత చేష్టలకు పాల్పడినా, అప్పుడు మీరు సహనం వహించండి. అమీర్ చేష్టలకు విముఖతను ప్రదర్శించకూడదు. ఎందుకంటే జమాఅత్ (సంఘం) నుండి జానెడు దూరం జరిగినా అతను అజ్ఞానపు స్థితిలో మరణిస్తాడు." (బుఖారి)

జాతి నాయకుడి (అంటే అమీర్ లేదా ఖలీఫా) ముఖ్య లక్ష్యం ప్రజలను సంఘటితంగా జీవింపజేయడం, ఆ సంఘంలో క్రమశిక్షణను నెలకొల్పడమే, అమీర్ మాటను జవదాటకూడదని, అమీర్ మాటను వ్యతిరేకించడం అంటే కేవలం వ్యక్తిగతంగా ఒక అమీర్‌ను నిరాకరించినట్లు కాదు, మొత్తం జమాఅత్(సంఘం)ను ఎదిరించినట్లు. ఇంతటి దుస్సాహసం ఎవరైనా చేస్తే అతను అజ్ఞానిగా పేర్కొనబడతాడు. కాబట్టి అతని చావును అజ్ఞానపు చావుగా పరిగణిస్తారు.

ప్రేమ : ఖిలాఫత్ మరొక హక్కు అమీర్‌ను గౌరవించాలి, ప్రేమించాలి. బాహ్యంగా పైకి చూడడానికి ఎలాంటి విధేయతనైతే వ్యక్తపరుస్తారో అంతరంగంలో కూడా అంతే ప్రేమను కలిగివుండాలి.

ప్రవక్త(స) ఈ విధంగా సెలవిస్తున్నారు :

"మీలో ఉత్తములైన పాలకులెవరంటే, మీకు ప్రజలంటే ఇష్టం, వారికి మీరంటే ఇష్టం. మీరు వారి క్షేమం కోసం ప్రార్థిస్తారు. వారు మీ క్షేమం కోసం ప్రార్థిస్తారు. అలాగే ప్రజలు అసహ్యించుకునేవారు దుష్టపాలకులు. వారికి మీరంటే అసహ్యం. అదేవిధంగా వారు ఎల్లప్పుడూ మిమ్మల్ని శపిస్తూ ఉంటారు, మీరూ వారిని శపిస్తూ ఉంటారు." (ముస్లిం)

పై హదీసులో తెలుపబడినట్లుగా ఖలీఫా ప్రజలతో మసలుకోవాలి. ప్రజలు అతడిని హృదయపూర్వకంగా ప్రేమించాలి, ఆదరించాలి. ఎల్లడెలా సహకరించాలి. ధార్మికతను గురించి ప్రవక్త(స) ఈ విధంగా తెలియజేశారు.

శ్రేయోభిలాషకు మరో పేరే 'ఇస్లాం ధర్మం.' అది విని సహచరులు 'ఎవరి శ్రేయాన్ని కోరటం' అని అడిగారు. అందుకు ప్రవక్త(స) సమాధానమిస్తూ అల్లాహ్ శ్రేయాన్ని, ప్రవక్త శ్రేయాన్ని, ముస్లింల ఖలీఫాల శ్రేయాన్ని, ముస్లిం జనసామాన్య శ్రేయాన్ని' అని చెప్పారు. ఇస్లామీయ రాజ్యంలో ఖలీఫాతో బైత్ (ప్రమాణం) చేయడం కేవలం ఆచార వ్యవహారంగా కాకుండా మనసా, వాచా హృదయపూర్వకంగా ప్రమాణం చేయడమన్నమాట.

ఎవరైతే ఖలీఫా చేతిలో చేయివేసి బైత్ (ప్రమాణం) చేస్తారో వారు తమ అంతరంగాన్ని అంటే మనస్సునూ, ఆలోచనల్నీ ఖలీఫాకు అనుగుణంగా ఉంచుకోవాలి. తమ జీవిత కాలమంతా విధేయతను కలిగిఉంటాను అని ప్రమాణం చేసినట్లు.

బైత్ (ప్రమాణం) ద్వారా ధార్మికంగా, పారలౌకికంగా ప్రయోజనాలు

ఇది ఇస్లామీయ రాజ్యంలో ముస్లిముల మూడవ విధి. ఖలీఫాతో బైత్ చేయడం కేవలం ధార్మిక అంశం మాత్రమే కాదు. ఇది పరలోకంలోనూ ప్రయోజనాన్ని కలిగిస్తుంది.

ప్రవక్త(స) ఈ క్రింది విధంగా పేర్కొన్నారు :

"ఎవరైతే ఐహిక భోగభాగ్యాలను, హోదాను ఆశించి ఖలీఫాతో బైత్ చేస్తారో పరలోకంలో ఆ వ్యక్తి వైపు అల్లాహ్ కన్నెత్తి కూడా చూడడు."

ఖలీఫాతో బైత్ (ప్రమాణం) చేయడం తప్పనిసరి. ఖలీఫాతో బైత్‌ను తిరస్కరించడం విశ్వాస ఘాతుకం. ఐహిక ప్రయోజనాలను ఆశించి అధికారం కోసం ప్రాకులాడటం, హోదాను చేజిక్కించుకోవడానికి లేని ప్రేమను ఒలకబోస్తూ ఖలీఫాతో బైత్ చేయడం కూడా విశ్వాస ఘాతుకమే. సాధారణంగా ప్రపంచంలోని ఇతర ప్రభుత్వాల, రాజరికంలోని ప్రజలు అధికారాన్ని పొందడమే పరమావధిగా భావిస్తారు. అధికారం వీరి వశమైతే వీరి ఆశలన్నీ తీరినట్లే. కాని ఇస్లాంలోని ప్రజా పరిపాలన ప్రపంచంలోని విధానాలన్నింటికీ పూర్తిగా భిన్నమైనది. ఇస్లాంలో పరిపాలన అల్లాహ్ ఆజ్ఞలకు, నియమ నిబంధనలకు, చట్టాలకు ప్రతిరూపంగా ఉంటుంది. కాబట్టే పరిపాలనాధికారి అయిన ఖలీఫాకు అంతటి అసాధారణ హక్కులను ప్రసాదిస్తుంది ఇస్లాం. ఆ విధానమేమిటో, ఆ హక్కులు ఎలాంటివో పై పేజీలలో చూశాం.

ప్రజలందరికీ తప్పనిసరిగా నాయకుని (అమీర్) అవసరం ఉంటుంది. ప్రజలను అల్లాహ్ ఆదేశాలకనుగుణంగా పాలించడం కూడా ధార్మిక విధియే. పాలనా ఆదేశాలు ధార్మికం అయినప్పుడు దానికి విధేయత చూపడం, ఖలీఫా ఆజ్ఞలను శిరసావహించడం ధార్మికతయే. ధార్మికతను కాపాడుకోవడం అనగా

విశ్వాసం– ఈమాన్‌ను సంరక్షించుకోవడమే. ఈమాన్‌ను కాపాడుకోవడంలోనే విశ్వాసికి సౌఖ్యం చేకూరుతుంది. ఒకవేళ వినయ వినమ్రతలు చూపే ప్రజలు లేకపోయినట్లయితే అక్కడ ప్రభుత్వానికి అర్థమే ఉండదు. ప్రజలు అవిధేయత చూపుతున్నారు అంటే ఖిలాఫత్ అంతం అవుతుందని తెలుసుకోవాలి. అందుకే ఖలీఫా ఆజ్ఞాపాలనకు అంతగా ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. ప్రజలు ఖలీఫా ఆజ్ఞాపాలన ఏ మేరకు చేయాలంటే స్వయంగా తమ ఆస్తులు దోచుకోబడు తున్నా, ప్రాణాలకు విలువ లేకున్నా, తాము హింసించబడతున్నప్పుడు కూడా ఖలీఫా ఆజ్ఞను ఉల్లంఘించకూడదు, జవదాటకూడదు. ఖలీఫా ఆదేశాలను పాటించడానికి ఇస్లాం ధర్మశాస్త్రం ఎందుకు ఇంత ప్రాముఖ్యతను ఇస్తుంది? అన్నది ప్రశ్న. ఎందుకంటే ఖలీఫాకు విధేయత (ఇతాఅత్) చూపడమంటే ఆ స్థానంలోగల వ్యక్తి (ఖలీఫా)కి విధేయత చూపడం కాదు. తద్వారా అల్లాహ్, ఆయన ప్రవక్త ముహమ్మద్(స) నియమ నిబంధనలకు, ఆదేశాలకు, విధేయత చూపినట్లు. అల్లాహ్ ఆదేశాలలో ధార్మికంగా ప్రజలందరూ సంఘటితంగా, శాశ్వతంగా ఉండాలి. అప్పుడే ధార్మికంగా తమ వంతు బాధ్యతను నిర్వహించి నట్లు. ముస్లిములు అనేక వర్గాలుగా అసంఘటితంగా ఉన్నంతకాలం వీరిలో ఇస్లాం చూపే ఐకమత్యం, సామూహికత గోచరించదు. కాబట్టి అల్లాహ్ ఆదేశా లకనుగుణంగా జీవితం కొనసాగించమని ముస్లిములకు తాకీదు చేయబడింది.

విధేయతా పరిధులు : ఖలీఫా మాట వినడానికి, విధేయత చూప టానికి, ఆజ్ఞను పాలించటానికి ప్రజలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఖలీఫాకు అసాధారణ అధికారాలను కట్టబెట్టింది ఇస్లాం. ఈ అసాధారణ అధికారాలకు ఏమైనా పరిధులు ఉన్నాయేమో చూద్దాం.

హదీసులో ప్రవక్త(స) ఈ విధంగా తెలిపారు: "ఆజ్ఞాపాలన, విధేయత కేవలం మంచి పనుల వరకే. పాపిష్టి పనులలో ఎవరికీ విధేయత చూప నవసరం లేదు." (ముస్లిం)

ఖలీఫాకు విధేయత, వినమ్రత చూపండి అని షరీఅత్ ఎంత బలంగా చెప్పిందో అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా చెడు కార్యాలకు, పాపిష్టి పనులను చేయడానికి ఖలీఫా ఆజ్ఞాపించినట్లయితే ప్రజలు బాహాటంగా వ్యతిరేకతను తెలుపవచ్చు. అంటే విధేయత కేవలం మంచి పనుల వరకే అని హదీసు ద్వారా తెలుస్తోంది.

ప్రముఖ ఇస్లామీయ విద్వాంసులు నవవీ(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "అమీర్‌కు మంచి పనులలో విధేయత (ఇతాఅత్) చూపడం, సహకరించడం ప్రతి ముస్లిం విధి. అదేవిధంగా చెడు కార్యాలలో విధేయత చూపడం నిషిద్ధం." ఈ అభిప్రాయంపై ఉలమాలందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

వివరంగా అర్థం చేసుకోవడానికి ప్రవక్త(స) కాలంనాటి సంఘటనను చూద్దాం.

ప్రవక్త ముహమ్మద్(స) ఒక అన్సార్ (మదీనా వాసి) నేతృత్వంలో జిహాద్ (ధర్మప్రచారం) కోసం పంపిస్తూ ఈ విధంగా హితవు పలికారు. "మీరు అమీర్‌కు విధేయతను కలిగి ఉండాలి."

ఆ బృందం ఒక ప్రదేశానికి పయనమయింది. ప్రయాణంలో అమీర్‌కు అనుచరులపై కోపం వచ్చింది. అమీర్ వారిని, "మీరందరూ కట్టెలను జమ చేయండి"అని ఆజ్ఞాపించారు. వారు ఒకచోట కట్టెలను ప్రోగు చేశారు. 'కట్టెలకు నిప్పు అంటించండి' అన్నారు అమీర్. అనుచరులు కట్టెలకు నిప్పు అంటించారు. కట్టెలు కాలుతూ ఉన్నాయి. అప్పుడు అమీర్ ఈ విధంగా అన్నారు. "అమీర్‌కు విధేయత చూపమని ప్రవక్త(స) మీకు ఆజ్ఞాపించలేదా?" దానికి అనుచరులు, అవును! మీకు విధేయత (ఇతాఅత్) చూపమన్నారు. అయితే మీరందరూ ఆ అగ్నిలో దూకండి అన్నారు అమీర్. సహచరులందరూ

బిక్కమొహాలతో ఒకరినొకరు తిరిగి చూసుకున్నారు. వారిలో కొందరు అగ్నిలో దూకడానికి సిద్ధమయ్యారు. మరికొందరు ఈ విధంగా అన్నారు. "ఆ అగ్ని నుండి రక్షించుకోవడానికే మేము ప్రవక్త(స) వద్దకు వచ్చాము. ఇప్పుడు మేము అందులో దూకడం ఎలా సాధ్యం?" ఈ విధంగా కొద్దిసేపు వాదన జరిగింది. వాదోపవాదాలకు కొంత సమయం పట్టింది. అప్పటికి నిప్పు చల్లారింది. అమీర్ కోపమూ తగ్గింది. అందరూ కలిసి ప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు. జరిగిన వృత్తాంతమంతా వివరించారు. పూర్తిగా విన్న తర్వాత ప్రవక్త(స) ఈ విధంగా అన్నారు, " ఎవరయితే అమీర్ ఆజ్ఞను అనుసరించి అగ్నికి ఆహుతి చేసుకుంటారో ప్రళయదినం వరకు వారు ఆ స్థితిలోనే కొనసాగుతారు."

పై సంఘటన ద్వారా స్పష్టంగా తెలిసేదేమిటంటే, అమీర్ ఆజ్ఞాపించి నప్పటికీ అల్లాహ్‌కు అవిధేయత చూపటం, అల్లాహ్ ఆజ్ఞలను, నియమ నిబంధనలను జవదాటటం ఒక ముస్లింకు హరాం. అంటే నిషిద్ధం.

కొన్ని సందర్భాలలో మంచి పనులలో ఖలీఫా తీసుకున్న నిర్ణయం నచ్చకపోవచ్చు, సరైనదిగా అనిపించకపోవచ్చు. అటువంటి సందర్భంలో కూడా తను మంచి అభిప్రాయాలను కలిగివున్నప్పటికీ, ఉపదేశించే సామర్థ్యం కలిగివున్నప్పటికీ స్పర్థలకు లోనవకుండానే ఖలీఫా ఆజ్ఞలను స్వీకరించాలి, అనుసరించాలి. అలాకాకుండా తమ తెలివితేటలపై, నిర్ణాయక శక్తిపై అతి నమ్మకంతో ఖలీఫాతో విభేదించకూడదు. మంచి పనుల్లో విభేదించే హక్కు ఎవరికీ ఉండదు. కేవలం పాపకార్యాలలో తప్ప.

ఖలీఫాను తొలగించడం

ఖలీఫా మంచిని ఆజ్ఞాపించినట్లయితే దానిని అంగీకరించి, చెడు కార్యాలను నిరాకరించవచ్చు అని పై పంక్తులలో తెలుసుకున్నాం. ఇక ఖలీఫా వల్ల కలిగే ఆకృత్యాలను, అన్యాయాన్ని ఎంతవరకు భరించాలి? ఏఏ పరిస్థితు

లలో ఖలీఫాను పదవీచ్యుతున్ని చేయాలి? ఈ క్రింది లక్షణాలను గమనించి నట్లయితే తెలుస్తుంది:

1) ఖలీఫా ప్రజల హక్కులను ఉల్లంఘించి, వారిపై దౌర్జన్యం, అన్యాయం, అక్రమం చేసి వారిని హింసించినప్పుడు.

2) ప్రజలకు పాపం చేయడానికి ఆజ్ఞాపించేవాడు. ఈ రెండు లక్షణాలు ఖలీఫాలో ఉన్నప్పటికీ 'షరీఅత్' ఆ ఖలీఫా చెప్పే పనులలో పాలుపంచుకోండి. ఆయన అధికారాన్ని సవాలు చేయకండి అని హితబోధ పలుకుతుంది.

3) ఖలీఫా స్వయంగా దుర్మార్గుడు అయి షరీఅత్‌కు వ్యతిరేకంగా కార్య కలాపాలు కొనసాగిస్తూ మార్గభ్రష్టతకు లోనయినప్పుడు.

ఖలీఫా దుర్మార్గాలకు ప్రజలు విసుగు చెందుతారు. అలా విసుగు చెందడం తప్పనిసరి కూడా. అయినప్పటికీ అతని అధికారాన్ని అలాగే కొన సాగించండి అంటుంది షరీఅత్. క్రింది హదీసును గమనించండి :

"వినండి! ప్రజలపై అధికారి నియమించబడినప్పుడు, అతను దౌష్ట్యాన్ని అనుసరించినప్పుడు విసుగు, అసమ్మతిని కలిగివుండండి, కాని విధేయతా పరిధిని అతిక్రమించకండి." (ముస్లిం)

దీని ప్రకారం ఉలమాలు పాపం కారణంగా ఖలీఫాను పదవీచ్యుతున్ని చేయడానికి తిరుగుబాటు ధోరణిని అవలంబించకూడదని అభిప్రాయపడ్డారు.

4) ధర్మ మూల విషయాలను విడిచిపెట్టుట.

ఈ లక్షణం ఖలీఫాలో ఉన్నట్లయితే అప్పుడు ఏం చేయాలి అనేది క్రింది హదీసుల ద్వారా తెలుస్తోంది.

మీపై అమీర్‌గా నియమింపబడినవారి కొన్ని మాటలు మీకు మంచి విగా అనిపించవచ్చు, మరికొన్ని చెడ్డవిగా అనిపించవచ్చు. అప్పుడు

సహాబా(రజి) ఈ విధంగా అడిగారు : "ఓ ప్రవక్తా! ఇలాంటి సందర్భంలో మేము అతనిపై యుద్ధం చేయవచ్చా?" సమాధానంగా ప్రవక్త(స), "అతను నమాజ్ అనుసరించేంత వరకు ఈ విధంగా చేయకూడదు."అని చెప్పారు.

మీ చెడ్డ పాలకులు ఎవరంటే, వారంటే మీకు అసహ్యం కలుగుతుంది. వారికీ మీరంటే అసహ్యం కలుగుతుంది. ఈ మాటలు విన్నవారు అడిగారు, "ఓ దైవప్రవక్తా! మరయితే మేము వారికి వ్యతిరేకంగా కత్తి కట్టాలా?" ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, "లేదు, వారు మీలో నమాజ్‌ను స్థాపించినంత వరకు మీరలా చేయకండి."

ప్రవక్త(స) ప్రవచనాల ద్వారా తెలిసేదేమిటంటే, ఖలీఫా నమాజ్‌ను ఆచరించినంతకాలం అతనికి వ్యతిరేకత ప్రదర్శించకూడదు. ఆ నమాజ్‌ను వదిలివేసినట్లయితే అతడిని ఖలీఫా స్థానం నుండి తొలగించవచ్చు. తొలగించి నప్పటికీ అధికారం వదులుకోని ఖలీఫాకు కత్తితో బుద్ధిచెప్పవచ్చు.

ఖాజీ అయాజ్(రజి), ఇతర పండితులు ఈ విధంగా అంటున్నారు:

కాఫిర్ (దైవధిక్కారి) ఎన్నటికీ ఖలీఫా కాలేడు, ఒకవేళ ఖలీఫాగా నియమింపబడిన తర్వాత కుఫ్రుకు పాల్పడినట్లయితే వెంటనే ఆ ఖలీఫాను పదవి నుండి తొలగించాలి. అదేవిధంగా ఖలీఫా నమాజ్‌ను స్థాపించక, ఇతరులను నమాజ్‌కై ప్రోత్సహించని వాడిని కూడా అధికారం నుండి తొలగించాలి.

హజ్రత్ ఉబాదహ్ బిన్ సామిత్(రజి) ఉల్లేఖించారు.

ప్రవక్త ముహమ్మద్(స) మమ్మల్ని పిలిచి మాచేత బైత్ (ప్రమాణం) తీసు కున్నారు. దానిలో ఈ విషయాలు ఉన్నాయి. మేము అమీర్ ఆజ్ఞను వింటాం. శిరసావహిస్తాం... ఆయన అధికారానికి ఇబ్బంది కలిగించం. ఒకవేళ అమీర్ కుఫ్రుకు పాల్పడినట్లయితే అల్లాహ్ ఆజ్ఞను అనుసరిస్తాం.

పై మూడు హదీసులలో ఖలీఫా లేక అమీర్‌ను ఏ పరిస్థితిలో అధికారం నుండి తొలగించవచ్చు అనే సమస్య చర్చించబడింది. మొదటి రెండు హదీసులలో నమాజ్‌ను విడిచిపెట్టినట్లయితే ఖలీఫాను అధికారం నుండి తీసివేయాలని, మూడవ హదీసులో బహిరంగంగా కుఫ్రుకు పాల్పడితే తొలగించాలని ఉంది. హదీసులో ఒకే సమస్యకు రెండు వేర్వేరు కారణాలున్నాయి. మరి ఖలీఫాను పదవీచ్యుతుడిని చేసే సరయిన కారణం ఏదయి ఉంటుంది? అసలు కుఫ్ర్ అంటే ఏమిటి? కుఫ్ర్ కేవలం విశ్వాసానికే పరిమితమా? లేక ఆచరణ రీత్యా కూడానా?

కుఫ్ర్ అంటే అధర్మం, అవిశ్వాసం, అపచారం, నాస్తికం, తిరస్కారం. అంటే నమాజ్ విడిచిపెట్టినవారు, ఆచరించనివారు బహిరంగంగా కుఫ్రుకు పాల్పడినట్లే. నమాజ్ కేవలం నమ్మకం, విశ్వాసానికి పరిమితం కాదు. ఆచరణ రీత్యా తప్పకుండా అమలుపరచవలసిందే. నమాజ్ చేయకపోవటం కేవలం విశ్వాస ఘాతుకం కాదు. అచరణ రీత్యా అవిధేయత కూడా. అవిధేయత కలిగిన అధికారి ఖలీఫాగా కొనసాగే అర్హతను కోల్పోతాడు. ఈ పరిస్థితిలో ఖలీఫా లేక అమీర్‌ను పదవి నుండి తొలగించాలి.

5) ఖలీఫా ఇస్లాం నియమ నిబంధనలు, చట్టాలను మార్చి ఇస్లామేతర సిద్ధాంతాలను చేర్చడం.

ఈ ఐదవ లక్షణం ఖలీఫాలో ఉన్నప్పుడు అతనితో ఎలా వ్యవహరించాలో క్రింది ఖుర్‌ఆన్ ఆయత్ ద్వారా తెలుస్తోంది.

అల్లాహ్ అవతరింపజేసిన శాసనానికనుగుణంగా ఎవరైతే తీర్పు ఇవ్వరో వారే మహా పాపాత్ములు.

అల్లాహ్ షరీఅత్ ఆధారంగా తీర్పు ఇవ్వకుండా అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించి స్వయంగా తనకు తోచిన చట్టాన్నో లేక ఇతరుల చట్టాన్నో అమలు

పరిచినవాడు మహా పాపాత్ముడు. అతడు కుఫ్రకు అంటే తిరస్కారానికి పాల్పడినట్లే. దైవాదేశానికి వ్యతిరేకంగా తీర్పు చేసే వ్యక్తి పూర్తిగా అత్యాచారి, పాపాత్ముడు. ఇస్లామీయ శాసనాలను తారుమారు చేసే వ్యక్తి అధికారంలో కొనసాగడానికి వీలు లేదు.

ఖాజీ అయాజ్(రహ్మ) ఈ విధంగా పేర్కొన్నారు :

"ఒకవేళ ఖలీఫా తిరస్కారానికి పాల్పడితే, షరీఅత్ నియమాలను, చట్టాలను మార్చినట్లయితే, కొత్త పోకడలకు దారితీసినట్లయితే ఆ ఖలీఫా అధికారం చెలాయించడానికి వీలులేదు. ప్రజలు అతనికి విధేయత చూపనవసరం లేదు. అతనికి వ్యతిరేకంగా పోరాడి అతన్ని పదవి నుండి తొలగించి ఖలీఫాకు, అధికారానికి యోగ్యుడైన మరో వ్యక్తిని ఎన్నుకోవాలి."

ఇమాం నవవీ(రహ్మ) క్రింది విధంగా తెలిపారు :

ఖలీఫా ఇస్లామ్ మూల విషయాలలో (అర్కానె ఇస్లాంలో) మార్పు చేయనంతవరకు అతని ఆగడాలను ఓపికతో, సహనంతో భరించాలి.

పైన పేర్కొనబడిన ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెలిసేదేమిటంటే, ఖలీఫా అల్లాహ్ ఆజ్ఞలను, చట్టాలను మార్చినప్పుడు ఖలీఫానూ మార్చాలి.

6) ఖలీఫా ఇస్లామీయ ధర్మాలకు, సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కుఫ్రకు పాల్పడటం.

ఈ పరిస్థితిలో ఖలీఫాను తొలగించాలి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఖలీఫా అధికారంలో ఉండడానికి ఇస్లాం పట్ల విశ్వాసం తప్పనిసరి. ఎవరిలోనైతే ఈ విశ్వాసం కనబడదో వారు ఖలీఫా పదవికి అనర్హులు. కుఫ్రను అనుసరించేవారు అధికార స్థానంలో ఉండలేరు. ఈ విషయమై ఉలమాలందరి

లోనూ ఏకాభిప్రాయం ఉంది. హాఫిజ్ ఇబ్నె హజర్ ఈ విధంగా రాశారు:

"ఖలీఫా తిరస్కారానికి (అంటే కుఫ్రుకు) పాల్పడినట్లయితే అతడు పదవీభ్రష్టుడైపోతాడు. అతడిని తొలగించడం కోసం ప్రతి ముస్లిం లేచి నిలబడాలి. బాధ్యతను గుర్తెరిగి సహాయపడినవారికి పుణ్యం లభిస్తుంది. బద్ధకాన్ని ప్రదర్శించినవారు పాపానికి గురవుతారు. ఎంత ప్రయత్నించినప్పటికీ ఈ ఉద్యమంలో పాల్గొనలేని వారు హిజ్రత్ (ఒక స్థలం నుండి మరో స్థలానికి వెళ్ళడం) చేయాలి." *(ఫత్‌హుల్ బారి)*

పైన పేర్కొన్న ఆరు విశిష్ట లక్షణాలలో మూడు లక్షణాలు కనబడుతూ ఉన్నప్పటికీ షరీఅత్ రీత్యా అధికారిపై చర్య చేపట్టలేరు. అంటే ఖలీఫా వల్ల కలిగే ప్రతి దౌష్ట్యాన్ని, దౌర్జన్యాన్ని, పాపకార్యాలను చూస్తూ, భరిస్తూ ఉండండి అని అర్థంకాదు. వాస్తవాన్ని ఖలీఫా దృష్టికి తీసుకెళ్ళాలి. విషయాన్ని విడమరచి తెలియజేయాలి. సరైన విధానమేదో సూచించాలి.

ప్రవక్త ముహమ్మద్(స) ఎక్కడైతే అమీర్ లేక ఖలీఫా ఇతాఅత్(విధేయత) చూపమన్నారో అక్కడే పరిధిలనూ ఏర్పరిచారు. తరువాతి లేదా చివరి మూడు విషయాలలో ఖలీఫాను పదవి నుండి తొలగించమని ఉపదేశించబడింది.

సమాజంలో క్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి ప్రజలకు ప్రభుత్వం అవసరం ఉంటుంది. ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అలంకరించిన వ్యక్తి షరీఅత్ నిబంధనలను పాటించేవాడై ఉండాలి. షరీఅత్‌కు తిలోదకాలిచ్చి ఇస్లాం చూపే రుజుమార్గాన్ని వదిలి ఖలీఫాగా కొనసాగినట్లయితే అతడు తన అధికారాలను తన వ్యూహాలకు అనుగుణంగా మార్చుకుంటాడు. ఇలాంటి ఖలీఫా ప్రాపంచికంగా కొత్త వస్తువులను, నూతన కల్పనలను సృష్టించవచ్చు. కాని ధార్మిక సుగుణాలు మాత్రం అతనిలో కానరావు. షరీఅత్‌ను ఉల్లంఘిం

చిన ఖలీఫాలో దైవభీతి కనబడదు. అప్పుడు 'ఖలీఫా' పదవి నుండి అతడిని వెంటనే తొలగించాలి. అలా తొలగించడం ముస్లిముల ప్రథమ కర్తవ్యం కూడా.

ఖలీఫా తొలగింపుపై పరిస్థితుల ప్రభావం

సృష్టిధర్మం ఇస్లాం. ఇది శాశ్వతమైనది. కనుక పరిస్థితులకనుగుణంగా, కాలానుగుణంగా షరీఅత్ నియమ నిబంధనలు, రాజకీయ అంశాలు మార్పు చెందుతాయి. నవీనతను సంతరించుకుంటాయి. ఇవి సమాజానికి దిశా నిర్దేశనం చేస్తూ అశాంతి, అలజడుల నుండి రక్షిస్తాయి.

రాజ్యపరిధి చిన్నదైనట్లయితే పరిపాలన పరిమితంగా ఉంటుంది. రాజ్య విస్తరణ జరిగినకొద్దీ, పెరిగే అవసరాలకు అనుగుణంగా పద్ధతులు, నియమాలు, సూత్రాలు పెరుగుతాయి, మారుతాయి. సాధారణంగా ప్రతి రాజ్యం అన్నివిధాలుగా వృద్ధిచెందాలని కోరుకుంటుంది. అభివృద్ధిపరచాలి కూడా.

ఖలీఫాను తొలగించడం, పదవీచ్యుతుణ్ణి చేయడం కూడా పరిస్థితుల్ని ప్రభావితం చేస్తుంది. శతాబ్దాల పూర్వంనాటి పరిస్థితులు నేడు లేవు. నాగరికతలో ఎంతో మార్పు చోటుచేసుకుంది. ప్రతి విధానంలో సులభమార్గాలు ఏర్పడ్డాయి. అసలు ప్రశ్న ఏమిటంటే, ఖలీఫాను పైన పేర్కొన్న మూడు లక్షణాలూ ఉన్నప్పుడు తొలగించాలా? లేక ఏదో ఒక కారణం ఉన్నప్పుడు కూడా తొలగించవచ్చా? వివరంగా చూసినట్లయితే ప్రజల హక్కులను, వారి ధన, ప్రాణాలను కాపాడటం ఖలీఫా రాజ్యపరిధిలో ఉంటుంది. ఖలీఫా గుణవంతుడైతే, దైవభీతి పరుడైతే తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తాడు. కాని ఖలీఫా గుణహీనుడైతే ఇతని లక్షణాల ప్రభావం ప్రజలపై తప్పక ఉంటుంది. ఖలీఫా ప్రజలను చెడు నుండి వారించి మంచిని ప్రోత్సహించేవాడై ఉండాలి. స్వయంగా ఖలీఫా దురాచారంలో, దుర్మార్గాలలో లీనమయినప్పుడు అతని

అధికారాన్ని అంతమొందించాలి. అలాంటప్పుడు పైన పేర్కొన్న హదీసులో నమాజ్‌ను వదిలిపెట్టడం, బహిరంగంగా తిరస్కారానికి (కుఫ్రుకు) పాల్పడనంత వరకు ఖలీఫాకు వ్యతిరేకంగా పావులు కదపకూడదు అని వుంది. దీనిలోని ఔచిత్యం, వివేకం ఏమిటి? క్రింది హదీసు ద్వారా తెలుస్తోంది.

ఈ విషయమై ధార్మికవేత్తలందరిలోనూ ఏకాభిప్రాయం ఉంది. ఖలీఫా భ్రష్టతను, దుర్మార్గాన్ని అవలంబించినప్పుడు అతడిని అధికారం నుండి తొలగించలేం. ఎందుకంటే అతడు ఖలీఫాగా ఉన్నప్పుడు జరిగే జగడాలు, ఏర్పడే పోట్లాటల కన్నా పదవి నుండి తొలగించినప్పుడు ఎక్కువ రక్తపాతం, కల్లోలం సంభవించే అవకాశం ఉన్నట్లయితే ఖలీఫాను పదవిలో యధాతథంగా కొనసాగించాలి.

దురాచారి అయిన ఖలీఫా ఆగడాలను భరించాలి, లేదా బలవంతంగా ఖలీఫాను తొలగించాలి. ఒకవేళ ఖలీఫా దుర్మార్గాన్ని సహించినప్పటి ప్రాణ నష్టం కంటే అతడిని బలవంతంగా తొలగించినప్పుడు అధిక రక్తపాతం, అల్లర్లు, అలజడులు జరిగినట్లయితే ప్రజల ప్రాణనష్టాన్ని, సమాజంలో సంక్షోభాన్ని నివారించడానికి ఖలీఫాను ఓపిగ్గా సహించాలి. కేవలం సామాన్య ప్రజలు హత్యలకు, విధ్వంసానికి లోనుకాకుండా ఈ నిర్ణయం తీసుకోబడింది. ఎప్పుడైతే, దుర్మార్గుడైన ఖలీఫాను తొలగించినప్పటికీ సమాజంలో కల్లోలం సంభవించే అవకాశం లేదో అప్పుడు ఖలీఫాను వెంటనే తొలగించాలి. ఈ పద్ధతులను మనిషి నైజమూ కోరుకుంటుంది. దీనినే షరీఅత్ సమర్థిస్తుంది.

హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మా) ఇలా అన్నారు : "దౌర్జన్యపరుడు, క్రూరుడు అయిన ఖలీఫా గురించి ధార్మిక పండితులు ఈ విధంగా ఫత్వా (ధార్మిక తీర్పు) జారీచేశారు. కల్లోలం, ఉపద్రవం సంభవించనప్పుడు ఖలీఫాను పదవీచ్యుతుణ్ణి చేయాలి. అలా జరుగనప్పుడు సహనం పాటించాలి." (ఫత్‌హుల్ బారి)

ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు :

"అమీర్‌ను లేక ఖలీఫాను అధికారం నుండి తప్పించినప్పుడు హత్యలు, అల్లర్లు, అలజడులు సంభవించే అవకాశం ఉంటే అతడి అధికారం పట్ల సహనం వహించండి." (ముస్లిం)

శతాబ్దాలకు పూర్వం నుండి నేటి వరకు అధికారాన్ని అనివార్యంగా, బలవంతంగా మార్చినప్పుడు సంక్షోభం ఏర్పడుతుంది. దేశ శాంతిని, సామరస్యాన్ని కాపాడడానికి దౌర్జన్యపరుడు, క్రూరుడు అయిన ఖలీఫా విషయంలో ఓర్పును, సహనాన్ని కలిగివుండండి అని ప్రవక్త ముహమ్మద్(స) ఉపదేశించారు. కాని ప్రస్తుతం ఓటింగ్ పద్ధతి అమలులో ఉంది. ఇప్పుడు దౌర్జన్యపూరిత, అహంకారభరిత అధికారిపై ఎలా చర్య తీసుకోవాలి? నేటి ప్రజాస్వామ్యంలో ఓటింగ్ పద్ధతిలో అధికారిని ఎన్నుకుంటారు. ఆ అధికారికి అప్పగించిన బాధ్యతను విస్మరించి, అధికార దుర్వినియోగానికి పాల్పడితే తిరిగి ఓటింగ్ ద్వారా అధికారం నుండి తొలగించబడతాడు. ఈ ప్రజాస్వామ్య ఓటింగ్ విధానంలో రక్తపాతమూ లేదు, అశాంతి, అలజడులూ లేవు. ధర్మం ఆశించేది కూడా అదే కదా!

ఓటింగ్ ద్వారా ఖలీఫాను నియమించిన తరువాత అతని పనితనంపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించాలి. ఒకవేళ స్వయంగా ప్రజలలో నుండే ఖలీఫాకు అర్హుడైన వ్యక్తి ఉన్నట్లయితే, ప్రస్తుత ఖలీఫా కన్నా ఈ వ్యక్తి మెరుగైనట్లయితే, అన్నివిధాలుగా తగినవాడయితే మొదట ఎన్నుకున్న ఖలీఫాను పదవీచ్యుతుణ్ణి చేసి తగిన వ్యక్తిని ఖలీఫా స్థానంలో కూర్చోబెట్టాలి. ఎందుకంటే అధికారం ఎవరి హక్కూ కాదు. అధికారం కేవలం అప్పగించబడిన బాధ్యత మాత్రమే. ఎవరినయినా అధికారం నుండి తొలగిస్తే అతని హక్కును కొల్లగొట్టినట్లు కాదు. అతడిని కేవలం బాధ్యత నుండి తప్పించినట్టు మాత్రమే. ఇదే షరీఅత్ విధానం.

ఒకే ఖలీఫాను నియమించాలి

దారుల్ ఇస్లాం (ఇస్లామీయ భూభాగం) ఎంత పెద్దగా విస్తరించి ఉన్నప్పటికీ ఒకే ఖలీఫాను నియమించాలి. వేర్వేరు ప్రదేశాలకు, వేర్వేరు పట్టణాలకు ఒక్కొక్క ఖలీఫాను నియమించడం సరైనది కాదు. విద్వాంసులు మావర్ది ఈ విధంగా రాస్తున్నారు :

"ఏక కాలంలో ఇద్దరు ఖలీఫాలు ఉండకూడదు."

ఒకరిద్దరు పండితులు (ఉలమాలు) తప్ప అందరి పండితుల అభిప్రాయం కూడా ఇదే. ఇమాం నవవీ(రహ్మా) ప్రకారం

పండితులందరిలో ఈ విషయమై ఏకాభిప్రాయం ఉంది. దారుల్ ఇస్లాం (ఇస్లామీయ దేశం) పరిధి చిన్నదయినా, పెద్దదయినా ఒకే కాలంలో ఇద్దరు వ్యక్తుల ఖిలాఫత్ (అధికారం) స్థాపించడానికి వీలులేదు.

ఇప్పుడు ప్రవక్త ముహమ్మద్(స) పవిత్ర వాక్కును గమనిద్దాం.

"ఒకవేళ ఇద్దరు వ్యక్తుల చేతిలో బైత్ చేసినట్లయితే, రెండవ వ్యక్తిని అంతమొందించాలి." (ముస్లిం)

షరీఅత్ రీత్యా ఒకే ఖలీఫాను నియమించాలి.

ప్రజలకుండే అలవాట్ల కారణంగా ప్రపంచ చరిత్రలో నిలిచిపోవాలనుకుంటారు. కొందరు ధైర్యం, సామర్థ్యం గలవారు తామే పాలనకు అన్ని విధాలుగా అర్హులుగా భావిస్తారు. అధికారాన్ని చేపట్టటమే ఆశయంగా తలపోస్తారు. మరికొందరు ప్రాంతాలవారీగా, వర్గాలవారీగా, వంశం మూలంగా తమ 'అహం' కారణంగా అధికారం కోసం ప్రాకులాడుతారు. మనుషులలో ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ వీరికి ఒక అధికార వ్యవస్థ తప్పనిసరి. ఈ అవసరాన్ని కాదనలేం, నిరాకరించలేం. అయితే ఇస్లాం ముస్లిములకు పై

లక్ష్యాల కోసం ఖిలాఫత్‌ను స్థాపించమని ఆదేశించదు. అధికారానికి మార్గ దర్శనం చేయడానికి ఆదేశాలను, నియమాలను, చట్టాలను ఏర్పరిచాడు అల్లాహ్. వీటిని ప్రజలలో అమలుపరిచే బాధ్యత ఖలీఫాది. ఖలీఫా ఇస్లాం ఆకాంక్షను, ధ్యేయాన్ని నలుమూలలా విస్తరింపజేయాలి. శత్రుసైన్యం నుండి దేశాన్ని కాపాడాలి. రాజ్య విస్తరణ కోసం పాటుపడాలి. ప్రజలందరూ ఐకమత్యంతో ఒకే జాతిగా, ఒకే సంఘంగా ఏర్పడాలి. అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకునేవారిగా రూపొందాలి. రాజ్యం చిన్నదయినా, పెద్దదయినా ఒకే అధికారి నియంత్రణలో ఉండాలి. అలా కాకుండా ప్రాంతాలవారీగా ఖలీఫాను నియమించడం ఇస్లాంకు వ్యతిరేకం. వర్గాలవారీగా, ప్రాంతాల వారీగా ఖలీఫాను నియమించినట్లయితే ఖలీఫాల మధ్య విభేదాలు తలెత్తి ఐకమత్యానికి విఘాతం కలుగుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఇస్లాం బలహీనపడుతుంది. విపరీతంగా నష్టపోతుంది. కాబట్టి ప్రజలు వేరుకాకుండా ఒకే ఖలీఫా నేతృత్వంలో ఉండటమే మేలయిన విధానం. అయితే ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఇస్లాంను అనుసరించే పూర్తి అనుచర గణం ఒకే సమాజం (ఉమ్మత్)గా ఎలా రూపొందుతుంది? ఇదెలా సాధ్యం?

భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ముస్లింల ప్రాంతాలన్నీ కలిసి వుండకపోవచ్చు. ఇరు ప్రాంతాల మధ్య అవాంతరాలు ఉండవచ్చు. ఒకవేళ భౌగోళికంగా కలిసి ఉన్నప్పటికీ మధ్యలో ముస్లిమేతర దేశం వుండవచ్చు. ఇలాంటి పరిస్థితులలో ఏం చేయాలి?

అబ్దుల్ ఖైస్ వంశానికి చెందిన ఒక వ్యక్తి ముహమ్మద్(స) సన్నిధిలో హాజరై ఈ విధంగా విన్నవించుకున్నాడు: "ఓ ప్రవక్తా(స)! మా స్వదేశానికి మీ ప్రాంతానికి మధ్య ముజర్ దేశస్తులు ఉన్నారు. వారు మా రాకపోకలను ఆటంకపరుస్తున్నారు. కాబట్టి మేము ఎప్పుడంటే అప్పుడు మీ వద్దకు రాలేం. కేవలం నిషిద్ధ (గౌరవ) మాసాలలో తప్ప. కావున మీరు(స) మాకు ముఖ్యమైన

ఉపదేశాలను తెలుపండి. దానిని మేము ఆచరిస్తూ మా దేశానికి వెళ్ళి వారికీ వినిపిస్తాం."

ప్రవక్త(స) చేసిన ఎన్నో ఉపదేశాలలో ఈ ఉపదేశం కూడా ఉంది.

"మీ యుద్ధసొత్తులో నుండి ఐదవ వంతు మీ దేశానికి ఇస్తూ వుండండి." (ముస్లిం)

ముస్లిం సమాజ క్రమశిక్షణ

ముస్లిం సమాజం కోసం కట్టుదిట్టమైన సామాజిక వ్యవస్థ ఎంత అవసరమో పూర్వపు పంక్తులలో తెలుసుకున్నాం. కాని వీరి మధ్య సంఘ జీవితం అన్ని కాలాల్లో ఒకేలా ఉండదు. ముస్లిములు విడిపోయి చిన్న చిన్న గ్రూపులుగా, ముఠాలుగా ఏర్పడతారు. వీరిలో క్రమశిక్షణా రాహిత్యం చోటు చేసుకుంటుంది. ఈ విధానాన్ని ఇస్లాం సుతరామూ ఇష్టపడదు. పైగా తీవ్రంగా పరిగణిస్తుంది. ముస్లిములను తిరిగి ఒకే తాటిపై తీసుకురావడానికి ఇస్లాం ఎలాంటి చర్యలను చేపడుతుంది?

ఇస్లాం మనిషికి మనిషికీ మధ్య ప్రేమాభిమానాలను ఏర్పరుస్తుంది. సత్సంబంధాలను ఏర్పరుస్తుంది. పగ, ఈర్ష్య, ద్వేషాలను పోగొట్టి వాటి స్థానే దయ, కరుణ, జాలి లాంటి సుగుణాలను పెంపొందిస్తుంది. ఖుర్ఆన్ గ్రంథాన్ని కేవలం పఠిత గ్రంథంగా భావిస్తూ, పఠనం ముగిసిన వెంటనే భద్రపరచడంతో సరిపెడుతున్నారు ముస్లింలు. అలాంటప్పుడు ఖుర్ఆన్‌లో అల్లాహ్ పంపిన ఆజ్ఞలు, ఉత్తర్వులు నియమాలు ఎలా తెలుస్తాయి? ఖుర్ఆన్‌లో మనిషి పుట్టుక నుండి చనిపోయే వరకు జీవితం గడిపే విధానాన్ని, అవలంబించే పద్ధతిని గురించి తెలియజేశాడు అల్లాహ్. చెల్లాచెదురైన ఈ జాతిని సంఘటిత పరచడానికి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవిస్తున్నాడు:

"ఓ విశ్వాసులారా! మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి." *(ఆలిఇమ్రాన్)*

"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు, ప్రవక్త ముహమ్మద్(స)కు విధేయత చూపండి." *(బఖర)*

పై ఖుర్ఆన్ వాక్యాలను గమనించినట్లయితే, మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి అంటే ప్రతీ ముస్లిం దీనిలో చేరివున్నాడు. ముస్లిముల్లో క్రమశిక్షణ కోసం ఎంత గట్టిగా తాకీదు చేయబడిందో దీని ద్వారా తెలుస్తుంది. ముస్లిములందరినీ కలిపివుంచేది అల్లాహ్ గ్రంథం ఖుర్ఆన్.

రెండవ ఖుర్ఆన్ వాక్యంలో కేవలం అల్లాహ్‌కే విధేయత చూపండి అని లేదు. అల్లాహ్‌తోపాటు ప్రవక్త(స)కూ విధేయత చూపండి అని ఉంది. అంటే ప్రతి ఒక్కరూ అల్లాహ్‌తోపాటు ప్రవక్త(స) పట్ల విధేయత పాటించాలి. అల్లాహ్ నిర్దేశించిన మార్గంలో, ప్రవక్త ఆచరించి నేర్పిన పాఠాలలో పయనించాలి. ముస్లిములు జీవితాలను పూర్తిగా ధర్మానికి అప్పజెప్పాలి. ధర్మానికి నిలువెత్తు నిదర్శనంగా బ్రతకాలి. అప్పుడు విభేదాలలో పడి విచ్ఛిన్నమవుతున్న ముస్లిములు తిరిగి ఒకే సంఘంగా రూపొందుతారు.

ఖుర్ఆన్ ఆదేశాలు, ఆజ్ఞలు ప్రత్యేక పరిస్థితికో, ప్రత్యేక కాలానికో పరిమితంకాదు. అదే విధంగా ఒక వంశానికి, ఒక ప్రాంతానికి, ఒక దేశానికి పరిమితం కావు. ఇవి సర్వ మానవాళి కోసం, సర్వ కాలాల కోసం, సర్వావస్థలో అనుసరించదగ్గవి.

పై వాక్యాలు ప్రవక్త(స) కాలంనాటి సహాబీలకు మాత్రమే చెందినవి కావు. ఆ కాలంతో పోల్చి చూసినట్లయితే అనైక్యతకు లోనైన నేటి ముస్లిములకు అల్లాహ్, ప్రవక్త(స) ఆదేశాలను అనుసరించవలసిన అవసరం ఇంకా ఎక్కువగా ఉంది. అల్లాహ్ ఆజ్ఞలతోపాటు ప్రవక్త(స) వాక్కునూ చూద్దాం.

“నేను మరణించిన తరువాత మీలో విభేదాలు కలుగుతాయి. మీలో బ్రతికి వున్నవారు దానిని చూడగలుగుతారు. ఇలాంటి సందర్భంలో మీరు నా సున్నత్‌ను, నా పూర్తి ఆజ్ఞలను, నన్ను అనుసరించే ‘ఖలీఫాల సున్నత్’ను గట్టిగా మునిపళ్ళతో పట్టుకోండి.” (అబూదావూద్)

ప్రవక్త ముహమ్మద్(స) ప్రతి ముస్లింను ఉద్దేశించి, “చూడండి మీరు నా అనుచర గణం(ఉమ్మత్)లో విభేదాలు తలెత్తే ప్రమాదం పసిగట్టినప్పుడు నా సున్నత్‌లోనూ, ఖుల్‌ఫాయె రాషిదీన్ నలుగురు ఖలీఫాలు. హ(జత్ అబూ బకర్(రజి), హ(జత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), హ(జత్ ఉస్మాన్ గని(రజి), హ(జత్ అలీ(రజి)ల సున్నత్‌ను తు.చ తప్పక పాటించాలి” మీ కొరకు ఇదియే సరైన మార్గం” అన్నారు.

ముస్లిములలో ఎప్పుడైనా సరే విభేదాలు తలెత్తినప్పుడు ప్రవక్త(స) సున్నత్‌ను, ఖలీఫాల సున్నత్‌ను అనుసరించి విభేదాలను దూరం చేసుకోవాలి. ముస్లిములు తమ విశ్వాసాన్ని (ఈమాన్) రక్షించుకునే పద్ధతి ఇదే.

బాగా ఆలోచించండి. నేటి ముస్లిముల్లో ప్రవక్త(స) ఆశించిన, సూచించిన ఐక్యత ఉందా? ఆ ప్రేమాభిమానాలు ఉన్నాయా? ఎన్నో విభేదాలకు లోనై ఉన్న విషయం వాస్తవం కాదా? కేవలం ఒక విషయం పట్ల స్పర్థలకు లోనయితే ప్రవక్త(స) సున్నత్‌ను, ఖలీఫాల జీవిత విధానాన్ని చూడాలి. వాటి ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. నేడు ముస్లిములు లోనై ఉన్న అనైక్యతను నికృష్టపు స్థితిని దూరం చేసుకోవాలంటే ప్రవక్త(స) చూపిన బాటలో నడవాలి. ప్రవక్త(స) ఆచారం, ఖలీఫాలు అనుసరించిన విధానం తెలుసుకుందాం.

ప్రవక్త ముహమ్మద్(స) కాలంలో ముస్లిముల మధ్య విభేదాలు లేవు. నేటి ముస్లిముల్లో కనబడే దుర్గుణాలు, దురలవాట్లు, స్పర్థలు, ఈర్ష్యాద్వేషాలు

అనే దుర్గంధం ప్రవక్త(స) కాలంనాటి ముస్లిముల్లో లేదు. ప్రవక్త(స) ఇచ్చే ఒకే ఒక్క పిలుపుతో ముస్లిములందరూ ఏకమయ్యేవారు. సద్గుణ సంపదను కలిగిన ఒక కొత్త సమాజాన్ని ఉనికిలోకి తెచ్చారు ప్రవక్త(స). అప్పుడు వారు జాతి విభేదాలకు లోనుకాలేదు. ప్రవక్త(స) ఆచారం (సున్నత్)లో జాతిలో స్పర్థలు కలిగినప్పుడు ఏమి చేశారు? అనేక దురలవాట్లకు, దుర్గుణాలకు లోనైన అరబ్బు ప్రజల నుండి మానవత్వం, దైవభీతిగల ఒక నూతన సమాజాన్ని, దైవభీతిగల సమాజాన్ని ఎలా ఉనికిలోకి తెచ్చారు? ప్రవక్త(స) అనుసరించిన విధానం ఏమిటి? ఏ విధానాన్ని, ఎలాంటి వైఖరిని ప్రవక్త(స) అనుసరించారో అదే విధానాన్ని, విచ్ఛిన్నమైన ప్రస్తుత ముస్లిం జాతి కోసం అనుసరించాలి. ప్రవక్త ముహమ్మద్(స) ప్రజలకు **'లా ఇలాహ ఇల్లల్లాహు'** కలిమాను నేర్పి మీ మీ పద్ధతుల ద్వారా, నమాజ్, రోజా పాటించండి అని చెప్పలేదు. **వఅతసిమూ బి హబ్‌లిల్లాహి జమీఅవ్ వలా తఫర్రఖూ** - అల్లాహ్ త్రాడును (ఖుర్‌ఆన్, హదీసును) మీరందరూ గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి అనే ఖుర్‌ఆన్ వాక్యాన్ని తమ జీవితంలో పూర్తిగా ఆచరించి చూపారు. ఇస్లాం స్వీకరించిన వారందరినీ దండలోని పూసల మాదిరిగా కలిపి ఉంచేవారు. ఇస్లాం స్వీకరించినవారు ఎక్కడ ఉన్నాసరే తమ స్వస్థలాన్ని వదిలి మదీనాకు వలసపోవలసిందే. అలా తమ ఇళ్ళను వదిలి మదీనాలో ఒకేచోట నివాసం ఉండటం ధార్మిక అవసరం, విశ్వాసానికి ప్రతీక. ఈ విధానం మక్కా విజయం వరకు ఆచరణలో ఉంది. మక్కా విజయానంతరం "ఇప్పుడు మీరు స్వస్థలాలను వదిలి మదీనా రావలసిన అవసరం లేదు. మీరు అక్కడే ఉండి వ్యక్తిగత సమస్యలతోపాటు సంఘ జీవితానికీ సఫలతను చేకూర్చండి" అని ప్రవక్త(స) చాటింపు వేయించారు.

ముస్లిములు విభేదాలకు, స్పర్థలకు, విచ్ఛిన్నానికి గురైనప్పుడు కూడా

ప్రవక్త(స) అనుసరించిన సున్నత్‌ను అవలంబించి సంఘీభావం గల సమాజం కోసం పాటుపడాలి. సమాజంలో శాంతిని స్థాపించాలి.

ఖలీఫాల సున్నత్ గురించి తెలుసుకుందాం

ప్రవక్త(స) పరమపదించిన తరువాత హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) మొదటి ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు. ప్రవక్త(స) తర్వాత ముస్లిం సమాజంలో కొంతమేరకు విభేదాలు చోటుచేసుకున్నాయి. అప్పటి కొన్ని తెగలు ఖలీఫా హజ్రత్ అబూబకర్(రజి)కు జకాత్‌ను ఇవ్వడానికి నిరాకరించాయి. మృదు స్వభావిగా పేరుగాంచిన అబూబకర్(రజి) ఈ విధంగా అన్నారు : "దైవసాక్షి! ఏ విధంగానైతే ప్రవక్త(స) ఉన్నప్పుడు ప్రభుత్వానికి జకాత్ ఇచ్చేవారో ఆ విధంగా నా ప్రభుత్వానికీ జకాత్ ఇవ్వాలి. అది ఒంటెను కట్టేసే త్రాడయినా సరే అప్పగించాల్సిందే. లేనిపక్షంలో నేను వారితో యుద్ధం చేస్తాను." (ముస్లిం)

ఖలీఫా మాటలను సూక్ష్మంగా పరిశీలించినట్లయితే అబూబకర్(రజి) ముస్లిములు తమ సంపద నుండి జకాత్ తీయనందుకు యుద్ధం చేస్తాను అనలేదు. ఆ జకాత్ నాకు అంటే ఇస్లామీయ ప్రభుత్వానికి చెల్లించడానికి నిరాకరించిన వారితో యుద్ధం చేస్తానని ప్రకటించారు. మరో విధంగా చెప్పాలంటే, జకాత్ సొమ్ము అర్హులైన వారికి ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ ధనాగారమైన బైతుల్ మాల్‌కు ఇవ్వనట్లయితే యుద్ధానికి ఉద్యుక్తులయ్యారు. జకాత్‌ను ప్రభుత్వానికి అప్పగించనట్లయితే ధర్మంలో చీలికను ప్రవేశపెట్టినట్లే. చీలికను చెరిపివేసి ధర్మాన్ని సురక్షితంగా ఉంచడానికి యుద్ధంలాంటి కఠినమైన నిర్ణయం తీసుకున్నారు.

మరోచోట ఈ విధంగా ఉంది : హజ్రత్ ఉమర్(రజి) హజ్రత్ అబూ బకర్ (రజి)కు ఈ విధంగా సలహానిచ్చారు. : "ఖలీఫా, మీరు వీరితో కాస్త

మెతక వైఖరిని అవలంబించండి." సమాధానంగా ఖలీఫా ఈ విధంగా అన్నారు: 'ఉమర్! అజ్ఞానకాలంలో నీవు కఠినుడిగా ఉండేవాడివి. ఇస్లాం స్వీకరించిన తరువాత దుర్బలుడిగా మారిపోయావా? నిస్సందేహంగా 'వహీ' ఆగమనం ఆగిపోయింది. అల్లాహ్ ధర్మం పరిపూర్తిగావించబడింది. మరి నేను బ్రతికుండగానే ధర్మంలో లోపాలు, సమాజంలో చీలికలు ఏర్పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా?"

ధర్మంలో ఒక్క అంశం లోపించినా ఆయా వ్యక్తుల ధర్మం లోప భూయిష్టంగా మారుతుంది. ధర్మ ప్రయోజనాలలో దేనికీ విఘాతం కలగ కూడదు. ఒకవేళ ధర్మంలో లోపాలు ఏర్పడినట్లయితే ముస్లిములు ప్రశాంతంగా కూర్చోకూడదు. లోపాలను పూడ్చడానికి ధర్మం పరిపూర్ణంగావించబడటానికి ముస్లిములు శతవిధాలా ప్రయత్నించాలి. ఎలాంటి విరామాన్ని, విశ్రాంతినీ తీసుకోకూడదు. కేవలం ఒక్క విషయం గురించి ఖలీఫా అబూబకర్(రజి) ఇంత తీవ్రంగా స్పందించారు. అటువంటిది నేడు ముస్లిములు లెక్కలేనన్ని అల్లాహ్ ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నారు. ఫలితంగా విభేదాలకు, విద్వేషాలకు, విచ్ఛిన్నతకు లోనై ఉన్నారు. తిరిగి వీరిని సమైక్యపరచడానికి ప్రవక్త(స) సున్నత్‌ను, ఖలీఫాల సున్నత్‌ను అనుసరించాలి.

ప్రవక్త ముహమ్మద్(స) గారి మరో హదీసునూ చూడండి : "ధర్మం ప్రారంభంలో దైన్యస్థితిలో నుండి వ్యాపించింది. కొంతకాలం తర్వాత తిరిగి అదే స్థితికి చేరుకుంటుంది. అప్పుడు నా సున్నత్‌ను పునరుద్ధరింపజేసే వారికి నా తరఫు నుండి శుభాకాంక్షలు తెలుపుతున్నాను."

అశ్రద్ధ, నిర్లక్ష్యం కారణంగా ధర్మాన్ని ఉపేక్షించి దుష్టకార్యాలకు పాల్పడిన వారి నుండి ధర్మాన్ని కాపాడి జీవింపజేసిన పుణ్యాత్ములకు ప్రవక్త(స) శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఇహలోకంలో అల్లాహ్ దాస్యం చేస్తూ భక్తిపరాయణతతో జీవితం గడప డానికి ప్రవక్త ముహమ్మద్(స) సున్నత్‌ను అనుసరించాలి. ఆ సున్నత్ చిన్నదైనా, పెద్దదయినా దానిని పాటించాల్సిందే. ప్రవక్త(స) అడుగుజాడల్లో మనం జీవితాలను గడపాలి. బాగా ఆలోచించండి. నేటి ముస్లిములు ధర్మానికి ఆమడ దూరంలో జీవిస్తున్నారు. జాతీయత పూర్తిగా నశించిపోయింది. లెక్కలేనన్ని షరీఅత్ ఆజ్ఞలను బేఖాతరుగా ఉల్లంఘిస్తున్నారు. ఇది మామూలు విషయం కాదు. తప్పకుండా ఇది విశ్వాసఘాతుకం. ఇంతకుమించిన దుర్మార్గాన్ని మనం ఊహించలేం. ఇలాంటి పరిస్థితిలో జాతిని సంస్కరించడానికి ఇజ్తిమా (సంఘం)ను స్థాపించాలి. ముస్లిముల మధ్య ప్రేమాభిమానాలు ఏర్పడి, దైవభీతిని పెంపొందించే ప్రతి ప్రయత్నం విడువకుండా చేయాలి.

ముస్లిములు - సామూహికత

ముస్లిములు వర్గాలుగా, గుంపులుగా రూపుదాల్చారు. ఈ పరిస్థితిలో వీరిని ఎలా సంస్కరించాలి? అందుకు అవలంబించవలసిన విధానం ఏది? 1) సమైక్యత కేవలం నలుగురితో రాదు. జాతి మొత్తం నిర్దిష్ట పద్ధతిలో ఇస్లాం కాంక్షించే రీతిలో సంఘంగా ఏర్పడాలి. దీనికి గాను అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోవాలి. సత్యానికి సాక్షులుగా, మేలును కోరుకునే వారుగా, ధర్మాన్ని స్థిరపరచేవారుగా రూపొందాలి. 2) నిర్దిష్టమైన సామూహిక వ్యవస్థ ధార్మికంగా వృద్ధి చెందాలి. 3) జాతిని సంస్కరించడానికి ప్రవక్త(స) అనుసరించిన రీతిని మనమూ నేడు అవలంబించాలి.

బహుదైవారాధనకు లోనైన అరబ్బు జాతిని ఒక కొత్త సమాజంగా రూపొందించడానికి ప్రవక్త(స) అనుసరించిన విధానం నేడు మనకు ఆమోద యోగ్యం అవునో కాదో చూద్దాం. ఖుర్‌ఆన్‌లో ప్రతిచోట, "విశ్వాసులారా!

అల్లాహ్‌కు భయపడండి! మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టు కోండి." అని ఉంది. అంటే ఇక్కడ ప్రత్యేకంగా ఒక ప్రాంతాన్నో, ఒక జాతినో సూచించడం జరుగలేదు. ఖుర్‌ఆన్ సమస్త మానవ జాతి కోసం అవతరిం చింది. ఈ గ్రంథం కేవలం ప్రవక్త(స)కు, ఆనాటి ప్రజలకు పరిమితం కాదు. ఇది సర్వమానవాళికి సంబంధించిన గ్రంథం. విభేదాలకు లోనై విచ్ఛిన్నతకు గురైన నేటి ముస్లిములకు ఇది మార్గదర్శక గ్రంథం.

ఏ విధానానయితే ప్రవక్త(స) ప్రారంభంలో అవలంబించారో సరిగ్గా నేడు కూడా ముస్లిములను ఒకే త్రాటిపై తీసుకురావడానికి ఆ విధానాన్నే అవలంబించాలి.

1) అందరికీ సత్యమార్గాన్ని బోధించాలి. ప్రజలు మరచిపోయి ఏమరు పాటుకులోనైన నిజధర్మాన్ని వారికి గుర్తుచేయాలి. మనిషి ఈ భువిపై ఎందుకు పంపబడ్డాడో తెలియజేయాలి. వారిని సంస్కరించి ధర్మంతో వారి సంబంధం పటిష్ఠం చేయాలి. సత్యధర్మాన్ని స్వీకరించినవారు ప్రతి విషయంలో అల్లాహ్ ఇష్టాయిష్టాలను తెలుసుకోవాలి. న్యాయనిర్ణేత అయిన అల్లాహ్ ఇష్టాల ముందు మన అభిప్రాయాలు, కోరికలు తృణ ప్రాయం.

2) సత్యధర్మం వైపు మొగ్గుచూపినవారు ఆ ఆచరణ వైపు అడుగులు వేయాలి. వ్యక్తిగతంగా ఆచరిస్తూ ధర్మనిష్ఠను కలిగివుంటే సరిపోదు. అందరూ కలిసి సమైక్యంగా ఒకే కూర్పులో ఉండాలి. ఒకే సము దాయంలో విధేయతా పూర్వకంగా ఉండాలి. వీరు ప్రతి పని అల్లాహ్ ఆదేశాల మేరకే చేయాలి. మంచిని ఆజ్ఞాపించాలి, సత్యానికి సాక్షులుగా నిలబడాలి, ధర్మాన్ని స్థాపించాలి.

3) ధర్మం ఆధారంగా ఏర్పడిన సంఘం రెండు ముఖ్యమైన విధులను నెరవేర్చవలసి ఉంటుంది. మొదటిది, తోటి వ్యక్తులందరినీ 'నిజధర్మం' వైపునకు ఆహ్వానించాలి. తద్వారా దారి తప్పిన ప్రజలు రుజుమార్గాన్ని అవలంబించే అవకాశం ఉంది. రెండవది, స్వయంగా సంఘంలోని వ్యక్తులను సంస్కరించాలి. వారి విద్యాజ్ఞానాలను వృద్ధిపరచాలి.

సమాజ నవీనత

వ్యక్తులు తిరస్కారం నుండి మరలి ధర్మాన్ని ఆచరించడం మొదలుపెట్టి నప్పుడు వారిని సంఘంగా ఏర్పరిచి ఎలా నవీకరించాలి? ప్రవక్తల కాలంలో ఈ ప్రశ్న ఉద్భవించదు. ఎందుకంటే, ప్రవక్తల మాటలను అనుయాయులు ఎల్లవేళలా ఆచరిస్తారు. ప్రవక్తను ప్రేమిస్తారు ప్రజలు. కాని ఇప్పుడు ప్రవక్తలు లేరు. ఇప్పుడు సంఘాన్ని సమాయత్తపరచడానికి ఒక నాయకుడు అవసరం. నమాజ్, రోజా, జకాత్, హజ్ లాంటి మౌలిక ఆరాధనల్లో సైతం ఇస్లామ్ సామూహికతను, ఒక నాయకుడిని ఏర్పాటు చేస్తుంది. సంఘానికి నాయకుడు ఎంత అవసరమో ఈ పుస్తకం మొదటి పంక్తుల్లో తెలుసుకున్నాం. దీనికిగాను ఖుర్‌ఆన్, సున్నత్‌లను ఆదర్శంగా తీసుకోవాలి. ముగ్గురు వ్యక్తులు అడవిలో ప్రయాణం చేస్తున్నా ఆ ముగ్గురి నుండి ఒకరిని 'అమీర్'గా ఎన్నుకోవాలి. ప్రవక్త(స) మక్కాలో ఉన్నప్పుడు ఇస్లాం స్వీకరించిన వారందరూ ప్రవక్త(స)కు విధేయులుగా ఉండేవారు. ప్రవక్త(స) తన అనుచరులను హిజ్రత్ కోసం ఎక్కడికైనా పంపిస్తే వారిలో ఒకరిని అమీర్‌గా నియమించి పంపించేవారు. ప్రవక్త ముహమ్మద్(స) మదీనా చేరిన తర్వాత ప్రవక్త(స)కు విధేయత చూపండి అని బాహాటంగా చెప్పబడింది. ఎందుకంటే మదీనా చేరిన తరువాత ఇస్లాంను అనేక మంది స్వీకరించారు. కొందరి విశ్వాసంలో లోపాలు ఉండేవి. ముస్లిం

సమాజంలో విభేదాలు, చీలికలు తలెత్తకుండా ప్రవక్త(స)కు విధేయత చూపడం తప్పనిసరి. ధర్మవ్యాప్తికై ప్రవక్త(స) ఇతర ప్రదేశాలకు తన అనుయాయులను పంపినప్పుడు ఒక అమీర్‌ను ఏర్పాటు చేసేవారు. ఆ తరువాతే అనుయాయులు ప్రయాణమయ్యేవారు.

దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, ధార్మికమైన జీవితాన్ని ఆచరించే వ్యక్తులందరూ, ఒంటరిగా విడిగా ఉండలేరు. వారంతా స్వయంగా ఒక సంఘాన్ని కోరుకుంటారు. ఇలా సంఘంగా ఏర్పడిన తరువాత షరీఅత్ రీత్యా ఒక అమీర్‌ను ఎన్నుకుంటారు.

ఏకాంత జీవితం

ఇస్లాంలో పటిష్ఠమైన సామాజిక వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అదే విధంగా ఖుర్‌ఆన్‌లో, ప్రవక్త(స) హదీసుల్లో చెప్పినట్లుగా ఏకాంత స్థలంలో తలదాచుకొని విశ్వాసాన్ని కాపాడుకోవడం కూడా ఇస్లామీయ పద్ధతే.

ఖుర్‌ఆన్‌లో 'సూరె కహఫ్'లో 'అస్‌హాబె కహఫ్' (గుహ వారు) ప్రస్తావన వుంది. ఈ అస్‌హాబె కహఫ్ జనావాసానికి దూరంగా వెళ్ళి విశ్వాసాన్ని రక్షించుకోవడానికి ఒక 'గుహ'లో తలదాచుకున్నారు. అక్కడ వారు అల్లాహ్‌ను ప్రార్థించారు. అసాంఘిక జీవితానికి చివరి రూపంగా వీరిని పేర్కొనవచ్చు.

> **"తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు వారు. మేము వారి సన్మార్గంలో వృద్ధి నొసగాము."** ***(సూరె కహఫ్ : 13)***

దీనికి చెందిన హదీసునూ చూడండి.

ప్రవక్త(స)ను ఒక వ్యక్తి ఇలా అడిగాడు : "ప్రవక్తా! అత్యుత్తమమైన వ్యక్తి ఎవరు?" ప్రవక్త(స) ఈ విధంగా జవాబిచ్చారు. "ఎవరైతే తన ధనాన్ని, ప్రాణాన్ని అల్లాహ్ మార్గంలో వెచ్చిస్తారో (అంటే జిహాద్ చేస్తారో) వారే

అత్యుత్తములు.” ఆ వ్యక్తి, “ఆ తరువాత ఎవరు?” అని అడిగాడు. అప్పుడు ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు, “ఎవరైతే ప్రజల దౌష్ట్యాన్ని భరించలేక కొండలలో, గుహలలో నివాసముండి అల్లాహ్‌ను ఆరాధిస్తారో వారే అత్యుత్తములు.” (ముస్లిం)

ప్రజలు ఒక ఆపదను ఎదుర్కోబోతున్నారు. ఆ కాలంలో ఒక ముస్లిం ఆస్తిపాస్తులు, సంపద అంతా అతని మేకలే. వాటిని తీసుకుని అతను కొండలలో, లోయలలో జీవిస్తాడు. ధర్మానికి సంభవించే ఉపద్రవం, పీడనం కారణంగా అతను అలా ప్రజలకు దూరంగా పరుగెత్తుతాడు.

ధర్మరక్షణార్థం సమాజం నుండి దూరంగా వెళ్ళిపోతే దోషం కాదు. పైగా అది మంచి పద్ధతే.

ఏకాంత జీవితం, రహస్య జీవితం మనిషికి ఏ విధంగా తగునో తెలుసుకుందాం.

మనిషి జన్మతః సంఘజీవి. సామాజిక వ్యవస్థకు కట్టుబడి జీవించాలి. సామాజిక జీవన విధానమే ఇస్లామ్‌కు అవసరం. విభేదాలకు దూరంగా ఉండండి అని నొక్కి చెబుతుంది ఇస్లామ్. గొర్రెల మంద నుండి దూరంగా వెళ్ళిపోయిన మేకను తోడేలు సునాయాసంగా తింటుంది. అదేవిధంగా సమాజాన్ని కాదని దూరంగా వెళ్ళిన వ్యక్తిని షైతాన్ ఇట్టే లోబరుచుకుంటాడు.

ఒంటరితనం, రహస్య జీవితం అనేది మనిషి స్వభావానికే వ్యతిరేకం. అల్లాహ్ మనిషికి తన ప్రతినిధి హోదాను ఇచ్చి ఈ భువిపైకి పంపాడు. మనుషులందరూ ఎవరి ఇష్టానుసారం వారు ఒంటరిగా జీవించినట్లయితే మనుషులకు 'ఖిలాఫత్' అవసరమే ఉండదు. మనుషుల్లో సామాజికత లేనప్పుడు వారు కలిసి మనుగడ సాగించటం, ఒకరికొకరు సహకరించడం

లేదా దౌర్జన్యాలు చేయడం సంభవించవు. అలాంటప్పుడు, షరీఅత్ నేర్పే మంచిని ఆజ్ఞాపించడం, సత్యానికి సాక్షులుగా నిలబడటం, ధర్మాన్ని స్థాపించడం లాంటి పదాలకు అర్థమే ఉండదు. మరి రహస్య జీవితానికి ఇస్లాంలో శాస్త్రీయత ఎలా లభించింది?

మొదటి హదీసులో ప్రవక్త(స) కొండలలో, కోనలలో వెళ్ళి ఆరాధనలు చేసేవారిని, తమ విశ్వాసాన్ని రక్షించుకునేవారిని ఉత్తమ విశ్వాసిగా పేర్కొన్నారు. సూక్ష్మంగా చూసినట్లయితే ఈ హదీసులో రెండు విషయాలు ఉన్నాయి.

1) ధర్మమార్గంలో, ధర్మరక్షణార్థం తన ఆస్తిపాస్తులను, ప్రాణాన్ని లెక్కచేయని వ్యక్తిని ఉత్తమ వ్యక్తిగా చెప్పి మౌనం వహించారు.

2) ప్రశ్నిస్తున్న ఆ వ్యక్తి, "ఆ తరువాత ఉత్తమ వ్యక్తి ఎవరు?" అని అడిగినప్పుడు ప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు: "ఆ తరువాత విశ్వాస రక్షణార్థం జనావాసానికి దూరంగా కొండలలో వెళ్ళి దైవారాధన చేసే వ్యక్తి ఉత్తమ వ్యక్తి."

రహస్యంగా జీవించడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులు కారణమవుతాయి. గత్యంతరంలేని స్థితిలోనే ఇది ఆమోదయోగ్యం. రెండవ హదీసులో కూడా ఏకాంత జీవితానికి ప్రోత్సాహం కనబడుతుంది. "ప్రజలు ఒక విపత్కర కాలం ఎదుర్కోబోతున్నారు." అంటే– ప్రజల ధర్మ రక్షణ సమాజంలో కష్టమైపోతుంది. అప్పుడు తమ మేకలను తోలుకుని అడవులకు వెళ్ళాలి. ధర్మాన్ని కాపాడటానికి అలా వెళ్ళాలి. అక్కడే ఆరాధనలు చేయాలి.

అస్‌హాబె కహఫ్(గృహ వాసులు) వృత్తాంతంలో వారి సంఖ్య కొద్ది మందికి మించిలేదు. వారి జాతివాసులందరూ మార్గభ్రష్టులే. వారు తమ జాతి

వారికి అల్లాహ్ ఏకత్వం గురించి బోధించారు. ధర్మవ్యాప్తికి వారు తమ శక్తిమేర కృషిచేశారు. వారు తమ జాతి వారితో చర్చలు జరిపారు. తర్కం కాస్తా వాదోప వాదాలుగా మారినప్పుడు మౌనం వహించారు. ఇక 'వారు' ఆ జాతివాసుల మధ్య బ్రతకాలంటే, తమ ధర్మాన్ని వదులుకోవడమో లేక తమ ప్రాణాలను బలి ఇవ్వడమో తేల్చుకునే విపత్కర స్థితిలో వారు 'గుహ'ను తాత్కాలికంగా ఆశ్రయించారు.

అసాధారణ స్థితిలో, విపత్కర పరిస్థితిలో రహస్య జీవితం కొనసాగించవచ్చు.

ఈ భువిపైకి ఎందరో ప్రవక్తలు వచ్చారు. ధర్మ వ్యాప్తికై ప్రవక్తలు ఎన్నో ఇబ్బందులు భరించవలసి వచ్చేది. ఆ కాలం నాటి ప్రజలు ప్రవక్తలను మాటలతో, చేతలతో కష్టపెట్టేవారు, హింసించేవారు. ప్రజలు పెట్టే బాధలనన్నింటినీ ఓపికతో సహించేవారు. కాని కష్టాలకు జడిసి అడవులకు, కొండలకు వెళ్ళలేదు. నిజ ధర్మరక్షణకై ఆస్తులను, ప్రాణాలను ధారపోశారు ప్రవక్తలు. ప్రవక్తలు తమ ఆస్తులను, తమ ప్రాణాలను తమవిగా భావించేవారు కాదు. అంతా దేవుని వరప్రసాదంగా తలపోసేవారు. ధర్మమార్గంలో తమ ప్రాణాలను సైతం అర్పించారు ప్రవక్తలు.

అసలు ఇస్లామీయ పద్ధతి అంటే సామాజిక జీవన విధానమే. సమాజంలో ఉంటూ సమాజపు ఆటుపోటులకు గురవుతూ సహనం పాటించినవారు ఎక్కడో గుహల్లో ఆరాధనలు జరిపేవారికంటే ఉన్నతులైనవారే. గుహలలో, అడవులలో నమాజ్, రోజా లాంటి ఆరాధనలు వ్యక్తిగతమవుతాయి. సామాజిక జీవనం గడిపేవారు నమాజ్, రోజాలతోపాటు ధన, ప్రాణాలను సైతం ధర్మానికి అంకితం చేస్తారు. కాబట్టి సామాజిక జీవనంతో పోల్చినట్లయితే వ్యక్తిగత, **ఏకాంత జీవితం రెండవ కోవకే చెందుతుంది.**

పరిస్థితులు, షరీఅత్

సమాజంలో అల్లర్లు, దౌర్జన్యాలు, పాపకార్యాలు పెట్రేగిపోతున్నప్పుడు సంస్కరించడానికి ఎంత ప్రయత్నించినా మంచి అనేది సాధ్యం కానప్పుడు, ధర్మానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నప్పుడు గుహలలో వెళ్ళి నివాసం ఉండవచ్చు.

సమాజంలో అల్లర్లు, దౌర్జన్యాలు సహజంగా జరుగుతూనే ఉంటాయి. ఇవి ప్రవక్తల కాలాల్లోనూ సంభవించాయి. సహాబా(రజి)ల కాలంలోనూ సంభవించాయి. సమాజంలో ఐకమత్యం కొరవడినప్పుడు ఎల్లెడలా పీడన జరుగుతున్నా ఒక విశ్వాసి జమాఅత్ (సంఘం)తో కలిసి ఉండడానికి ప్రయత్నించాలి. ధర్మాన్ని వృద్ధిపరచడానికి నిరంతరం కృషి చేయాలి. సమాజం నుండి బాహాటంగా ప్రమాదాన్ని పసిగట్టినప్పుడు మాత్రమే రహస్య జీవితాన్ని అంచెలవారీగా అవలంబించాలి.

-: సమాప్తం :-